RNI No. APTEL/2006/17880 www.bharathasakthi.com



# భారత శక్తి®

తెలుగు దినపత్రిక

VOICE OF INDIAN



Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal

సంపుటి: 19 సంచిక:131 హైదరాబాద్, మంగళవారం, 19 నవంబర్ 2024 పేజీలు: 12 వెల: 1.00

## హైదరాబాద్‌లో మరో కంపెనీపై ఐటీ దాడులు..

హైదరాబాద్: నగరంలోని పలు ప్రాంతాల్లో స్వస్తిక్ గ్రూప్ సంస్థలపై ఆదాయపు పన్ను అధికారులు దాడులు నిర్వహిస్తున్నారు. పలు బృందాలుగా ఏర్పడిన అధికారులు బేగంబజార్‌లోని స్వస్తిక్ మిర్చి కార్యాలయంతోపాటు బంజారాహిల్స్, చేవెళ్ల, షాద్‌నగర్‌లో ఏకకాలంలో సోదాలు చేపట్టారు. స్వస్తిక్ రియల్టర్ కంపెనీలో తనిఖీలు చేస్తున్న ఐటీ అధికారులు.. ఆ సంస్థ మేనేజర్లు కల్పన రాజేంద్ర, లక్ష్మణ్ నివాసాలపై సైతం దాడులు చేశారు. షాద్‌నగర్‌లో ఓ మల్టీ నేషనల్ కంపెనీకి రూ.300 కోట్ల విలువైన భూమిని స్వస్తిక్ రియల్టర్ కంపెనీ విక్రయించింది. అయితే దానికి సంబంధించిన వివరాలను కంపెనీ బ్యాలెన్స్ షీట్‌లో ఎక్కడా చూపలేదనే ఆరోపణలు గుప్పుమన్నాయి. ఈ నేపథ్యంలో భారీ బందోబస్తు నడుమ ఐటీ అధికారులు సోదాలు చేపట్టారు.




## మణిపూర్‌కు మరో 50 సీఆర్‌పీఎఫ్ కంపెనీలు.. అమిత్‌షా సమీక్ష

న్యూఢిల్లీ: మణిపూర్‌లో మళ్లీ హింసాకాండ ప్రజ్వరిల్లడంతో అక్కడి పరిస్థితిపై కేంద్ర హోం మంత్రి అమిత్‌షా రెండో రోజైన సోమవారంనాడు కూడా అత్యున్నత స్థాయి భద్రతా సమావేశంలో సమీక్షిమించారు. ఈశాన్య రాష్ట్రంలో ఉద్రిక్తతలు తారాస్థాయికి చేరుతుండంతో రాష్ట్రంలో భద్రతను మరింత పటిష్టం చేయాలని హోం శాఖ నిర్ణయించింది. ప్రస్తుతం ఉన్న భద్రతా పరిస్థితిని అమిత్‌షా సమీక్షించడంతో పాటు, ఎలాంటి పరిస్థితుల్లోనూ శాంతి భద్రతల పరిరక్షణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సీఆర్‌పీఎఫ్, రాష్ట్ర పోలీసు అధికారులకు ఆదేశాలిచ్చారు.

మణిపూర్‌కు అదనంగా 50 కంపెనీల సీఆర్‌పీఎఫ్ బలగాలను పంపించాలని కేంద్రం నిర్ణయించింది. ప్రస్తుతం 20 కంపెనీల సీఆర్‌పీఎఫ్ బలగాలు రాష్ట్రంలో మోహరించగా, తాజా నిర్ణయంతో 70 కంపెనీల సీఆర్‌పీఎఫ్ బలగాలు రాష్ట్రంలో శాంతి భద్రతల పరిరక్షణ బాధ్యతను తీసుకుంటాయి.

గత ఏడాది మణిపూర్‌లో చెలరేగిన జాతుల ఘర్షణలో 200 మందికి పైగా ప్రాణాలు కోల్పొగా, వేలాది మంది నిరాశ్రయులయ్యారు. పరిస్థితి నివురుగప్పిన నిప్పులా ఉన్న తరుణంలో గత శనివారంనాడు తిరిగి హింసాకాండ




చెలరేగింది. సాయుధ మిలిటెంట్లు ఆరుగురు గ్రామస్థులను కిడ్నాప్ చేసి ఊచకోత కోసి చంపడంతో ఒక్కసారిగా ఆందోళనలు పెల్లుబికాయి. నిరసనకారులు పలువురు మంత్రులు, ఎమ్మెల్యేల ఇళ్లపై దాడులు చేసి, వాహనాలను తగులబెట్టారు. సీఎం బీరేంద్ర సింగ్ ఇంటిపై కూడా దాడికి విఫలయత్నం చేశారు. నిరసనలు, ఆందోళనలను అదుపు చేసే క్రమంలో భద్రతా బలగాలు జరిపిన కాల్పుల్లో జిరిబాం జిల్లాకు చెందిన 20 ఏళ్ల యువకుడు ప్రాణాలు కోల్పోయాడు. ఆందోళనకారులు స్థానిక బీజేపీ, కాంగ్రెస్ కార్యాలయాల్లోకి చొరబడి ఆస్తుల విధ్వంసానికి పాల్పడ్డారు. ఫర్నిచర్‌ను దగ్ధం చేశారు. మణిపూర్‌లో సంక్షోభం ముదురుతుండటంతో శాంతిభద్రత వైఫల్యానికి నిరసగా బీజేపీ సారథ్యంలోని బీరేంద్ర సింగ్ ప్రభుత్వానికి నేషనల్ పీపుల్స్ పార్టీ (ఎన్‌పీపీ) మద్దతును ఉపసంహరించుకుంది.

### మూడు కేసుల దర్యాప్తు ఎన్ఐఏకు..

కేంద్ర హోం శాఖ ఆదేశాల మేరకు ఇటీవల మణిపూర్‌లో చెలరేగిన హింసాకాండకు సంబంధించిన మూడు కేసుల దర్యాప్తు బాధ్యతను నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ (ఎన్ఐఏ) చేపట్టింది. వీటిలో కుకీ ఉగ్రవాదులకు, సీఆర్‌పీఎఫ్‌కు మధ్య ఇటీవల జరిగిన కాల్పులకు సంబంధించిన కేసు కూడా ఉంది. ఈ ఎన్‌కౌంటర్‌లో 11 మంది కుకీ ఉగ్రవాదులను బలగాలు మట్టుబెట్టాయి.

## కాంగ్రెస్ ప్రభుత్వం ఏ పనిని కూడా కక్షపూరితంగా చేయదు: మంత్రి పొంగులేటి




హైదరాబాద్: గత ప్రభుత్వం చేసిన తప్పులను కాంగ్రెస్ ప్రభుత్వం సరిదిద్దుతోందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి (అన్నారు. సచివాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మంత్రి మాట్లాడారు. మంచి ప్రతిపక్షంగా విలువైన సూచనలు ఇస్తే.. స్వీకరిస్తామన్నారు. ఎంతో దూరదృష్టితో కాంగ్రెస్ ప్రభుత్వం సర్వేను చేపట్టిందని చెప్పారు. అయితే, గత ప్రభుత్వం సమగ్ర సర్వే నివేదికను ఎందుకు బయటపెట్టలేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏ పనిని కూడా కక్షపూరితంగా చేయడం లేదని స్పష్టం చేశారు. గత ప్రభుత్వంలోని నేతలు చేసిన అక్రమాలపై చట్టపరంగానే చర్యలుంటాయని మంత్రి పొంగులేటి తెలిపారు.

## గచ్చర్లలో దాడి చేసింది కేటీఆర్ అనుచరులే: మంత్రి కోమటిరెడ్డి

%హైదరాబాద్: వికారాబాద్ జిల్లా లగచర్లలో ఘర్షణకు దిగింది కేటీఆర్ అనుచరులేనని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆరోపించారు. గతంలో తాము కూడా ఎన్నో నిరసనలు, ఉద్యమాలు చేశామని, ఏనాడూ పోలీసులు, కలెక్టర్లపై దాడికి పాల్పడలేదన్నారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎవరైనా శాంతియుతంగా ఆందోళన చేస్తే తప్పు లేదన్నారు. అయితే, లగచర్లలో భూములు లేని స్థానికేతరులను తీసుకొచ్చి గొడవ చేయించారని మండిపడ్డారు. నిందితుడు సురేశ్ మాజీ ఎమ్మెల్యేతో 90 సార్లు మాట్లాడారని అన్నారు. రేప్ కేసులో నిందితుడిగా ఉన్న సురేశ్ తన అనుచరుడేనని కేటీఆర్ కూడా గతంలో అంగీకరించినట్లు చెప్పారు.

"మూసీ పునరుజ్జీవంపై భారాస రాద్ధాంతం సృష్టిస్తోంది. మూసీ పునరుజ్జీవం వద్దని మాజీ సీఎం కేసీఆర్ బయటకు వచ్చి చెప్పాలి. అలా చెప్తే పనులు ఆపేస్తాం. ఆర్‌ఆర్‌ఆర్‌కు ఇప్పటికే 90శాతం భూసేకరణ పూర్తి చేశాం. దీనికి సంబంధించి జనవరిలో టెండర్లు పిలుస్తాం. రైతులకు భూ పరిహారం చెల్లించిన తర్వాతే పనులు ప్రారంభిస్తాం. రూ. వేల కోట్లు వచ్చే ఓఆర్‌ఆర్‌ను కేవలం రూ.7 వేల కోట్లకే అప్పగించారు. గత ప్రభుత్వం ఆర్‌ఆర్‌ఆర్ ప్రాజెక్టును 2016 నుంచి పెండింగ్‌లో పెట్టింది. ఆర్‌ఆర్‌ఆర్ భూసేకరణకు ఇచ్చే నిధులపై కేంద్రం స్పష్టత కోరితే ఇవ్వలేదు. గత ప్రభుత్వ వైఖరి వల్ల ఈ ప్రాజెక్టుపై అడుగు ముందుకు పడలేదు.




ఓఆర్‌ఆర్ వల్లే ఆర్‌ఆర్‌ఆర్ కూడా హైదరాబాద్, తెలంగాణకు గేమ్‌ఛేంజర్ అవుతుంది. శ్రీశైలం క్షేత్రానికి రూ.7 వేల కోట్లతో ప్రాజెక్టు సాధించనున్నాం. శ్రీశైలానికి రిజర్వ్ ఫారెస్ట్ గుండా 62 కి.మీ మేర సింగిల్ పిల్లర్ ఫ్లై ఓవర్ ప్రాజెక్టు సాకారం అవుతుంది. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి మూసీ ప్రాంతానికి మాత్రమే పరిమితమయ్యారు, యాదాద్రి జిల్లాలో పర్యటించాలి. కేంద్రమంత్రిగా సింగరేణి గురించి ఎందుకు ఆలోచించటం లేదు? మణిపుర్ ఘర్షణల గురించి ఈ కేంద్ర మంత్రులు ఎందుకు మాట్లాడరు?" అని కోమటిరెడ్డి ప్రశ్నించారు.

## కేసీఆర్, రేవంత్‌రెడ్డి నైతిక విలువలు వదిలేశారు: కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

హైదరాబాద్: రాష్ట్రంలో భారాస, కాంగ్రెస్ పార్టీలు దిగజారుడు రాజకీయాలు చేస్తున్నాయని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి విమర్శించారు. గతంలో భారాస ప్రభుత్వం ఎలా ఉందో.. ఇప్పుడు కాంగ్రెస్ సర్కారు కూడా అలాగే ఉందన్నారు. అదే రకమైన అవినీతి, గాలి మాటలు విని ప్రజలు విసిగిపోతున్నారన్నారు. కేసీఆర్ ( రేవంత్‌రెడ్డి రాజకీయాల్లో నైతిక విలువలు వదిలేశారని మండిపడ్డారు. రాష్ట్రాన్ని పూర్తిగా భ్రష్టు పట్టించే ప్రయత్నం చేస్తున్నారని వ్యాఖ్యానించారు. కేసీఆర్ రూ.7 లక్షల కోట్ల మేర అప్పులు చేశారన్నారు. రేవంత్ ఏకంగా అప్పుల కోసం ఒక టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేశారని మండిపడ్డారు.



"రైతు భరోసా, రుణమాఫీ లేదు. పింఛన్లు పెంచుతామన్నారు.. ఒక్క రూపాయి పెంచలేదు, కొత్త పింఛన్లు ఇవ్వలేదు. రేవంత్‌రెడ్డి వ్యక్తిగత విమర్శలకు దిగుతున్నారు. హామీలన్నీ ఆయన గాలికొదిలేశారు. పైగా మహారాష్ట్రలో నిర్వహిస్తున్న ప్రచారంలో తెలంగాణ సస్యశ్యామలం అయిందంటూ మాట్లాడుతున్నారు. ఇంతకంటే అబద్ధాలు ఉంటాయా? కాంగ్రెస్, భారాస తమ వైఫల్యాలు కప్పిపుచ్చుకునేందుకు ప్రయత్నిస్తున్నాయి. భాజపా నిర్మాణాత్మక రాజకీయాలు చేస్తోంది. స్థానిక సంస్థల ఎన్నికలు దృష్టిలో పెట్టుకుని భాజపా పోలింగ్ బూత్ కమిటీల నియామకం చేపట్టాలి. మళ్లీ మండల స్థాయి వర్క్‌షాపులు ఉంటాయి. ఈ నెల 22న దిల్లీలో జరగనున్న పార్టీ సంస్థాగత సమావేశాల్లో మండల, జిల్లా ఎన్నికల తేదీలు వస్తాయి. తెలంగాణలో పనిచేయడానికి గుత్తేదారులు ముందుకు రావడం లేదు. దేశంలో కాంగ్రెస్ పార్టీ మూడు రాష్ట్రాల్లో అధికారంలో ఉండి భ్రష్టు పట్టించింది" అని కిషన్‌రెడ్డి విమర్శించారు.

## ఆరు గ్యారెంటీల అమల్లో రేవంత్ రెడ్డి డకౌట్.. విమర్శించిన హరీశ్‌రావు

హైదరాబాద్ : కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారెంటీలను అమలు చేయడంలో రేవంత్ రెడ్డి డకౌట్ అయ్యారని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శించారు. పేదోళ్ల ఇండ్లు కూలగొట్టడమే రేవంత్ హిట్ వికెట్ అని పేర్కొన్నారు. తుర్కయాంజల్ జేబీ గ్రౌండ్స్‌లో నిర్వహించిన తెలంగాణ ఛాంపియన్ ట్రోఫీ క్రికెట్ టోర్నమెంట్‌లో హరీశ్‌రావు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు.

గెలిచిన టీం కాదు, ఓడిపోయిన టీం కూడా బాగా ఆడారు. గెలుపోటములు చాలా సహజం. భవిష్యత్తులో గెలుపు కోసం పోరాటం చేయాలి. ఆరు గ్యారెంటీలు బంద్ పెట్టి మూసీ దుకాణం మొదలు పెట్టిండు రేవంత్ రెడ్డి. 31 ఎస్టీపీలు, రూ. 3800 కోట్లతో మూసీ అభివృద్ధిని కేసీఆర్ ప్రారంభించాడు. కాళేశ్వరం ద్వారా గోదావరి నీళ్లను రూ. 1100 కోట్లతో మూసీలో పోయాలని ప్లాన్ చేశారు. మూసీ శుద్ధి చేయాలంటే గోదావరి నీళ్లు తేవాలి.



అంతేగాని గరీబోళ్ల ఇల్లు కూలగొట్టడం కాదు. మూసీ పేరుతో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తా అంటే బీఆర్ఎస్ ఊరుకోదు అని హరీశ్‌రావు హెచ్చరించారు.

## మణిపూర్, లక్షద్వీప్ కంటే లగచర్ల ఘటన చిన్నదేమీ కాదు.. ప్రధాని మోదీ, రాహుల్ గాంధీ స్పందించాలి : కేటీఆర్

మణిపూర్, లక్షద్వీప్ కంటే లగచర్ల ఘటన చిన్నదేమీ కాదని.. ఈ ఘటనపై ప్రధాని నరేంద్ర మోదీ, కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ స్పందించాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు డిమాండ్ చేశారు. లగచర్ల బాధితులతో కలిసి ఆయన జాతీయ మానవహక్కుల సంఘాన్ని కలిశారు. అనంతరం బాధితులతో కలిసి ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. తెలంగాణలో ఏం జరుగుతుందో దేశానికి తెలియాలని.. పేద గిరిజనుల భూములను రేవంత్ సర్కార్ బలవంతంగా గుంజుకుంటోందని కేటీఆర్ ఆరోపించారు. అర్ధరాత్రి పోలీసులు, ప్రైవేటు వ్యక్తులతో కలిసి దళిత రైతుల ఇళ్లపై దౌర్జన్యకాండ జరుగుతుందని.. సీఎం బ్రదర్ గిరిజన రైతులపై దాడి చేసినా కేసులుండవని విమర్శించారు. ప్రజాప్రతినిధి కాకున్నా సీఎం సోదరుడికి కలెక్టర్ స్వాగతం పలుకుతున్నారన్నారు. రాజ్యాంగ రక్షకులమంటున్న రాహుల్ సీఎం నియోజకవర్గంలో దమనకాండ స్పందించాలన్నారు. లగచర్లలో అర్ధరాత్రి మహిళలపై పోలీసుల దాడి చేశారని.. గిరిజన రైతులపై అక్రమంగా అరెస్టు చేసి చిత్రహింసలు పెట్టారన్నారు.లగచర్ల ఘటనపై ప్రధాని మోదీ, రాహుల్, ఖర్గే ఎందుకు స్పందించరు? అంటూ ప్రశ్నించారు.



మణిపూర్, లక్షద్వీప్ కంటే లగచర్ల ఘటన చిన్నదేమీ కాదని.. సీఎం సోదరుడి కంపెనీ కోసమే ఇంతమంది గిరిజనులు బాధపెడుతున్నరని ఆరోపించారు. తెలంగాణలో ఏం జరుగుతుందో తెలియనట్లు బీజేపీ నాటకాలు ఆడుతుందని.. సీఎం నియోజకవర్గంలో జరుగుతున్న దమనకాండపై స్పందించాలని డిమాండ్ చేశారు. పేద గిరిజనుల బాధ రాహుల్‌గాంధీకి కనిపిస్తలేదా?.. లగచర్లపై అర్ధరాత్రి దమనకొండ బీజేపీకి కనబడడం లేదా? అంటూ నిలదీశారు. కొడంగల్‌లో 3వేల ఎకరాల్లో ఫార్మా విలేజీ కోసం సీఎం నిర్ణయించారని.. రైతులకు నోటీసులు ఇచ్చి.. వాటిని తిరస్కరించిన వారిని బెదిరిస్తున్నారన్నారు.

భారత శక్తి
VOICE OF INDIAN

## ఢిల్లీలో కాలుష్యానికి పరిష్కారమెప్పుడు

శీతాకాలంలో తక్కువ ఉష్ణోగ్రత కారణంగా, గాలి చల్లగా మారుతుంది. చల్లని గాలి.. వెచ్చని గాలి కంటే బరువు ఎక్కువగా ఉంటుంది. అందుకే కిందికి వస్తుంటుంది.మనం గాలి పీల్చుకుని బతుకుతాం.. కానీ దేశ రాజధాని ఢిల్లీలో మాత్రం గాలి పీల్చుకుని బతకలేమన్నట్లుగా పరిస్థితి రోజురోజుకూ దిగజారుతోంది. కాలుష్య నియంత్రణకు ఢిల్లీ ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు చేపట్టింది. ఢిల్లీ ఈ రోజుల్లో తీవ్రమైన కాలుష్యంతో సతమతమవుతోంది. శీతాకాలం మొదలైందంటే ఢిల్లీ వాసుల గుండెల్లో గుబులు రేగుతుంది. శీతాకాలంలో అక్కడ ప్రజలకు నిత్యనరకమే. కాలుష్యం కమ్మేసి. గాలి మొత్తం విషతుల్యమైపోతుంది. పొరుగున పంజాబ్, హర్యానా రాష్ట్రాల్లోని రైతులు పంట వ్యర్థాలను తగులబెట్టడం.. గాలివేగం తగ్గిపోవడం వంటి కారణాలతో దట్టమైన పొగమంచు అలముకుంటుంది. గత ఐదు రోజులుగా ఢిల్లీలో గాలినాణ్యత అత్యంత ప్రమాదకర స్థాయికి మించిపోయింది. దీంతో దేశ రాజధాని నగరం గ్యాస్ ఛాంబర్ గా మారిపోయింది. పొగమంచు కమ్మేయడంతో అనేక విమానాలు రద్దవగా.. మరికొన్ని ఆలస్యంగా నడు?స్తున్నాయి. కొన్నింటిని దారి మళ్లించారు.. ఢిల్లీవాసులు నీటి కాలుష్యంతో కూడా సతమతమవుతున్నారు. యమునా నది ఇంకా నురగలు కక్కుతూనే ఉంది. ఇప్పటికే నదిలో నీరు విషతుల్యంగా మారింది. ముంబైలోనూ ఇలాంటి పరిస్థితులు కనిపిస్తున్నాయి. దేశంలోని అనేక ఇతర నగరాల్లో కూడా కాలుష్య పరిస్థితి తీవ్రంగా ఉంది..శీతాకాలంలో తక్కువ ఉష్ణోగ్రత కారణంగా, గాలి చల్లగా మారుతుంది. చల్లని గాలి.. వెచ్చని గాలి కంటే బరువు ఎక్కువగా ఉంటుంది. అందుకే కిందికి వస్తుంటుంది. దీని కారణంగా గాలి నిలువు వేగం తగ్గుతుంది. కలుషిత మూలకాలు గాలిలో చిక్కుకుంటాయి. ఇది కాకుండా, శీతాకాలంలో గాలిలో తేమ తక్కువగా ఉంటుంది. తేమ కాలుష్య కారకాలు ఒకదానితో ఒకటి అతుక్కొని నేలపై పడటానికి సహాయపడుతుంది, అయితే తేమ తక్కువగా ఉన్నప్పుడు కాలుష్య కణాలు గాలిలో తేలుతూనే ఉంటాయి.ఇది కాకుండా, కొన్నిసార్లు ఒక వింత పరిస్థితి తలెత్తుతుంది. దీనిని విలోమ ఉష్ణోగ్రత అని పిలుస్తారు. దీనిలో ఉష్ణోగ్రత ఎత్తుతో పెరగడం ప్రారంభమవుతుంది. అయితే సాధారణంగా ఉష్ణోగ్రత ఎత్తుతో తగ్గుతుంది. ఈ పరిస్థితిలో, వేడి గాలి దిగువన ఉన్న చల్లని గాలిని నొక్కడం వలన కలుషితమైన కణాలు గాలిలో చిక్కుకుంటాయి. చలికాలంలో పొగమంచు సర్వసాధారణం. వారు కాలుష్య కణాలను గ్రహించి వాటిని గాలిలో కలుపుతుంది. తద్వారా కాలుష్య స్థాయిని పెంచుతుంది.చలికాలంలో వెచ్చటి దుస్తులు ధరించడం, హీటర్లు వాడడం, వాహనాల సంఖ్య పెరిగి వాహనాల నుంచి వెలువడే పొగ వల్ల గాలి కలుషితమవుతుంది. ఇది కాకుండా, శీతాకాలంలో అనేక పరిశ్రమలలో ఉత్పత్తి పెరుగుతుంది, దీని కారణంగా పారిశ్రామిక కాలుష్యం కూడా పెరుగుతుంది. అలాగే, శీతాకాలంలో, రైతులు పొలాల్లో చెత్తను కాల్చడం వల్ల గాలిలో చాలా కాలుష్యం ఏర్పడుతుంది, అయితే గ్రామీణ ప్రాంతాల్లో, ప్రజలు శీతాకాలంలో చెక్క లేదా ఆవు పేడను కాల్చడం వల్ల ఇళ్ల లోపల, వెలుపల కాలుష్యం పెరుగుతుంది.ఢిల్లీలో దాదాపు 432 పాయింట్లకుపైగా వాయు కాలుష్యం పెరిగింది. 'గ్రేడెడ్ రెస్పాన్స్ యాక్షన్ ప్లాన్-ఎఎఎ'ని అమలు చేస్తున్నట్లు ఎయిర్ క్వాలిటీ మేనేజ్‌మెంట్ కమిషన్ ప్రకటించింది. ఇవాల్టి నుంచి ఆంక్షలు అమల్లోకి తెచ్చింది. నిర్మాణ పనులు, కూల్చివేతలు నిలిపివేయాలని ఆదేశించింది. జాతీయ భద్రత, వైద్య ఆరోగ్యం, ప్రభుత్వ భవనాల నిర్మాణాలకు మాత్రం మినహాయింపు ఇచ్చింది. అలాగే ఢిల్లీ నగరంలోకి "బిఎస్-3" వాహనాలు, డీజిల్ వాహనాలు ప్రవేశ పై నిషేధం విధించింది. ఇక ఢిల్లీలోని రహదారులు, చెట్లపై నీళ్లు చల్లే వాహనాల సంఖ్యను పెంచింది.వైపు వాయు కాలుష్యంతో ఊపిరితీసుకోవడం ఇబ్బందికరంగా మారగా.. మరో వైపు నీటి కాలుష్యంతోనూ సతమతమవుతున్నారు ఢిల్లీ వాసులు. యమునా నది ఇంకా నురగలు కక్కుతూనే ఉంది. నదిలో నీరు ఇప్పటికే విషమంయగా మారిపోయాయి. అటు ముంబైలోనూ ఢిల్లీ తరహా పరిస్థితులే కనిపిస్తున్నాయి.ఉదయం ఏకంగా 498 పాయింట్లగా నమోదైంది. ప్రపంచంలోనే రెండో అత్యంత కాలుష్య నగరంగా నిలిచింది. పాకిస్థాన్‌లోని లాహోర్ నగరం 770 పాయింట్లతో మొదటి స్థానంలో ఉంది. ఇక, ఢిల్లీలోని జహంగీర్‌పూర్ (458), బవానా (455), వాజీపూర్ (455), రోహిణి (452), పంజాబీ బాగ్ (443)లో అత్యంత తీవ్రమైన కాలుష్యకారక ప్రాంతాలుగా నిలిచాయి. పొగమంచు కమ్మేయడంతో పక్కన ఉన్నవారు సైతం కనిపించని పరిస్థితి. ఇది ఢిల్లీ నుంచి పలు ప్రాంతాలకు వెళ్లే విమాన, రైలు సర్వీసులపై పడింది. పలు విమానాలు, రైళ్లు ఆలస్యంగా నడుస్తున్నాయి. ఏక్యూఐ ఢిల్లీ స్థాయిలో లేకపోయినా క్రమంగా పెరుగుతున్న వాయుకాలుష్యంతో ఊపిరి ఆడని పరిస్థితి వస్తోంది. నెల రోజుల్లో శ్వాసకోస సమస్యలతో ఆస్పత్రికి వెళ్తున్నవారి సంఖ్య 20 శాతం పెరిగింది.

# ఇక ఏపీలో ప్రైమరీ స్కూల్స్ లో మార్పులు

విజయవాడ, నవంబర్ 18,

ఏపీలో ఇకపై రెండు రకాల ప్రాథమిక పాఠశాలలు నడపాలని ప్రభుత్వం నిర్ణయించింది. అదే విధంగా స్కూళ్ల టైమింగ్స్ మార్పుపై కూడా నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే నెల్లూరు జిల్లాలో పైలట్ ప్రాజెక్టుగా అమలు చేసేందుకు ఉత్తర్వులు జారీ అయ్యాయి.ఏపీ ప్రభుత్వం పాఠశాల విద్యకు సంబంధించి కీలక నిర్ణయం తీసుకుంది. ఇక నుంచి రెండు రకాల ప్రాథమిక పాఠశాలలు నడపాలని నిర్ణయించింది. అలాగే స్కూల్ టైమింగ్స్ మార్పుపై కూడా నిర్ణయిం తీసుకుంది. దీనికి సంబంధించి ఇప్పటికే నెల్లూరు జిల్లాలో పైలట్ ప్రాజెక్టుగా అమలు చేసేందుకు అధికారులు ఉత్తర్వులు ఇచ్చారు.

రెండు రకాలుగా ప్రాథమిక పాఠశాలలు

1. బేసిక్ ప్రైమరీ స్కూల్

2. మోడల్ ప్రైమరీ స్కూల్

1. బేసిక్ ప్రైమరీ స్కూల్

బేసిక్ ప్రైమరీ స్కూల్స్‌లో పీపీ-1, పీపీ-2తో బాటు 1, 2 తరగతులు ఉంటాయి. సోషల్ బ్యారియర్స్, నేచురల్ బ్యారియర్స్ ఉన్న చోట పీపీ-1, పీపీ-2తో బాటు 1 నుండి 5 తరగతులు కూడా నిర్వహించబడతాయి. 20 లోపు విద్యార్థులకు ఒక ఎస్జీటీ, 21 నుండి 60 లోపు విద్యార్థులకు ఇద్దరు ఎస్జీటీలు, ఆపై ప్రతి 30 మందికి ఒక ఎస్జీటీ ఉపాధ్యాయులు ఉంటారు.

2. మోడల్ ప్రైమరీ స్కూల్

ప్రతి రెవెన్యూ గ్రామ పంచాయితీలో ఒక మోడల్ ప్రైమరీ స్కూల్ ఏర్పాటు చేస్తారు. విద్యార్థుల సంఖ్య 100, అంతకంటే ఎక్కువ ఉంటే ప్రతి తరగతికి ఒక టీచర్‌ను కేటాయిస్తారు. 120 రోల్ దాటిన ప్రతి న్కూల్‌కు ఒక ఎల్ఎఫ్ఎల్ ప్రధానోపాధ్యాయుడిని కేటాయిస్తారు. వచ్చే విద్యా సంవత్సరం నుండి మోడల్ ప్రైమరీ స్కూల్స్‌ను పునః ప్రారంభిస్తారు. ముందుగా 70, 80 మంది విద్యార్థులు ఉన్నప్పటికీ ఆ ప్రైమరీ స్కూల్‌ను మోడల్ ప్రైమరీ స్కూల్‌గా గుర్తిస్తారు. ఐదు తరగతులకు ఐదుగురు టీచర్లను ఇస్తారు. రాష్ట్ర వ్యాప్తంగా రానున్న 2, 3 ఏళ్ళలో 9 వేల నుండి 10 వేల పాఠశాలలను మోడల్ ప్రైమరీ స్కూల్స్‌గా మార్చడానికి ప్రభుత్వం ఆలోచన చేస్తుంది.

1. ప్రాథమికోన్నత పాఠశాలలు



6,7,8 తరగతుల విద్యార్థులు 60 కంటే తక్కువ ఉంటే ఆ పాఠశాలను ప్రాథమిక పాఠశాలగా తగ్గించాలని, 60 కంటే ఎక్కువ ఉంటే దానిని ఉన్నత పాఠశాలగా అప్‌గ్రేడ్ చేయాలని ప్రభుత్వ ఆలోచన చేస్తోంది. 6,7,8 తరగతుల విద్యార్థుల సంఖ్య 30 లోపు ఉన్న ప్రాథమికోన్నత పాఠశాలను ప్రాథమిక పాఠశాలలుగా తగ్గిస్తారు. విద్యార్థుల సంఖ్య 31 నుండి 59 లోపు ఉండి గిరిజన ప్రాంతాలు, తండాలు, కాలనీలలో ఉన్న ప్రాథమికోన్నత పాఠశాలలకు సమీప హైస్కూల్ 5 కిలో మీటర్ల పైబడి దూరం ఉన్నట్లయితే వాటిని అప్పర్ ప్రైమరీ (యూపీ) స్కూల్స్‌గా కొనసాగిస్తారు.

2. ఉన్నత పాఠశాలలు : 75 మంది, అంతకంటే ఎక్కువ మంది విద్యార్థులు ఉన్న ప్రతి హైస్కూల్‌కు గ్రేడ్ ఎఎ ప్రధానోపాధ్యాయు, పీఈటీ పోస్టులు తప్పనిసరిగా కేటాయిస్తారు. వర్క్ 36 పీరియడ్లకు మించి లేకుండా చూస్తారు. వీటన్నింటికి సంబంధించి నవంబర్ 30 నాటికి డ్రాఫ్ట్ ప్రతిపాదనలను పూర్తి చేస్తారు.

స్కూల్ టైమింగ్స్‌లో మార్పులు..నెల్లూరులో ప్రారంభమైన పైలట్ ప్రాజెక్టు

రాష్ట్రంలో పాఠశాలల్లో టైమింగ్స్ మారనున్నాయి. అందుకు రాష్ట్ర కొత్త టైమింగ్స్ తీసుకొచ్చింది. ఇది రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేసే ముందు, పైలట్ ప్రాజెక్టుగా నెల్లూరు జిల్లాలో అమలు చేసేందుకు ఉత్తర్వులు శనివారం ఇచ్చారు. విద్యా సంవత్సరంలో 2024-25లో పాఠశాల సమయాలను మార్చాలని ప్రతిపాదించినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. పాత పని వేళలు, వెయిటేజీలతో పాటు, ప్రతి పీరియడ్ సమయాన్ని మాత్రమే పెంచాలని ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. తద్వారా ప్రతి ఉపాధ్యాయుడు సిలబస్‌ను కవర్ చేయడానికి, అలాగే బోధనా అభ్యాస ప్రక్రియకు తగినంత సమయం ఇవ్వనున్నారు.

ప్రతిపాదిత టైమింగ్స్

ఉదయం 9.00 గంటలకు మొదటి బెల్

ఉదయం 9.05 గంటలకు రెండో బెల్

ఉదయం 9.05 నుంచి 9.25 వరకు 20 నిమిషాలు స్కూల్ అసెంబ్లీ (ప్రైయర్)

ఉదయం 9.25 నుంచి 10.15 వరకు 50 నిమిషాలు మొదటి పీరియడ్

ఉదయం 10.15 నుంచి 11.00 వరకు 45 నిమిషాలు రెండో పీరియడ్

ఉదయం 11.00 నుంచి 11.15 వరకు 15 నిమిషాలు షార్ట్ బ్రేక్ (ఇంటర్‌వెల్)

ఉదయం 11.15 నుంచి మధ్యాహ్నం 12.00 వరకు 45 నిమిషాలు మూడో పీరియడ్

మధ్యాహ్నం 12.00 నుంచి 12.45 వరకు 45 నిమిషాలు నాలుగో పీరియడ్

మధ్యాహ్నం 12.45 నుంచి 1.45 వరకు 60 నిమిషాలు లంచ్ బ్రేక్

మధ్యాహ్నం 1.45 నుంచి 2.30 వరకు 45 నిమిషాలు ఐదో పీరియడ్

మధ్యాహ్నం 2.30 నుంచి 3.15 వరకు 45 నిమిషాలు ఆరో పీరియడ్

మధ్యాహ్నం 3.15 నుంచి 3.30 వరకు 15 నిమిషాలు షార్ట్ బ్రేక్ (ఇంటర్‌వెల్)

మధ్యాహ్నం 3.30 నుంచి సాయంత్రం 4.15 వరకు 45 నిమిషాలు ఏడో పీరియడ్

సాయంత్రం 4.15 నుంచి 5.00 వరకు 45 నిమిషాలు ఎనిమిదో పీరియడ్

నవంబర్ 25 నుంచి 30 వరకు పైలట్ ప్రాజెక్టు

ఈ పైలట్ ప్రాజెక్ట్‌ను నెల్లూరు జిల్లాలో ప్రతి మండలంలో ఒక ఉన్నత పాఠశాలలో నవంబర్ 25 నుండి నవంబర్ 30 వరకు అమలు చేయాలని నిర్ణయించారు. అందువల్ల డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్లందరూ ప్రతి మండలం నుండి ఒక హైస్కూల్ / హైస్కూల్ ప్లస్‌ని గుర్తించి, పాఠశాలల జాబితాను నవంబర్ 20న సంతకం చేసి సమర్పించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు

# జగన్ కు దూరమవుతున్న ఫ్యామిలీ, పొలిటికల్ ఫ్రెండ్స్..

కడప, నవంబర్ 18,

పవర్‌లో ఉన్నప్పుడు అంతా బానే ఉంటుంది. అందరూ దగ్గరి వాళ్లలాగే బిహేవ్ చేస్తుంటారు. పవర్‌పోతేనే తెలుస్తుంది. దగ్గరి వాళ్లు ఎవరు.? అవసరపూర్తి కోసం వచ్చినోళ్లు ఎవరని? వైసీపీ అధినేత జగన్‌కు ఇప్పుడు ఇదే సీన్ కనిపిస్తోందట. అధికారంలో ఉన్నప్పుడు దగ్గరగా ఉన్నవాళ్లంతా ఇప్పుడు ఎవరి దారి వాళ్లు చూసుకుంటున్నారు. ఫ్యాన్ గాలి పడటం లేదంటూ..సైకిల్ సవారీకి సై అంటున్నారు. పైకి పోతేపోనీ అంటున్న వైసీపీ అధినేత..లోలోపట మాత్రం ఇంత చేస్తే ఇలా హ్యాండిస్తారా అంటూ మధన పడుతున్నారట. జగన్ వెంట నడుస్తాం. రాజన్న రాజ్యమే లక్ష్యమని చెప్పుకున్న వాళ్లంతా ఒక్కొక్కరిగా జంపింగ్ బాట పడుతున్నారు. పవర్‌లో ఉన్నప్పుడు జగన్‌కు దగ్గరి వాళ్లమని చెప్పుకున్న నేతలు హ్యాండిస్తున్నారు. షర్మిల నుంచి మొదలు ఇప్పుడు బాలినేని వరకు..మోపిదేవి నుంచి జగన్ క్లాస్‌మెట్ రాజీవ్ కృష్ణ వరకు అందరూ తమ దారి తాము చూసుకుంటున్నారు. వరుస పెట్టి ఫ్యామిలీ ఫ్రెండ్స్, పొలిటికల్ ఫ్రెండ్స్ జగన్‌కు దూరమవుతుండటం చర్చనీయాంశంగా మారింది. ఈ క్రమంలోనే చిన్ననాటి క్లాస్‌మెట్ కూడా జగన్‌కు బై బై చెప్పి పసుపు కండువా కప్పేసుకున్నారు. కొవ్వూరు మాజీ ఎమ్మెల్యే పెండ్యాల కృష్ణబాబు అల్లుడు, జగన్ స్నేహితుడు, క్లాస్ మెట్ అయిన రాజీవ్ కృష్ణ పార్టీని వదిలివెళ్లిపోయారు. వైసీపీ హయాంలో ప్రభుత్వ సలహాదారుగా, అధికార ప్రతినిధిగా వ్యవహరించిన రాజీవ్ కృష్ణ..టీడీపీ గూటికి చేరిపోయారు. దీంతో జంపింగుల వ్యవహారంపై మరోసారి చర్చ మొదలైంది.తల్లి ప్రత్యక్షంగా జగన్‌కు దగ్గరగా లేరని చెప్పుకుంటున్నారు వైసీపీ నేతలు. ఇక చెల్లి ప్రధాన ప్రత్యర్థిగా మారిన పరిస్థితి కనిపిస్తూనే ఉంది. బాలినేని, మోపిదేవి వెంకటరమణ, ఆళ్లనాని ఇలా అయిన వాళ్లు కూడా పార్టీని వీడి వెళ్లిపోయారు. వైఎస్సార్ స్నేహితులు, సహచరులు, సన్నిహితులు వంటి వారు జగన్ దరిదాపుల్లో కూడా లేరని అంటున్నారు. రాజ్యసభ సభ్యులైన మోపిదేవి వెంకటరమణ, బీద మస్తాన్‌రావు, ఎమ్మెల్సీలు పోతుల సునీత, కర్రి పద్మశ్రీ, బల్లి కల్యాణ్ చక్రవర్తి వైసీపీని వీడారు.ఇక మాజీమంత్రులు బాలినేని శ్రీనివాస్‌రెడ్డి, ఆళ్ల నాని, మాజీ ఎమ్మెల్యేలు కిలారు రోశయ్య, మద్దాల గిరి, పెండెం దొరబాబు, మహిళా కమిషన్ మాజీ ఛైర్మన్ వాసిరెడ్డి పద్మ జగన్‌కు హ్యాండిచ్చారు. వీళ్లలో ఎక్కువ మంది జగన్ పార్టీ పెట్టినప్పటి నుంచి వెంట నడిచిన నేతలు. అయితే అన్ని జిల్లాల్లో ఒక ఎత్తు అయితే ఉభయ గోదావరి జిల్లాల్లో అయితే వైసీపీకి చెప్పుకోదగ్గ నాయకులే లేకుండా పోయారట. భీమవరం మాజీ ఎమ్మెల్యే గ్రంథి శ్రీనివాస్ కొన్నాళ్లుగా పార్టీపై అసంతృప్తితో ఉన్నారు. ఎన్నికల్లో ఓడిన తర్వాత అసలు బయటకు రాని గ్రంధి పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు.అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత వైసీపీకి దెబ్బ మీద దెబ్బ తగులుతున్నాయి. గోదావరి జిల్లాల్లో ఫ్యాన్ పార్టీకి ప్రతికూల పరిస్థితులే కనిపిస్తున్నాయి. గత ఐదేళ్లు పదవులు అనుభవించిన వారు ప్రతిపక్షంలో ఉండలేమంటూ సైడైపోతున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఉభయ గోదావరి జిల్లాలను కూటమి క్లీన్ స్వీప్ చేయడంతో..వైసీపీ ముఖ్య నేతలు కొందరు సైలెంట్ అయిపోయారు. ఇంకొందరు అయితే టీడీపీ లేకపోతే జనసేనలోకి వెళ్లిపోతున్నారు. జడ్పీ ఛైర్మన్‌లు, మున్సిపల్ ఛైర్మన్లు..ఇలా అందరిది కూటమి బాటే అయిపోయింది.గోదావరి జిల్లాలోని అన్ని నియోజకవర్గాల నుంచి వైసీపీలో వివిధ స్థాయిల్లో పని చేసిన నేతలు టీడీపీ, జనసేన, బీజేపీల్లో చేరడానికి అనేక ప్రయత్నాలు చేస్తున్నారు. కొవ్వూరుకు చెందిన ప్రముఖ పారిశ్రామిక వేత్త, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని పలు నియోజకవర్గాల్లో కింగ్ మేకర్‌గా వ్యవహరించిన మాజీ ఎమ్మెల్యే దివంగత పెండ్యాల కృష్ణబాబు అల్లుడైన ఎస్.రాజీవ్ కృష్ణ టీడీపీలో చేరడంతో ఇక వైసీపీ పరిస్థితి ఏంటనేది చర్చనీయాంశమైంది. ఆయనతో పాటు జడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు పార్టీ మారడంతో



కార్యకర్తలు కూటమి వైపే చూస్తున్నారుమాజీ ఎంపీలు, సిట్టింగ్ ఎమ్మెల్సీలు, రాజ్యసభ సభ్యులు, మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు జడ్పీ, మున్సిపల్ ఛైర్మన్లు.. ఇలా ఒకరేంటి వరుసగా వైసీపీని వీడుతున్న నేతల సంఖ్య చాంతాడులా పెరిగిపోతూనే ఉంది. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత నైరాశ్యంలో కూరుకుపోయిన పార్టీలో జోష్ నింపాల్సిన నేతలు పూర్తిగా డీలా పడిపోతున్నారా అన్న అనుమానం వ్యక్తమవుతోంది. వరుసగా నేతల వలసలను పరిశీలిస్తే నియోజకవర్గాల్లో వైసీపీని నడిపించే నాయకులు ఎవరన్న దానిపై చర్చ జరుగుతోంది. వలసలను ఆపలేక జగన్ చేతులు ఎత్తేశారా.. అధికారం లేనప్పుడు ఇదంతా కామన్ అని లైట్ తీసుకుంటున్నారా అన్నది ఆసక్తికరంగా మారింది.

====================================

# సోషల్ మీడియా నియంత్రణకు చట్టం

విజయవాడ, నవంబర్ 18,

ఏపీ రాజకీయాలు మొత్తం ఇప్పుడు సోషల్‌మీడియా చుట్టే తిరుగుతున్నాయ్. హద్దులు దాటి పోస్టులు చేస్తూ.. బూతులతో టార్గెట్ చేస్తూ.. కుటుంబాలను లాగుతున్న సోషల్ మీడియా జాదూలకు.. ఏపీ పోలీసులు చుక్కలు చూపిస్తున్నారు. ఇక అటు వైసీపీకి చెందిన కొందరు నేతలను కూడా అరెస్ట్ చేశారు. డైరెక్టర్ రాంగోపాల్‌వర్మతో పాటు.. వైసీపీ నేత పోసాని, సానుభూతిపరురాలు శ్రీరెడ్డికి కూడా నోటీసులు జారీ చేశారు.చంద్రబాబు, పవన్, లోకేశ్‌తో పాటు.. హోంమంత్రి అనితపై.. సోషల్‌మీడియాలో అనుచిత వ్యాఖ్యలు చేశారని వీరిపై కేసులు నమోదు కాగా.. వీరి అరెస్ట్‌కు దాదాపు రంగం సిద్ధం అయిందన్న ప్రచారం జరుగుతోంది. ఐతే సోషల్‌మీడియా అరాచకాలకు చెక్ పెట్టేలా ఏపీ సర్కార్ కొత్త చట్టం తీసుకొచ్చేందుకు రెడీ కావడం.. సరికొత్త సంచలనానికి కారణం అవుతోంది.సోషల్‌మీడియా దారుణాలపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ మొదటి నుంచి ఫోకస్ పెట్టారు. కుటుంబసభ్యులను లాగుతూ అసభ్యంగా పోస్టులు పెడుతున్నారని.. తన కూతుళ్లు కూడా కన్నీళ్లు పెట్టుకున్నారంటూ.. కేబినెట్ మీటింగ్ సాక్షిగా పవన్ ఆవేదన వ్యక్తం చేశారు. అప్పుడు మొదలైన పోలీసుల వేట.. ఇంకా కంటిన్యూ అవుతూనే ఉంది. ఎక్కడ ఉన్నా సరే.. లాగి పట్టుకొచ్చి మరీ ఊచలు లెక్కిస్తున్నారు పోలీసులు.విదేశాల్లో ఉన్నా వదిలేది లేదు అంటూ వార్నింగ్ ఇస్తున్నారు. అసభ్యకర పోస్టులు పెడుతున్న వారిపై.. కొత్త చట్టం భారతీయ నాగరిక్ సురక్ష సంహిత.. బీఎన్ఎస్ఎస్ 179 అమలు చేస్తున్నారు. ఇక సోషల్‌మీడియా పోస్టులపై నోటీసులు ఇవ్వడంలో తప్పేంటని.. జడ్జిల్లోనూ బాధితులు ఉన్నారన్న హైకోర్టు తీర్పుతో.. పోలీసులు మరింత దూకుడు చూపిస్తున్నారు. అసభ్య పోస్టులు, వాటిని పోస్ట్ చేసే వాళ్ల అంతుచూసే పనిలో పడ్డారు.సోషల్‌మీడియా ఆగడాలకు పూర్తిగా చెక్ పెట్టేలా.. డిప్యూటీ సీఎం పవన్ ఓ కీలక ప్రతిపాదనను తెర మీదికి తీసుకొచ్చారు. సోషల్ మీడియా దూకుడుకు బ్రేకులు వసేలా కొత్తగా ఓ చట్టాన్ని తీసుకుని రావాల్సిన అవసరం ఉందని.. దీనికి సంబంధించిన బిల్లును సభలో ప్రవేశపెట్టాలని సూచించారు. సోషల్ మీడియా అబ్యూజ్ ప్రొటెక్షన్ బిల్లును సభలో ప్రవేశపెట్టేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని పవన్ తేల్చి చెప్పారు. హోంమంత్రిని కూడా వదలట్లేదని, మహిళ అని కూడా చూడకుండా ఆమెను కించపరిచేలా సోషల్ మీడియాలో పోస్టులు చేస్తున్నారని ఫైర్ అయ్యారు. సోషల్ మీడియా, డిజిటల్ ప్లాట్‌ఫామ్ పూర్తిగా దుర్వినియోగం అవుతోందని.. ప్రమాదకర స్థాయికి చేరుకుందని ఆందోళన వ్యక్తం చేశారు. పవన్ ప్రతిపాదించారంటే.. దాదాపు ఆ చట్టం వచ్చేసినట్లే అనే చర్చ జరుగుతోంది.సోషల్‌మీడియాలో బూతులు, అసభ్య మెసేజ్‌ల వ్యవహారం జనాల్లోకి చొచ్చుకెళ్లిందనే చర్చ జరుగుతోంది. సోషల్‌మీడియా సాక్షిగా అభిప్రాయాలు చెప్పడం కూడా తప్పా అని ప్రశ్నించిన వాళ్లు కూడా.. ఆ దారుణాలు చూసి అంతు చూడాల్సిందే అంటున్నారు. ఇలాంటి పరిణామాల మధ్య.. పవన్ ప్రతిపాదనపై పాజిటివ్ రెస్పాన్స్ కనిపిస్తోంది. రాజకీయ వర్గాలు, సినీ ప్రముఖులు, సాంకేతిక రంగం నుంచి కూడా ఈ నిర్ణయాన్ని సమర్థిస్తున్నారు.రాజకీయాలు మాత్రమే కాదు.. సినిమా, వ్యాపారం నుంచి సామాన్యుల వరకు.. ప్రతీ ఒక్కరు సోషల్‌మీడియా బాధితులే అన్న మాటను.. జనాల్లోకి ఏపీ సర్కార్ సక్సెస్‌ఫుల్‌గా తీసుకెళ్లింది. దీంతో పవన్ ప్రతిపాదించిన సోషల్ మీడియా అబ్యూజ్ ప్రొటెక్షన్ బిల్లును తీసుకురావాల్సిందేననే డిమాండ్‌లు కూడా వినిపిస్తున్నాయ్. దీంతో ఈ చట్టం త్వరలో అమల్లోకి రావడం ఖాయంగా కనిపిస్తోంది.పవన్ ఓ అంశాన్ని లేవనెత్తడం.. చంద్రబాబు యాక్షన్‌లోకి దిగడం.. పర్ఫెక్ట్ కో ఆర్డినేషన్‌తో.. ఈ ఇద్దరు ఒక్కో సమస్యకు ఫుల్‌స్టాప్ పెడుతున్నారనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయ్. ఇక పవన్ ప్రతిపాదించిన బిల్లు అమల్లోకి వస్తే.. సోషల్ మీడియాలో అసభ్యకరమైన పోస్ట్ చేసే వారికి చుక్కలే. అరెస్టుల తర్వాత ఇప్పటికే సోషల్‌మీడియాలో ప్రతీ ఒక్కరు అలర్ట్ అయ్యారు. ఈ చట్టం వస్తే.. వేధింపుల సంస్కృతికి పూర్తిగా చెక్ పెట్టొచ్చన్నది ఏపీ సర్కార్ ఆలోచనగా కనిపిస్తోంది.

====================================

# మగాళ్లకు కూడా ఒక రోజు ఉందోచ్...

## నేడు అంతర్జాతీయ పురుషుల దినోత్సవం

అంతర్జాతీయ పురుషుల దినోత్సవాన్ని ప్రతి సంవత్సరం నవంబరు 19 న అంతర్జాతీయా స్థాయిలో జరుపబడే ఉత్సవం. ఐక్యరాజ్య సమితి ఆమోదంతో ట్రినిడాడ్ అండ్ టొబాగోలో 1999లో తొలిసారిగా "అంతర్జాతీయ పురుషుల దినోత్సవం" జరిగింది. అప్పటి నుంచి నవంబర్ నవంబర్ 19న వేడుకలు జరుపుతున్నారు. అంతర్జాతీయంగా ఇండియా, ఉత్తర అమెరికా, ఆసియా, యూరప్, కరీబీయన్ దీవులు, ఆఫ్రికా సహా దాదాపు 60 దేశాల్లో ఈ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. మన దేశంలో ఈ ఉత్సవాన్ని సేవ్ ఇండియన్ ఫ్యామిలీ అధ్వర్యంలో దేశమంతా జరుపుకుంటున్నారు. ఈ అంతర్జాతీయ పురుషుల దినోత్సవం ప్రధాన ఉద్దేశ్యం మగవాళ్ళు, మగ పిల్లల అనారోగ్య సమస్యలపై దృష్టి సారించడం, లింగ వివక్ష లేని సమాజాన్ని సాధించటం, నానాటికీ తగ్గిపోతున్న మానవ విలువల్ని పెంచడం, స్త్రీ-పురుషుల మధ్య సానుకూల దృక్పథాన్ని పెంపొందించటం వంటివి ప్రధాన ఉద్దేశాలు. అప్పటికే అంతర్జాతీయ మహిళా దినోత్సవం జరుపబడుతుండటం పితృ దినోత్సవం జరుపుబడుతున్ననూ, తండ్రికాని పురుషులకంటూ ఒక దినోత్సవం లేకపోవటం, ఈ దినోత్సవ ఆలోచనకు దారి తీశాయి.

# టిప్పర్ యజమానుల కష్టాలను పట్టించుకోవాలి

పెనమలూరు

ఉయ్యూరులో "ది ఏపీ టిప్పర్ ఓనర్స్ అసోసియేషన్" మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా "ది ఆంధ్ర రాష్ట్ర టిప్పర్ ఓనర్స్ అసోసియేషన్" అధ్యక్షుడు నరేంద్ర మాట్లాడుతూ చంద్రబాబు ఎన్నికలు ముందు టిప్పర్ యజమానుల కష్టాలు లేకుండా చూస్తాను అన్నారు . నాలుగు నెలలు దాటినా పట్టించుకోలేదు. సీఎం, డిప్యూటీ సీఎం అపాయింట్మెంట్ అడిగిన ఇవ్వడం లేదు. కూటమి ప్రభుత్వం ఉచిత ఇసుక పథకానికి తూట్లు పొడిచేలా, కూటమి ప్రభుత్వానికి చెడ్డ పేరు తేస్తున్నారు. ఇసుక రీచుల్లో దళారి వ్యవస్థ నడుస్తుంది. ప్రభుత్వం నిర్దేశించిన దానికంటే తక్కువ ధరలకు ఎలా కట్టబెట్టారు. ట్రాన్స్పోర్ట్ యజమానులు తీవ్రంగా నష్టపోతున్నారు. తక్షణమే మా డిమాండ్లు అమలుపరచాలి అని ఆంధ్ర రాష్ట్ర టిప్పర్ ఓనర్స్ అసోసియేషన్ సభ్యులు తమ ఆవేదనను వ్యక్తం చేశారు.. గత ఆరు ఏడు నెలల నుండి ఉపాధి లేక ఈఎంఐ లు కట్టుకునే స్థితిలో కూడా లేనట్లు ఆవేదన వ్యక్తం చేశారు. కనీనం మా వాహనాలలో లోడింగ్ కూడా అనుమతించట్లేదని, టెండర్ దారుల సొంత వాహనాలే లోడింగ్ చేస్తున్నారు. అధికారులు కూడా తమపై కక్షపూరితంగా పలు రకాల కేసులు పెట్టి వేధిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.

# వార్డెన్ వేధింపులతో ఇద్దరు విద్యార్థినీలు ఆత్మహత్యాయత్నం

పల్నాడు :సత్తెనపల్లి వెంకటపతి కాలనీ ఎస్సీ హాస్టల్లో మాత్రలు మింగి ఇద్దరు విద్యార్థులు ఆత్మహత్య యత్నం చేసారు. విద్యార్థినీలు సరిత (19), అఖిల (16) ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. హాస్టల్ వార్డెన్ రాణి వేధింపులే కారణమని విద్యార్థినీలు చెబుతున్నారు. భోజనం బాగోలేదని పలుమార్లు కంప్లైంట్ ఇచ్చినందుకు ఏదో ఒక వంకతో టార్చర్ పెడుతుందని ఆరోపించారు. హాస్టల్ వార్డెన్ తీరు పై విద్యార్థినిల తల్లిదండ్రులు రెండు రోజుల క్రితం పోలీసులకు ఫిర్యాదు చేసారు. బాధితులు సత్తెనపల్లి ఏరియా వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. ప్రాథమిక చికిత్స అనంతరం వారిని మెరుగైన చికిత్స కోసం గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

# లగచర్ల ఖైదీలతో బీజేపీ ఎంపీలు ఈటల, డికే ఆరుణ భేటీ

సంగారెడ్డి

బీజేపీ ఎంపీలు ఈటల రాజేందర్, డీకే అరుణ సోమవారం ఉదయం సంగారెడ్డి సెంట్రల్ జైలుకి చేరుకున్నారు. లగచర్ల కేసులో జైలులో ఉన్న 16 మందితో ములాఖత్ అయ్యారు. ఐదుగురు పార్టీ నేతలు సెంట్రల్ జైలు లోపలికి వెళ్లి రిమాండ్ ఖైదీలను కలిసారు.

# రామగుండంలో ప్రజపాలనకు బదులుగా పోలీస్ పాలన నడుస్తోంది

గోదావరిఖని :రామగుండం లో ప్రజపాలనకు బదులుగా పోలీస్ ర్యాజం... పోలీస్ పాలన నడుస్తుందని, రామగుండంలో ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ కక్ష్యపూరిత రాజకీయాలు చేస్తూ బి ఆర్ ఎస్ నాయకులపై పోలీసులతో దాడులు చేయిస్తూ, అక్రమ కేసులు పెడుతూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని రామగుండం మాజీ ఎంఎల్ఏ కోరుకంటి చందర్ ధ్వజం మెత్తారు. గోదావరిఖని ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... రామగుండంలో ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ ప్రజాపాలన బదులు పోలీస్ పాలన, నియంత పాలనను కొనసాగిస్తున్నారని ఆరోపించారు. ప్రజలకు జరుగుతున్న అన్యాయాలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని ప్రతిపక్ష పార్టీగా నిరసన కార్యక్రమం చేపట్టకుండా పోలీసులతో తమను ఎక్కడికి అక్కడ అడ్డుకుంటూ, దాడులు చేస్తూ తమపై కేసులు పెడుతూ వస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలపై తమ మున్సిపల్ కార్యాలయంలో నిరసన తెలిపే హక్కును కూడా కాలరాస్తూ ఎమ్మెల్యే ప్రోద్భలంతో మహిళా కార్పొరేటర్లపై కేసులు పెట్టించడమే కాకుండా పోలీస్ స్టేషన్ కు వెళ్లిన మహిళా కార్పొరేటర్లను, దళిత మహిళలను సీఐ దుర్భాలాడడం దుర్మార్గమని అన్నారు. ట్రస్ట్ కు సంబంధించిన భూమిలో ఆలయాన్ని నిర్మాణం చేయాలని పూనుకుంటే ఎమ్మెల్యే తనకు సంబంధించిన వ్యక్తితో తమపై, తన తండ్రిపై, అక్కడ ఉన్న వారిపై పెట్రోల్ పోసి హత్యచేయాలని చూసారని అయినా పోలీసులు అతనిపై హత్యాయత్నం కేసు పెట్టకుండా కాపాడుతున్నారని ఆరోపించారు.

# సోషల్ మీడియా వారియర్స్ కు చుక్కలు

కడప, గుంటూరు, నవంబర్ 18

ఏపీలో ఇప్పుడు సోషల్ మీడియా వారియర్లకు చుక్కలు కనిపిస్తున్నాయి. గత ప్రభుత్వ అండ చూసుకుని చేతిలో సెల్, అందులో ఇంటర్ నెట్ ఉంది కదా అని రెచ్చిపోయిన వారు ఇప్పుడు పరుగులు పెడుతున్నారు. రాష్ట్ర సరిహద్దులు దాటి తల దాచుకుంటున్నారు. అయినా సరే పోలీసులు వెంటాడుతూనే ఉన్నారు. తప్పు చేయనేల. ఇప్పుడు క్షమాపణలు చెప్పనేల అన్నట్లుగా సీన్ మారింది. తెలిసో తెలియకో చేశాం.. మమ్మల్ని వదిలేయండి మహా ప్రభో అని చాలా మంది వేడుకుంటున్న పరిస్థితి. మరి ఇదే బుద్ధి సోషల్ మీడియాలో అసభ్యంగా పోస్టులు పెట్టినప్పుడు ఏమైందన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి. సోషల్ మీడియాను ఉపయోగించుకోవాల్సిన రీతిలో వాడకపోవడంతోనే సమస్య వచ్చింది. ప్రత్యర్థులపై హేట్ పోస్టులతో రెచ్చిపోయారు. అదే అన్నిటికీ మందు అనుకున్నారు. కానీ అసలు వాస్తవం ఏంటో ఇప్పుడిప్పుడే బోధపడుతోంది. నోటీసులు, కేసులు, అరెస్టులతో అందరిలోనూ పరేషాన్ కనిపిస్తోంది. ఫేక్ అకౌంట్ల ద్వారా పెట్టినా సరే అందరినీ గుర్తు పట్టేస్తున్నారు. లైకులు కొట్టినా, ఫార్వర్డ్ చేసినా, కమ్యూనిటీ గైడ్ లైన్స్ కట్టు దాటి కామెంట్లు పెట్టినా అందరూ బుక్ అవుతున్నారు. ఃఔబూ సెక్షన్ 111 ప్రయోగిస్తుండడంతో చాలా మంది కాళ్లబేరానికి వస్తున్నారు. మంచి పనులు చేస్తూ ప్రజల్లో మెప్పు పొంది గెలవాలి. కానీ ప్రత్యర్థులను టార్గెట్ చేసి, వారి భార్యలపై వ్యక్తిత్వ హననం చేయడం ద్వారా పబ్బం గడుపుకొందామంటే కుదురుతుందా.. కానే కాదు అని ఇప్పటి కేసులు, అరెస్టులు రుజువు చేస్తున్నాయి. గతంలో సోషల్ మీడియాలో రెచ్చిపోయిన వారు పుట్టలో ఉన్నా సరే వెతికి వెతికి బయటకు తీస్తున్నారు. మరోసారి ఇలాంటి పనులు చేయకుండా గట్టిగానే బుద్ధి చెప్పేందుకు ఏపీ ప్రభుత్వం సిద్ధమైనట్లు కనిపిస్తోంది. దీంతో వైసీపీ సోషల్ మీడియాలో గతంలో యాక్టివ్ గా పని చేసిన వారి గుండెల్లో ఇప్పుడు రైళ్లు పరిగెడుతున్నాయి. అంతా జైలు బాట పడుతున్నారు. వైసీపీ సోషల్ మీడియా కార్యకర్తలపై మూకుమ్మడిగా కేసులు పెడుతున్నారని, వాటిని అడ్డుకునేలా ఉత్తర్వులు ఇవ్వాలని తాజాగా ఏపీ హైకోర్టులో ఓ పిల్ దాఖలైంది. ఈ పిల్ పై విచారణ సందర్భంగా హైకోర్టు చెప్పిన మాటలు సోషల్ వారియర్లు అందరూ గుర్తు పెట్టుకోవాల్సిందే. అసభ్యకర పోస్టులు పెట్టేవారిపై కేసులు పెడితే తప్పేముందని ఏపీ హైకోర్టు ప్రశ్నించడం అందరూ ఆలోచించాల్సిన విషయం. గతంలో న్యాయమూర్తులను కూడా వదలకుండా దూషిస్తూ పోస్టులు పెట్టారని గుర్తు చేసింది ధర్మాసనం. పోలీసుల చర్యలను నిలువరిస్తూ ఎలాంటి ఉత్తర్వులను ఇవ్వలేమన్నది. కేసులపై అభ్యంతరముంటే నేరుగా కోర్టును ఆశ్రయించాలని చెప్పింది. పిల్ వేయడానికి వీలు లేదన్నది. కేసులపై అభ్యంతరముంటే నేరుగా కోర్టును ఆశ్రయించాలన్నది. సో హైకోర్టు చెప్పాల్సింది చెప్పేసింది. ఇది నిజంగా వైసీపీకి గట్టి ఎదురు దెబ్బే. వైసీపీ సోషల్ మీడియా కార్యకర్తలను కావాలనే ఇబ్బంది పెడుతున్నారని తమ వారిని కాపాడుకునేందుకు చేసిన ప్రయత్నం వర్కవుట్ కాలేదు. పైగా రివర్స్ అవుతోంది. ఎన్ని చేసినా, ఎంత చేసినా, ఎంత తప్పించుకుందామని చూసినా.. చేసిన తప్పులకు ఫలితం అనుభవించక తప్పదు. ఇదే కర్మ సిద్ధాంతం. ఇది ఇప్పుడే వైసీపీ సోషల్ మీడియాలో యాక్టివ్ గా పని చేసిన వారికి, ఆ పార్టీ సానుభూతి పరులకు అర్థమవుతోంది. నిజానికి ఈ విషయంలో మొదటే జ్ఞానోదయం కావాలి. కానీ ఇన్నాళ్లకు అవుతోంది. సో ఇప్పటికే చాలా ఆలస్యమైంది. అందుకే గెట్ రెడీ అంటోంది ఏపీ పోలీస్ వింగ్. వీళ్లు రాజకీయ విమర్శలతో పోస్టులు పెట్టి ఉంటే అంతా బాగుండేది. కానీ హద్దులు దాటి పెట్టారు. అందుకే వరుసగా నోటీసులు, కేసులు, అరెస్టులు.

# భూమన వర్సెస్ పెద్దిరెడ్డి

తిరుపతి, నవంబర్ 18,

ఏపీలో 2024 ఎన్నికలు వైసీపీ కొంపముంచాయి. దిద్దుబాటు చర్యలకు దిగిన మాజీ సీఎం.. రీసెంట్ గానే ఉమ్మడి జిల్లాల వారీగా ఇంచార్జ్ లను ప్రకటించారు. పార్టీని మళ్లీ క్షేత్ర స్థాయి నుంచి బలోపేతం చేయాలని ఆదేశాలు ఇచ్చారు. అధినేత ఆదేశాలతో బాధ్యతల స్వీకరణ కార్యక్రమం మాత్రం అంగరంగ వైభవంగా జరిగినప్పటికీ.. నాయకుల మధ్య సమన్వయం లేకపోవడం.. ఫ్యాన్ పార్టీని కలవర పెడుతుందట. పార్టీ 2027లోనే అధికారంలోకి వస్తుందని కార్యకర్తల ముందు గొప్పలు పోతూ.. తమలో విభేదాలు లేవని చెబుతున్నారు. కానీ మాజీ సీఎం జగన్ కి అత్యంత ఆప్తులు ఉండే ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యవహారం హాట్ టాపిక్ గా మారుతోంది. ఈ ఇద్దరు సీనియర్ నాయకుల మధ్య మళ్లీ మైత్రి కుదురుతుందా అని జోరుగా చర్చ జరుగుతోందట. ముందుగా ఉమ్మడి చిత్తూరు జిల్లాకు అధ్యక్షుడిగా పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పేరు బయటకు వచ్చింది. తర్వాత అయనను రాయలసీమ జిల్లాల బాధ్యుడిగా నియమించి.. మాజీ ఎమ్మెల్యే, టీటీడీ మాజీ ఛైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డికి వైసీపీ ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షుడిగా పట్టం కట్టారు. వాస్తవానికి గడిచిని 5ఏళ్ల కాలంలో నాలుగేళ్ల పాటు వైఎస్ కుటుంబానికి అత్యంత ఆప్తుడైన కరుణాకర్ రెడ్డికి ప్రాధాన్యత ఇవ్వలేదని టాక్ నడిచింది. అయినప్పటికీ హడావుడిగా భారీ ఎత్తున ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహించారు. సభకు విజయసాయిరెడ్డి, సజ్జల, అంబటి.. ఎస్వీ సుబ్బారెడ్డితో పాటు జిల్లాలోని పెద్దిరెడ్డి, ఆయన కుమారుడు, సోదరుడు మినహా మిగతా నాయకులు అంతా హాజరవడం చర్చనీయాంశంగా మారుతోందట. ప్రమాణ స్వీకారానికి రెండు రోజుల ముందు.. పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డి వచ్చి కరుణాకర్ రెడ్డికి శాలవ కప్పి సన్మానించారు. తన సహకారం ఉంటుందని హామీ ఇచ్చారు. అయితే ప్రమాణ స్వీకారం రోజు పెద్దిరెడ్డి సభకు రాకపోవడంతో.. నాయకుల మధ్య మైత్రి బంధంపై అధికార పార్టీ నేతలకే కాకుండా..



సొంత పార్టీ నేతలకు సైతం అనుమానాలు కలిగిస్తున్నాయట. పెద్దిరెడ్డి గత ఎన్నికల్లో తిరుపతి, చంద్రగిరి, నగరి టార్గెట్ గా పనిచేశాడనే వాదనలు ఉన్నాయట. చెవిరెడ్డి అయితే ఓఅడుగు ముందుకేసి పెద్దిరెడ్డి అనుచరుడు అయిన ఆర్సీ రెడ్డిని పార్టీ నుంచి సస్పెండ్ చేయించారట. దాంతో వారి మధ్య నాటి నుంచి ఇష్యూ చాప్య కింద నీరులా సాగుతుందని ఫ్యాన్ పార్టీ నేతలే గుసగుసలాడు కుంటున్నారట. జగన్ అధికారంలో ఉన్న అయిదేళ్లు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పెత్తనం ఒక రేంజ్లో నడిచింది? రాయలసీమ జిల్లాల్లో అనధికార సీఎంగా ఆయన చెలామణి అయ్యారట. జిల్లాలోని దాదాపు ప్రతి నియోజకవర్గంలో పెద్దిరెడ్డికి సొంత కేడర్ ఉందట. సొంత పార్టీలో తనకు నచ్చని నేతలను ఓడించడానికి పెద్దిరెడ్డి తన సైనాన్ని ఉపయోగించారన్న ఆరోపణలున్నాయట. ఇక మాజీ డిప్యూటీ సియం నారాయణ స్వామి పెద్దిరెడ్డి మీదా కత్తులు నూరుతున్నారంట. తన కూమార్తె ఓటమి కారణం పెద్దిరెడ్డి రాజకీయం అని సన్నిహితుల వద్ద వాపోతున్నారట. మొత్తం మీద ప్రతి నియోజకవర్గంలోను తన అనుచరులు ఉన్న పెద్దిరెడ్డి పూర్తి సహకారం అందించక పోతే భూమన అధ్యక్షుడిగా చేసేదేమి లేదని చర్చ జరుగుతుందట. అయితే ఇప్పటికే గ్రూపులు గ్రూపులుగా విడిపోయిన ఉన్న వైసీపీ క్యాడర్ నేతల మధ్య ఇష్యూతో కలపడం మరింత కష్టమే అంటున్నారట.

# అమరావతి కోసం అదిరిపోయే ప్లాన్

విజయవాడ, నవంబర్ 18

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిని వేరే లెవల్‌కు తీసుకెళ్లాలని ప్రభుత్వం ప్లాన్ రెడీ చేస్తోంది. చుట్టుపక్కల ఉన్న నగరాలను కలుపుకొని దీన్ని మెగా సిటీగా రూపకల్పన చేయాలని భావిస్తోంది. కొత్త రూపొందిస్తున్న మాస్టర్ ప్లాన్ మతిపోయేలా చేస్తోంది. కోటి మంది జనాభాతో ప్రపంచంలోనే టాప్ మెగా సిటీగా తీర్చిదిద్దాలని స్కెచ్ వేస్తోంది ప్రభుత్వం. అందుకు తగ్గట్టుగానే ప్రతిపాదనలు రెడీ చేసింది. అమరావతితోపాటు విజయవాడ, గుంటూరు, మంగళగిరిని కూడా వేరే లెవల్క తీసుకెళ్లాలని సీఆర్డీఏను సీఎం చంద్రబాబు ఆదేశించారు. రాజధాని పరిధిలో 217 చదరపు కిలోమీటర్ల పరిధిలోనే ఉన్నప్పటికీ దాని ఎఫెక్ట్‌తో జరిగే అభివృద్ధిని మాత్రం మిగతా మూడు నగరాలకు వ్యాప్తి చెందేలా చూస్తున్నారు. అందుకోసం ఈ నగరాల్లో ప్రత్యేకంగా తీర్చిదిద్దే పనికి శ్రీకారం చుట్టబోతోంది. రాజధానిగా అమరావతి అభివృద్ధి చేస్తే... లాజిస్టిక్ హబ్‌గా మంగళగిరిని తీర్చిదిద్దనున్నారు. ఎడ్యుకేషన్ హబ్ గుంటూరు మార్చబోతున్నారు. విజయవాడను వాణిజ్య కేంద్రంగా తయారు తయారు చేయనున్నారు. ఇలా నాలుగు సిటీలతో అమరావతిని ప్రపంచంలోనే నెంబవర్ వన్ సిటీల జాబితాలో ఉంచబోతున్నారు. ఇప్పటికే గుంటూరు ఎడ్యుకేషన్‌కు కేంద్రబిందువుగా ఉంది. దీన్నే అవకాశంగా మార్చుకుంటున్న ప్రభుత్వం ఆధునిక ప్రపంచానికి కావాల్సిన వసతులు, విద్య కోర్సులు, ఇతర ఇనిస్టిట్యూట్‌లను అక్కడ ఏర్పాటు చేయనున్నారు. విజయవాడ ఇప్పటికే ఆటో, వాణిజ్యం పరంగా ముందంజలో ఉంది. దీన్ని మరింతంగా తీర్చిదిద్దబోతున్నారు. అమరావతి అబివృద్ధి కోసం ప్రపంచ బ్యాంక్ నిధులు సాయం చేస్తోంది. త్వరలోనే ఈ నిధులు రాష్ట్ర ప్రభుత్వ ఖాతాలో పడనున్నాయి. ఒక్కసారి నిధులు పడిన వెంటనే అమరావతి పనులు ఊపందుకోనున్నాయి. అమరావతితోపాటు గుంటూరు, విజయవాడ, మంగళగిరిని డెవలప్ చేయనున్నారు. ఈ నగరాల్లో ఉన్న నూజివీడు, తెనాలి, గుడివాడ లాంటి ప్రాంతాలను ప్రత్యేక కేంద్రాలుగా డెవలప్ చేయనున్నారు. ప్రత్యేక విమానాశ్రయాలు, ఇన్నర్, అవుటర్ రోడ్డులు, బైపాస్‌లు, ఏర్పాటు చేస్తారు. అసలు రాజధాని ప్రాంతానికి అన్ని ప్రాంతాల నుంచి త్వరగా చేరుకునే రవాణా వ్యవస్థలు అభివృద్ధి చేస్తారు. అమరావతి ప్రాంతంతోపాటు రాష్ట్రంలో రవాణా వ్యవస్థ మరింతగా మెరుగుపడేందుకు ఇటీవల కేంద్రం ప్రకటించిన రైల్వే వ్యవస్థ, అవుటర్ రింగ్‌రోడ్డు సహాయపడబోతోంది. వీటికి తోడు సూపర్ పాస్ట్ కారిడార్లు కూడా నిర్మించాలని కూడా ప్రభుత్వ ఆలోచిస్తోంది. వీటితోపాటు ఈ నాలుగు నగరాల్లో లేటెస్ట్ టెక్నాలజీని విస్తృతంగా వాడుకోవాలని ప్రభుత్వం భావిస్తోంది. భవిష్యత్‌లో ఎంత జనాభా పెరిగినా సమస్యలు రాకుండా ఉండేలా, ట్రాఫిక్ జంజాటం లేకుండా ప్లాన్ చేస్తోంది. ఇప్పటికే రోడ్లు అన్నింటినీ అనుసంధానిస్తూ పటిష్టమైన రోడ్లు వేసేందుకు డీపీఆర్ రూపకల్పనకు కన్సల్టెన్సీలను సీఆర్‌డీఏ ఆహ్వానించింది. ఇన్నర్ రింగ్ రోడ్డు ఆధ్యయనానికి కూడా కన్సల్టెన్సీలను పిలిచారు. ఇప్పటికే చాలా కంపెనీలు దీని కోసం పోటీ పడుతున్నాయి. సోమవారం ఈ డీపీఆర్ టెండర్లు పరిశీలించి నిర్ణయం తీసుకోనుంది. ఒకసారి టెండర్లు ఖరారు అయిన తర్వాత రెండు నెలల్లో పనులు ప్రారంభించేలా ఆదేశాలు జారీ చేయనున్నారు.

# అమీన్ పూర్ మున్సిపాలిటీ పరిధిలో హైడ్రా కొరడా

సంగారెడ్డి

అమీన్ పూర్ మునిసిపాలిటీ లోని వందనపురి కాలనీలో 848 సర్వే నంబర్ లో అక్రమ నిర్మాణాలపై కొరడా ఝుళిపించింది. రోడ్డును ఆక్రమించి ఇంటి నిర్మాణం గుర్తించారు. భారీ యంత్రాలతో రంగంలోకి దిగి కూల్చివేసారు. ఉద్రిక్త పరిస్థితులు తలెత్తకుండా పెద్ద ఎత్తున పోలీసులను మోహరించారు.

# ఇసుక అక్రమ రవాణా అడ్డుకున్న అధికారులపై దౌర్జన్యం

## చల్లపల్లి పోలీస్టేషన్లో కేసు నమోదు

చల్లపల్లి మండలంలో ఇసుక అక్రమ రవాణాను అడ్డుకునేందుకు వెళ్లే అధికారులపై ఒక వైసీపీ నాయకుని దౌర్జన్యాలు ప్రభుత్వం మారినా కొనసాగుతూనే ఉన్నాయి. గతంలో నిమ్మగడ్డ రేవులో ఇసుక అక్రమ రవాణాను అడ్డుకునేందుకు వెళ్లిన అధికారులపై పలుమార్లు దౌర్జన్యం, దాడి చేసిన విషయం తెలిసిందే. తాజాగా శనివారం నడకుదురులో ఇసుక అక్రమ రవాణా అడ్డుకునేందుకు వెళ్లిన రెవెన్యూ అధికారులపై దౌర్జన్యం జరిగిన సంఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. ఈ సంఘటనపై వైసీపీ సర్పంచ్ భర్త, ట్రాక్టర్ డ్రైవర్లపై చల్లపల్లి పోలీస్ స్టేషన్లో కేసు నమోదైంది. వివరాల ప్రకారం చల్లపల్లి మండలం నడకుదురు, నిమ్మగడ్డలలో ట్రాక్టర్ల ద్వారా ఇసుక అక్రమ రవాణా జరుగుతోందంటూ రెవెన్యూ అధికారులకు వచ్చిన సమాచారం మేరకు చల్లపల్లి మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ ఘంటసాల కృష్ణమోహన్, వీఆర్వో కోట కిరణ్ కుమార్ నిమ్మగడ్డ, ఆ తర్వాత నడకుదురు వెళ్లారు. నడకుదురు రేవులోంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టరును అడ్డగించి చల్లపల్లి పోలీస్ స్టేషనుకు తరలిస్తుండగా, పురిటిగడ్డ - యార్లగడ్డ రోడ్డు దగ్గర పురిటిగడ్డ సర్పంచ్ మాతంగి రమ్య భర్త, వైసీపీ నాయకుడు మాతంగి దుర్గారావు అడ్డగించి రెవెన్యూ అధికారుల విధులకు ఆటంకం కలిగించాడు. ట్రాక్టర్ ఆపేందుకు వీల్లేదనీ, డ్రైవరును ముందుకు తీసుకువెళ్లమని చెప్పటంతో అతను ట్రాక్టరు ముందుకు తీసుకువెళ్లిపోయాడు. మళ్లీ అధికారులు అడ్డగించగా, సర్పంచ్ భర్త దుర్గారావు తానే స్వయంగా ట్రాక్టరును నడుపుకుని వెళ్లి ఇసుకను అన్లోడ్ చేశాడు. ట్రాక్టరును అడ్డుకునేందుకు ప్రయత్నించగా ట్రాక్టరును ముందుకు దూకించటంతో అధికారులు ప్రాణభయంతో అడ్డు తప్పుకున్నారు. ట్రాక్టర్ డ్రైవర్ మాతంగి నాంచారయ్య సైతం రెవెన్యూ అధికారులను తోసివేయటం, ద్విచక్ర వాహనంపై ముందుకు వెళ్లనీయకుండా అడ్డుకోవటం చేశాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. ప్రభుత్వ ఉద్యోగులపై దౌర్జన్యం చేసి విధులకు ఆటంకం కలిగించిన ఇరువురిపై చర్యలు తీసుకోవాల్సిందిగా ఆర్ ఘంటసాల కృష్ణమోహన్, వీఆర్వో కె. కిరణ్ కుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు చల్లపల్లి ఎస్ఐ పి.సుబ్రహ్మణ్యం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అస్థిరత పరిచే కుట్ర నడుస్తోంది

హైదరాబాద్

కాంగ్రెస్ నేతలు డాక్టర్ రాంచందర్ నాయక్, బలరాం నాయక్, బాలు నాయక్ సోమవారం నాడు జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు జాటోతు హుస్సేన్ నాయక్ ను కలిసారు. లగచర్లలో గిరిజన ప్రజలపై జరిగిన ఘటనపై వినతి పత్రం ఇచ్చి, వివరించారు. ఈ సందర్భంగా డాక్టర్ రాంచందర్ నాయక్ మాట్లాడుతూ ప్రభుత్వాన్ని అస్థిరత పరిచే కుట్ర చేస్తున్నారు. బిఆర్ఎస్ దుష్ట పాలనలో వేములఘాట్లో రైతు ఆత్మార్పణ, రైతులకు సంకెళ్లు. దళితులను ట్రాక్టర్తో తొక్కించిన ఘటనలు మరిచారా? రైతుల సమస్యలు వినడానికి, పరిష్కరించడానికి ప్రభుత్వం ఎప్పుడూ సిద్ధంగా ఉంటుంది. రాష్ట్ర ప్రభుత్వాన్ని,పరిపాలనను అస్థిరత పరచాలన్న కుట్ర జరుగుతోందని, అధికారం కోల్పోయామన్న అక్కసుతో అమాయకులైన రైతులను రెచ్చగొట్టి పబ్బం గడుపుకోవాలని బి ఆర్ ఎస్ ప్రయత్నిస్తోందని ప్రభుత్వ విప్ డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ రాంచందర్ నాయక్ జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు జాటోతు హుస్సేన్ నాయక్ గారికి తెలిపారు . చిల్లర, అవకాశవాద,కుట్రపూరిత రాజకీయాలతో మనుగడ సాగించలేరనే విషయాన్ని బిఆర్ఎస్ గుర్తించాలని హితవు పలికారు. పార్టీ ఉనికి కోసం అమాయక రైతులను బలిపెట్టవద్దని ఆ పార్టీ నాయకులకు విజ్ఞప్తి చేశారు. లగచర్లలో ప్రజలు,అక్కడి రైతుల సమస్యలు తెలుసుకోవడానికి జిల్లా కలెక్టర్తో సహా అధికారులు వెళ్లినపుడు,ఎలాంటి చర్చకు ఆస్కారం ఇవ్వకుండానే దాడికి పాల్పడడం నీచం,అత్యంత హేయమైన చర్య. జిల్లా కలెక్టర్, ఇతర అధికారులపై రాళ్లు, కర్రలతో దాడి చేశారంటే దానివెనుక భారీ కుట్ర కోణం దాగి ఉందని అర్ధమవుతుంది. రైతులు తమ సమస్యలను చెప్పుకోవడానికి ,స్థానికుల సమస్యలను వినడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉన్నప్పటికీ ఈలాంటి కుట్రపూరితచర్యలకు పాల్పడడం దురదృష్టకరం. రైతులను నష్టపెట్టాలన్నది ఈ ప్రభుత్వ ఉద్దేశం కాదు,వారి సమస్యలను వినడానికి,పరిష్కరించడానికి ఈ ప్రభుత్వం ఎప్పుడూ సిద్ధంగానే ఉంటుంది. ప్రజాస్వామ్య యుతంగా వెళ్తుంది. రైతుల ముసుగులో అధికారులను చంపే ప్రయత్నం చేయడం మంచిపద్ధతి కాదు. సంఘటను ప్రభుత్వం సీరియస్ గా తీసుకుంటుందని అన్నారు.

# జనసేన కార్యాలయం ముందు బైఠాయించిన అఘోరి

మంగళగిరివిజయవాడ వెళ్లే రహదారి పైన మంగళగిరి వద్ద జనసేన పార్టీ కార్యాలయం దగ్గర హైవే పైన మహిళా అఘోరి బైటాయించింది. తాను పవన్ కళ్యాణ్ ని కలవాలి అంటూ పవన్ కళ్యాణ్ ని కలిసిన తర్వాత వెళ్తాను ఆంటూ హైవే పైన బైటాయించింది.

# తిరుమలలో కానరాని కారు పార్కింగ్ స్థలం

తిరుమలతిరుమలలో కార్ పార్కింగ్ స్థలం కనపడడంలేదు. పలు ప్రయివేట్ హోటల్స్ యాజమాన్యం చేస్తున్నాయి. హెచ్ టి ప్రాంతం ముందు భాగంలోని పార్కింగ్ స్థలాన్ని ఆక్రమించి హోటల్ నిర్వాహకులు యదేచ్చగా వ్యాపారం చేస్తున్నారు. టీటీడీ అధికారులు పట్టించుకోవడంలేదని భక్తులు ఆరోపిస్తున్నారు.

# ఓఆర్ఆర్ దాటేసిన రియల్ ఎస్టేట్

హైదరాబాద్ నవంబర్ 18,

హైదరాబాద్ లో రియల్ ఎస్టేట్ దూసుకుపోతుంది. ఔటర్ రింగ్ రోడ్డు దాటి రియల్ ఎస్టేట్ వ్యాపారం జోరుగా సాగుతోంది. అలాగే ఈ ఏడాది మూడో త్రైమాసికంలో(జులై-సెప్టెంబర్) నగరంలో 12700 ఇండ్లు అమ్ముడయ్యాయి. వెస్ట్ హైదరాబాద్ లో గృహ విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. హైదరాబాద్ రియల్ ఎస్టేట్ రంగం పుంజుకుంటోంది. గృహ విక్రయాలు క్రమంగా స్పీడందుకుంటున్నాయి. ఈ ఏడాది మూడో త్రైమాసికం జులై-సెప్టెంబర్ మధ్య నగరంలో 12700 ఇండ్లు అమ్ముడుపోయాయి. మరో 13900 యూనిట్లు విక్రయానికి రెడీ అయ్యాయి. అయితే రెండో త్రైమాసికంతో పోలిస్తే ఇండ్ల విక్రయాలు 16 శాతం క్షీణించాయి. కొత్త యూనిట్లు ఒక శాతం పెరిగాయని అనరాక్ అధ్యయనం ప్రకటించింది. హైదరాబాద్ వెస్ట్ జోన్ లో గృహ విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. ఈ క్వార్టర్ లో మొత్తం ఇళ్ల అమ్మకాల్లో 53 శాతం వెస్ట్ జోన్ లోనే జరిగాయి. అనంతరం నార్త్ జోన్ లో 28 శాతం, సౌత్ జోన్ లో 13, ఈస్ట్ జోన్ లో 4 శాతం గృహాలు అమ్ముడయ్యాయి. ఇక సెంట్రల్ హైదరాబాద్‌లో ఇండ్ల అమ్మకాలు ఒక శాతంగా ఉన్నాయి. దేశంలోని ఏడు మెట్రో నగరల్లోని ఇండ్ల అమ్మకాల్లో హైదరాబాద్ వాటా 12 శాతంగా ఉంది. హైదరాబాద్ నగరంలో అపార్ట్‌మెంట్ల ఒక చదరపు అడుగు ధర సగటున రూ.7,150 లుగా ఉందని అనరాక్ సంస్థ తెలిపింది. మూడో త్రైమాసికంలో హైదరాబాద్‌లో లక్షల గృహాల ఇన్వెంటరీ ఉందని సమాచారం. నగరంలో తొలిసారిగా ఇన్వెంటరీ లక్ష యూనిట్లను దాటిందని ఈ సర్వే సంస్థ తెలిపింది. దేశంలోని ఇన్వెంటరీలో 18 శాతం హైదరాబాద్ నగరానిదే ఉంది. ఇందులో వెస్ట్ హైదరాబాద్ దే హవా. నగరంలో గత మూడు నెలల్లో ఇళ్ల అద్దెలు 1 నుంచి 4 శాతం, అపార్ట్‌మెంట్లలో చదరపు అడుగు ధరలు 3 నుంచి 5 శాతం మేర పెరిగాయని తెలుస్తోంది. చదరపు అడుగు ధర సగటున ఎల్బీనగర్ లో రూ.6800, మియాపూర్ లో 6700, గచ్చిబౌలీలో రూ.8900, కొండాపూర్ లో రూ.8600గా ఉంది. డబుల్, ట్రిపుల్ బెడ్ రూమ్ ఇండ్ల అద్దెలు నెలకు రూ.14-42 వేల మధ్యలో ఉన్నాయి. మూడో త్రైమాసికంలో నగరంలో 13900 ఇండ్ల యూనిట్లు విక్రయానికి సిద్ధం కాగా.. వీటిల్లో లగ్జరీ గృహాల వాటా అత్యధికంగా ఉంది. వీటిల్లో 60 శాతం ఇండ్లు రూ.1.5 కోట్లకు పైగా ధర ఉన్న ప్రీమియం గృహాలే ఉన్నాయి. రూ.40 నుంచి 80 లక్షల ధర ఉన్న ఇండ్లు 3 శాతం, రూ.80 లక్షల-రూ.1.5 కోట్ల ధర ఉన్న యూనిట్ల వాటా 37 శాతం, రూ.1.5 నుంచి 2.5 కోట్ల ధర ఉన్న ఇండ్ల వాటా 40 శాతం, రూ.2.5 కోట్ల కంటే ఎక్కువ ధర ఉన్న ఇండ్ల యూనిట్ల వాటా 20 శాతంగా ఉందని అనరాక్ సంస్థ తెలిపింది. హైదరాబాద్ రియల్ ఎస్టేట్ రంగానికి పెట్టింది పేరు. దేశీయ రియల్ ఎస్టేట్ మార్కెట్ లో హైదరాబాద్ కు గణనీయమైన వాటా ఉంది. అయితే నగరంలో రియల్ ఎస్టేట్ ఔటర్ రింగ్ రోడ్ దాటిపోయింది. ప్రధానంగా ఇండ్ల స్థలాలు, ఇండిపెండెంట్ హౌస్‌లు రింగ్ రోడ్డు అవతల ఎక్కువగా లభ్యమవుతున్నాయి. విల్లాలు ఎక్కువగా ఔటర్ రింగ్ రోడ్ తర్వాతనే నిర్మిస్తున్నారు. పదేళ్లలో హైదరాబాద్ నగరంలో రియల్ ఎస్టేట్ రంగం బాగా విస్తరించింది. ఔటర్ రింగ్ రోడ్డును దాటి నగరం విస్తరించింది. విజయవాడ, ముంబయి, నాగపూర్, శ్రీశైలం హైవేల సమీపంలో ఔటర్ ఎగ్జిట్ నుంచి రియల్ ఎస్టేట్ ప్రాజెక్టులు పెరుగుతున్నాయి. ఈ ఏరియాలో ధరలు క్రమంలో పెరుగుతున్నాయి. ప్రస్తుతానికి ఇక్కడ మధ్యతరగతికి అందుబాటులో ధరలు ఉన్నాయి. చిరుద్యోగులు కొనుగోలు చేసేలా అపార్టుమెంట్లు ఉన్నాయి. ఉద్యోగులు సైతం కొనుగోలు చేసేలా ఇండిపెండెంట్ హౌస్‌లు అందుబాటులో ఉన్నాయి.

## తొమ్మిది నెలలుగా ధర్నాలు చేస్తున్నాం

న్యూఢిల్లీఢిల్లీలో జాతీయ మానవ హక్కుల కమిషన్ లగచర్ల ఘటన బాధిత కుటుంబాలు కు పిర్యాదు చేసాయి. ప్రభుత్వం, పోలీస్ ల దుశ్చర్యలపై ఫిర్యాదు చేసారు. బాధితులవెంట మాజీ మంత్రి ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్,ఎమ్మెల్యే కోవా లక్ష్మి,మాజీ ఎంపీ మలోతు కవిత,మాజీ ఎమ్మెల్యే హరిప్రియ నాయక్,మాజీ జెడ్పి చైర్మన్ తుల ఉమ తదితరులున్నారు.

లగచర్ల బాధితులు మాట్లాడుతూ మా భూములు ఇచ్చేది లేదంటూ గత 9 నెలలుగా మేము చాలా ధర్నాలు చేస్తున్నాం. మేము ధర్నాలు చేసినప్పుడు సీఎం సోదరుడు తిరుపతి రెడ్డి, కలెక్టర్ సహా ఏ అధికారి రాలేదు. కానీ మొన్న మాత్రం కలెక్టర్ సాధారణ దుస్తుల్లో పోలీసు సెక్యూరిటీ లేకుండా వచ్చారు. దీంతో కొంతమంది పిల్లలు తెలియకుండా దాడి చేశారు. ఆ దాడిని సాకుగా చూపి అర్థరాత్రి రాత్రి 500 మంది పోలీసులు వచ్చి, కరెంట్ బంద్ చేసి మాపై దౌర్జన్యం చేశారు. కుతిక పిసికి, కళ్లకు బట్టలు ఇష్టానుసారం బూతులు తిడుతూ కొట్టారు. మగవాళ్లందరనీ అరెస్ట్ చేశారు. మిగిలిన మగవాళ్లు ఊరు వదిలి పారిపోయారు. మేము మా భూములు ఇవ్వమని చెబుతున్నా. మా భూములను వదిలేయాలి. మా వారిని వదిలేయండి. మాకు ఉన్న మొత్తం భూమిని తీసుకుంటా అంటే మేము ఎలా బతకాలి. ఎప్పుడు పోలీసులు వచ్చి ఏం చేస్తారోనని ఇంట్లో ఉండాలంటేనే భయం వేస్తోంది. మా ఇంట్లో ఉన్న మగవాళ్లందరినీ తీసుకెళ్లారు. ఎనిమిది రోజులుగా మా పిల్లలు ఎక్కడున్నారో తెలియదు వారిని కూడా తీసుకెళ్తామని చెబుతున్నారు. కేసీఆర్ ఉన్నప్పుడు మేము చాలా బాగా బతికాం. గత 9 నెలలుగా తీవ్రంగా ఇబ్బంది పడుతున్నాం. మా ప్రాణాలు పోయినా సరే ఫార్మా కంపెనీకి భూములు ఇవ్వం. రేవంత్ రెడ్డిని కలిసేందుకు వెళ్తే మమ్మల్ని బెదిరించి పంపించారని అన్నారు.

ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్ మాట్లాడుతూ సీఎం సొంత నియోజకవర్గంలో గిరిజనులపై అఘాయిత్యాలకు పాల్పడ్డారు. ఎన్నో ఏళ్లుగా ఆ భూములను ఆధారంగా చేసుకొని బతుకుతున్న వారి జీవనాధారాన్ని గుంజుకునే ప్రయత్నం చేశారు. 9 నెలలుగా తమ భూములు ఇవ్వమని రైతులు చెబూతునే ఉన్నారు. భూములు తీసుకుంటామంటే ఆవేశంలో కొంతమంది దాడి చేశారు. దాన్ని సాకుగా చూపి మహిళలపై అఘాయిత్యాలకు పాల్పడ్డారు.

# తిరుమలలో అన్యమత ప్రచారం... రంగంలోకి విజిలెన్స్

తిరుమల, నవంబర్ 18

తిరుమలలో అన్యమత ప్రచారం జరిగిందంటూ వదంతులు ఊపందుకున్నాయి. ఈ వదంతుల ధాటికి ఏకంగా టీటీడీ విజిలెన్స్ రంగంలోకి దిగి అసలు ఏం జరిగిందనే కోణంలో వివరాలు ఆరా తీస్తోంది. తిరుమల పరిసర ప్రాంతాలలో అన్యమత ప్రచారం చేయడం నిషిద్ధం. ఈ విషయం అందరికీ తెలిసిందే కూడా. కానీ పలువురు మహిళలు తిరుమలలోని పాపవినాశనం వద్ద అన్యమత ప్రచారానికి పాల్పడినట్లు వదంతులు వ్యాపించాయి. అంతేకాదు ఏకంగా తమ దైవానికి సంబంధించిన పాటలకు సదరు మహిళలు రీల్స్ చేసినట్లు తెలుస్తోంది. ఇంతకు ఆ రీల్స్ అక్కడ చేశారా లేదా అన్నది టీటీడీ విజిలెన్స్ విచారణలో తేలాల్సి ఉంది. పాప వినాశనం వద్ద 20 మంది వరకు అన్యమతస్తులు నిరంతరం ఉంటున్నట్లు సమాచారం. అయితే వీరికి స్థానిక ఫారెస్ట్ అధికారులు సహకారం ఉందని ఆరోపణలు వినిపిస్తున్నాయి. పవిత్రమైన ఏడుకొండల పై అన్యమత ప్రచారం సాగిందా లేదా అన్నది తేల్చేందుకు, టీటీడీ విజిలెన్స్ రంగంలోకి దిగింది. పాప వినాశనం వద్దకు వెళ్లి స్థానికులను సంబంధిత అధికారులు విచారిస్తున్నారు. అసలు అన్యమతస్తులు ఉన్నారా లేదా.. ఈ రీల్స్ ఎక్కడ చేశారు? అనే విషయాలను ఆరా తీసే పనులు వారు నిమగ్నమయ్యారు. తిరుమల పరిసర ప్రాంతాలలో అన్యత ప్రచారం నిషేధమైనప్పటికీ అప్పుడప్పుడు ఇటువంటి వదంతులు వ్యాపించడం సర్వసాధారణంగా మారింది. అయితే వదంతులకు ఎటువంటి ఆస్కారం లేకుండా టీటీడీ వెంటనే ఈ విషయాన్ని సీరియస్ గా తీసుకుంది. అంతేకాదు విజిలెన్స్ విభాగాన్ని రంగంలోకి దించింది. ఎవరైనా తిరుమల నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని టీటీడీ చెబుతోంది. అయితే సదరు మహిళలు తిరుమలలో రీల్స్ చేసినట్లు వీడియోలు సోషల్ మీడియా వేదికగా వైరల్ గా మారాయి. ఈ వీడియోలకు సంబంధించి అసలు వాస్తవం తెలియాలంటే టీటీడీ విజిలెన్స్ అధికారుల ప్రకటనతో బయటకు వెల్లడి కావాల్సి ఉంది. ఈ మహిళలు పాపవినాశనం వద్ద గల హోటళ్ల వద్ద రీల్స్ చేసినట్లు అందరూ భావిస్తుండగా, అక్కడికి వీరు కూలి పనుల నిమిత్తం వస్తున్నట్లు కూడా చర్చ సాగుతోంది. మరి ఇంతకు వీరెవరు? అసలు అన్యమత ప్రచారం సాగిందా లేదా అన్నది కొన్ని గంటల్లో తేలనుంది.

# విశాఖకు మహర్ధశ...

విశాఖపట్టణం, నవంబర్ 18

విశాఖ జిల్లాలో మరో భారీ ప్రాజెక్ట్‌కు ఏర్పాట్లు ప్రారంభం అయ్యాయి. పూడిమడకలో ఎన్టీపీసీ గ్రీన్ హైడ్రోజన్ హబ్‌కు ఈ నెల 29న ప్రధానితో శంకుస్థాపనకు సన్నాహాలు ప్రారంభం అయ్యాయి. రూ.85 వేల కోట్ల పెట్టుబడితో 25 వేల మందికి ఉపాధి లభించే ఈ ప్రాజెక్టుతో విశాఖ పారిశ్రామిక ప్రతిష్ట మరింత పెరగనుంది. విశాఖను గ్రోత్ హబ్‌గా ప్రకటించిన కేంద్రం ఆ మేరకు కార్యాచరణను ప్రారంభించి, ముందుకు వెళ్తోంది. అదే రోజు రైల్వే జోన్‌కూ ప్రధాని శంకుస్థాపన చేయనున్నారు. ఈ మేరకు ఆంధ్రా యూనివర్సిటీలో పబ్లిక్ మీటింగ్‌కు ఏర్పాట్లను ప్రారంభించనుంది రాష్ట్ర ప్రభుత్వం. విశాఖను వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరాల్లో ఒకటిగా భావించి గ్రోత్ హబ్ సెంటర్‌గా ప్రకటించింది కేంద్రం. కేవలం ప్రకటనకు మాత్రమే పరిమితం అవ్వకుండా వచ్చే ఐదేళ్లలో విశాఖను శక్తివంతమైన ఆర్థిక కేంద్రంగా మార్చేందుకు అవసరమైన ప్రణాళికలు చేపట్టాలని నిర్ణయించింది నీతి అయోగ్. అందులో భాగంగానే ఒక భారీ ప్రాజెక్ట్‌కు రూపకల్పన జరిగింది. దాని ప్రతిబింబమే అచ్యుతాపురం మండలం పూడిమడకలో గ్రీన్ హైడ్రోజన్ హబ్ ఏర్పాటు. గత ప్రభుత్వ హయంలోనే దీన్ని ఏర్పాటు చేయాలని భావించినా పలు కారణాలతో కార్యరూపంలోకి తేలేకపోయింది. ఎన్డీఏ ప్రభుత్వం వచ్చాక ఈ ప్రాజెక్టు తిరిగి పట్టాలెక్కేందుకు సిద్ధమవుతోందిరూ.85 వేల కోట్ల పెట్టుబడితో నెలకొల్పనున్న ఈ పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టుకు ఈ నెల 29న ప్రధాని మోదీతో శంకుస్థాపన చేయడానికి ఏర్పాట్లు ప్రారంభం అయ్యాయి. ఈ ప్రాజెక్టు ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా 25వేల మందికి ఉపాధి దొరకనుంది. 2032 నాటికి ఈ ప్లాంట్ నుంచి 60 గిగావాట్ల విద్యుత్తు ఉత్పత్తి చేయాలన్నది లక్ష్యం. ఈ ప్రాజెక్టు నుంచి ఉత్పత్తయ్యే విద్యుత్తులో అధిక భాగం రాష్ట్ర అవసరాలకు వినియోగించుకోవాలనే ఉద్దేశంతో సీఎం చంద్రబాబు ఇందులో 50 శాతం వాటాను ఏపీజెన్కోతో పెట్టించాలని నిర్ణయం తీసుకున్నారు. దీంతో ఎన్టీపీసీ, జెన్కోల సంయుక్త భాగస్వామ్యంతో ఈ ప్రాజెక్టు పట్టాలెక్కబోతోంది. ఇదే పర్యటనలో ప్రధానితో విశాఖ రైల్వేజోన్‌కు కూడా శంకుస్థాపన చేయించాలన్న ప్రణాళిక కూడా ఉంది. అయితే వాల్తేరు డివిజన్‌పై మరికొంత స్పష్టత రావల్సి ఉన్న నేపథ్యంలో ప్రస్తుతం అధికారులు దానిపై దృష్టి సారించారు. మరోవైపు ప్రధాని పర్యటన నేపథ్యంలో ఏయూ ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో భారీ స్థాయిలో బహిరంగ సభ నిర్వహించాలని నిర్ణయించిన రాష్ట్ర ప్రభుత్వం అందుకు తగ్గ ఏర్పాట్లను ప్రారంభించింది.

# మండలిలో ఎమ్మెల్సీలు జై... కూటమి

విజయవాడ, నవంబర్ 18

ఈ ఎన్నికల్లో వైసిపి దారుణంగా ఓడిపోయింది. కనీసం ప్రతిపక్ష హోదా కూడా దక్కలేదు. అందుకే మండలిలో మెజారిటీని చూసుకుని రాజకీయం చేయాలని జగన్ భావించారు. కానీ అక్కడ కూడా ప్రతికూల ఫలితాలు కనిపిస్తున్నాయి.

ఏపీలో విచిత్ర పరిస్థితులు నెలకొన్నాయి. శాసనసభకు విపక్ష వైసిపి దుమ్మా కొడుతోంది. కానీ శాసనమండలిలో మాత్రం సత్తా చాటుతోంది. శాసనమండలిలో విపక్ష నేతగా బొత్స సత్యనారాయణ ఉన్నారు. మండలి చైర్మన్ గా వైసీపీకి చెందిన మోసేన్ రాజు ఉన్నారు. అందుకే బలమున్న శాసనమండలిలో వైసిపి తన వాయిస్ బలంగా వినిపిస్తోంది. కానీ కొందరు ఎమ్మెల్సీల తీరు మాత్రం అనుమానంగా ఉంది. వారు టిడిపి తో కుమ్మక్కయ్యారా అన్న అనుమానం కలిగే లా ఉంది. ఈ ఎన్నికల్లో వైసిపి దారుణంగా ఓడిపోయింది. 11 స్థానాలకు మాత్రమే పరిమితం అయ్యింది. కనీసం ప్రతిపక్ష హోదా దక్కలేదు. ప్రతిపక్ష హోదా ఇస్తేనే అసెంబ్లీలో అడుగు పెడతామని జగన్ చెబుతున్నారు. శాసనమండలిలో మాత్రం బలం ఉండడంతో పాటు చైర్మన్, ప్రతిపక్ష హోదా ఉండడంతో సభ్యులు హాజరవుతున్నారు. కానీ ఆశించిన స్థాయిలో వైసీపీ సభ్యులు మాట్లాడడం లేదని జగన్లో ఒక రకమైన అనుమానం కలుగుతున్నట్లు తెలుస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా వైసీపీ సోషల్ మీడియా కార్యకర్తల అరెస్టు జరుగుతున్న సంగతి తెలిసిందే. దీనిపై ఎమ్మెల్సీలు నిలదీస్తారని జగన్ ఆశించారు. కానీ మండలిలో విపక్ష నేత బొత్స మాత్రం తప్పు ఒప్పుకున్నట్లు మాట్లాడారు. నారా లోకేష్ తల్లిపై అనుచితంగా మాట్లాడిన వారిని ప్రోత్సహించబోమని ఆయన అన్నారు. అయితే టిక్కెట్లు ఇచ్చారు కదా అని లోకేష్ మండిపడ్డారు. వెంటనే అంబటి రాంబాబు నుంచి రిప్లై వచ్చింది. మీ తల్లి గారిని అవమానించినట్లుగా నిరూపిస్తే రాజకీయ సన్యాసం చేస్తానని ప్రకటించారు. వెంటనే జగన్ ఆనాడు స్పందించిన తీరుకు సంబంధించి వీడియోలు బయటకు వచ్చాయి. సోషల్ మీడియాలో కనిపించడంతో నాడు జగన్ రాక్షసానందం పొందినట్టు బయటపడింది. సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. అయితే ఇదంతా మండలిలో బొత్స ఫెయిల్ కారణంగానే వచ్చిందని వైసీపీలో అనుమానాలు ప్రారంభమయ్యాయి. అధికారం కోల్పోయిన తొలినాళ్లలో జగన్ ఎమ్మెల్సీలపై ధీమాతో ఉండేవారు. మండలిలో బలం ఉంది కనుక ప్రభుత్వం ప్రవేశపెట్టే బిల్లులను అడ్డుకుందామని ధీమా వ్యక్తం చేశారు. అయితే మండలిలో వైసీపీ సభ్యుల తీరు చూస్తుంటే మాత్రం అది సాధ్యమయ్యే పని కాదని తెలుస్తోంది. ఒకరిద్దరు ఎమ్మెల్సీలు తప్ప? అంతా ప్రభుత్వానికి సరెండర్ అయ్యారన్న అనుమానాలు ఉన్నాయి. ఓ నలుగురు ఎమ్మెల్సీలు పదవులకు రాజీనామా చేస్తే మండలి చైర్మన్ వాటిని ఆమోదించలేదు. ఇప్పుడున్న వారిలో సైతం చాలామంది అసంతృప్తితోనే ఉన్నారు. పక్క చూపులు చూస్తున్నారు. కూటమి నుంచి గ్రీన్ సిగ్నల్ రాకపోవడంతో వైసీపీలోనే సైలెంట్ గా గడుపుతున్నారు. దీంతో జగన్ ఇచ్చిన టాస్క్ ను పూర్తి చేయలేకపోతున్నారు.

# జిల్లాల పర్యటనలకు సీఎం ప్లాన్

కరీంనగర్ నవంబర్ 18,

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది పాలనపై సీఎం రేవంత్ రెడ్డి జిల్లాల పర్యటనకు సిద్ధమయ్యారు. ఏడాది కాలంలో చేసిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను వివరించునున్నారు . ఈనెల 19 నుంచి వచ్చే నెల 9వ తారీఖు వరకు పలు జిల్లాల్లో పర్యటించేలా షెడ్యూల్ ఖరారు చేశారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరి డిసెంబర్ 7 వరకు ఏడాది పూర్తవుతున్న సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి జిల్లాల పర్యటనకు శ్రీకారం చుడుతున్నారు. మంత్రివర్గ సభ్యులతో పాటు సీఎం ఉన్నతాధికారులతో కలిసి పర్యటించాలని నిర్ణయించారు. 19న వరంగల్ నుంచి ప్రారంభమయ్యే సీఎం జిల్లాల టూర్ డిసెంబర్ 9 వరకు సాగనుంది. 19న వరంగల్ లో మహిళ సదస్సు పేరుతో సీఎంతోపాటు మంత్రులందరు పర్యటిస్తారు. ఆ మరుసటి రోజు 20న రాజన్న సిరిసిల్ల జిల్లాలో సీఎం పర్యటిస్తారు. సిరిసిల్లలో ఎస్పీ కార్యాలయం ప్రారంభించడంతో వేములవాడ రాజన్నను దర్శించుకుని ఆలయ అభివృద్ధి తోపాటు రోడ్డు వెడల్పు పనులకు శంకుస్థాపన చేస్తారు. సిరిసిల్ల నేత కార్మికులకు బాసటగా నిలిచేలా 50 కోట్లతో యార్న్ డిపోకు భూమిపూజ చేయనున్నారు. రాజన్న జాతర గ్రౌండ్ లో భారీ బహిరంగ సభకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఏర్పాట్లను రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పరిశీలించి అధికారులతో సమీక్షించారు. జిల్లాల పర్యటనలో భాగంగా సీఎం రేవంత్ రెడ్డి ఈనెల 25న కరీంనగర్ లో పర్యటించి యువజన సదస్సులో పాల్గొననున్నారు. అందుకు అధికారులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. కరీంనగర్ ఎస్ ఆర్ ఆర్ డిగ్రీ కళాశాల లేదా అంబేద్కర్ స్టేడియంలో యువజన సదస్సు నిర్వహించేందుకు సిద్ధమయ్యారు. ఇప్పటికే రెండు ప్రదేశాలను జిల్లా కలెక్టర్ ప్రమేలా సత్పతి జిల్లా అధికారులతో కలిసి పరిశీలించి ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. రెండు మూడు రోజుల్లో సభా స్థలం ఖరారు కానుంది. ఈనెలాఖరున మహబూబ్ నగర్ లో సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో రైతు సదస్సు నిర్వహించనున్నారు. ఆ తర్వాత డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో హైదరాబాద్ కేంద్రంగా కార్నివాల్ గా మూడు రోజుల పాటు రాష్ట్ర స్థాయి ఉత్సవాలు నిర్వహిస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. రాజన్న సిరిసిల్ల, వరంగల్ జిల్లాల అధికారులతో సీఎం టూర్ ఏర్పాట్లపై మంత్రి పొన్నం ప్రభాకర్ సమీక్షించి సభా ఏర్పాట్లపై దిశానిర్దేశం చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి చేసిన కార్యక్రమాల గురించి ప్రజలకు వివరించేందుకు సిఎం రేవంత్ రెడ్డి జిల్లాల పర్యటనతో పాటు రాష్ట్ర స్థాయి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. కాంగ్రెస్ చేపట్టిన పథకాలు, ప్రజలకు చేసిన మేలు, సాధించిన విజయాలు, ప్రజలకు పంచిన నిధులు ఇలా ప్రతి అంశంపై ఈ సభలో మాట్లాడతారు. విజయోత్సవ సభల్లోనే కొన్ని పథకాలను కూడా ప్రభుత్వం ప్రారంభించబోతోందని తెలుస్తోంది. హన్మకొండ వేదికగా జరిగే సభలో 22 జిల్లాల ఇందిరా మహిళా శక్తి భవనాలకు సీఎం రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేస్తారు. అభివృద్ధి సంక్షేమాన్ని సమానంగా నడిపిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం అందరి ప్రశంసలు అందుకుంటుందన్నారు అటవీశాఖ మంత్రి కొండా సురేఖ. 19న జరిగే మీటింగ్‌కు భారీగా జనం తరలి రావాలని పిలుపునిచ్చారు. ఇందిరమ్మ రాజ్య స్థాపనకు రేవంత్ రెడ్డి కీలక నిర్ణయాలు తీసుకుంటురన్నారని దానికి మద్దతు తెలపాలని పిలుపునిచ్చారు. వరంగల్ డిక్లరేషన్‌లో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తున్న ప్రభుత్వం మరిన్ని సంక్షేమ కార్యక్రమాలు అమలు దిశగా వెళ్తోందని అన్నారు. ముఖ్యంగా మహిళలపై ప్రత్యేకంగా ఫోకస్ చేసినట్టు వెల్లడించారు. అందుకే ఇందిరమ్మ జయంతి రోజున వరంగల్‌లో సభ పెడుతున్నామని తెలిపారు.

## ఐకేసీ కేంద్రాన్ని సందర్శించిన మంత్రి తుమ్మల

సూర్యాపేటవ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూర్యాపేట జిల్లా ఐకేపీ కేంద్రాన్ని సోమవారం సందర్శించారు. ఈ సందర్బంగా ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులతో మాట్లాడి, వారికి కావలసిన అన్ని రకాల అవసరమైన ఏర్పాట్లను సమర్థవంతంగా నిర్వహించాలని మరియు తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మంచి ధర లభించడానికి రైతులు ధాన్యాన్ని బాగా ఆరబెట్టి కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని మంత్రి సూచించారు.

# మణిపూర్ లో మళ్లీ అల్లర్లు

ఇంపాల్, నవంబర్ 18, (

మణిపూర్‌లో మరోసారి ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ మధ్య కిడ్నాప్ అయిన వ్యక్తులు విగత జీవులుగా కనిపించడంతో అక్కడ పరిస్థితి మరోసారి గతి తప్పింది. ఇది మరింతగా వ్యాప్తి చెందకుండా అధికారులు చర్యలు తీసుకున్నారు. శనివారం సాయంత్రం నుంచి పరిస్థితి సీరియస్‌గా ఉండే జిల్లాల్లో ఇంటర్‌నెట్‌లు నిలిపేశారు. మణిపూర్‌లో నిరసనల దృష్ట్యా శనివారం సాయంత్రం 5 గంటల నుంచి రాష్ట్ర ప్రభుత్వం ఏడు జిల్లాల్లో ఇంటర్నెట్, మొబైల్ డేటా సేవలు నిలిపేసింది. ఈ రూల్స్ రెండు రోజుల పాటు అమల్లో ఉంటుందని తెలిపింది. గత వారం జిరిబామ్‌లో ఇద్దరు పిల్లలు సహా ముగ్గురు వ్యక్తులు తప్పిపోయారు. వారి మృతదేహాలు కనిపించాయి. దీంతో వారి వర్గీయులు ఆగ్రహంతో ఊగిపోతున్నారు. నిరసనలు చేపడుతున్నారు. వివిధ జిల్లాల్లో ఆందోళనలు చేపట్టారు. ముగ్గురు మణిపూర్ మంత్రులు, ఆరుగురు ఎమ్మెల్యేల నివాసాలపై దాడికి యత్నించారు. మణిపూర్ ప్రభుత్వం అప్రమత్తమైంది. బిష్ణుపూర్, తౌబాల్, ఇంఫాల్ వెస్ట్, ఇంఫాల్ ఈస్ట్, కక్చింగ్, చురచంద్‌పూర్, కాంగ్‌పోక్పిలో ఇంటర్నెట్ సేవలు నిలిపేసింది. "ప్రస్తుతం ఆందోళనలతో ఉద్రిక్తంగా ఉన్న ఇంఫాల్ ఈస్ట్, ఇంఫాల్ వెస్ట్, తౌబాల్, బిష్ణుపూర్, కక్చింగ్, చురచంద్‌పూర్, కాంగ్‌పోక్పి జిల్లాల పరిధిలో ఘాయిలు, బ్రాడ్‌బ్యాండ్ (ఎఎఒఒ డ ఈఖఊ) ఎఖఔ సేవలతో సహా ఇంటర్నెట్, మొబైల్ డేటా సేవలు తాత్కాలికంగా నిపిసేం. 16-11-2024 సాయంత్రం 5:15 నుంచి ఈ ఆంక్షలు అమలులోకి వచ్చాయి.

లీజు లైన్‌లు, ప్రభుత్వ కార్యాలయాలకు ఈ ఆంక్షల నుంచి మినహాయింపు ఇచ్చాం " అని ఆదేశాల్లో ఉంది. అంతే కాకుండా శాంతిభద్రతల పరిస్థితి అదుపు తప్పిన ప్రాంతాల్లో పలు ప్రాంతాల్లో నిరవధిక కర్ఫ్యూ విధించారు. పరిస్థితి మరింత దారుణంగా ఇంఫాల్ లోయలో నిరవధిక కర్ఫ్యూ స్ట్రిక్ట్‌గా అమలు చేస్తున్నారు. ఇంఫాల్ లోయలోని ఇంఫాల్ ఈస్ట్, వెస్ట్, బిష్ణుపూర్, తౌబాల్, కక్చింగ్ జిల్లాల్లో కూడా నిరవధిక కాలం పాటు కర్ఫ్యూ అమలులో ఉంది. వివిధ ప్రాంతాల్లో ఆందోళనకారులను చెదరగొట్టేందుకు టియర్ గ్యాస్ వాడారు. ఇంఫాల్‌లోని వివిధ ప్రాంతాలలో వారిని చెదరగొట్టడానికి టియర్ గ్యాస్ షెల్‌లు ప్రయోగించారు. అప్పటి ప్రజాప్రతినిధుల ఇళ్లపైకి నిరసనకారులు దూసుకెళ్లారు. అక్కడ కొందరు విధ్వంసం సృష్టిస్తే మరికొందరు చేతికి దొరికిన వస్తువులు ఎత్తుకెళ్లారు. కొన్నింటినికి నిప్పుపెట్టారు. ఇంఫాల్ వెస్ట్‌లో ఉండే ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి సపమ్ రంజన్ లాంఫెల్ సనకీతెల్ నివాసంపై ఓ టీం దాడి చేసింది. ఆయనతో మాట్లాడింది. ఆందోళనకారులతో మాట్లాడిన ఆయన.. ముగ్గురి హత్యకు సంబంధించిన అంశాలు క్యాబినెట్ సమావేశంలో చర్చిస్తామని వారికి మాట ఇచ్చారు. ప్రజా సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైతే రాజీనామా చేస్తానని హామీ ఇచ్చారు. తూర్పు జిల్లాలోని ఖురాయ్ ప్రాంతంలోని ఉన్న మరో మంత్రి ఎల్ సుసీంద్రో సింగ్ నివాసాన్ని కూడా ఆందోళనకారులు ముట్టడించారు.

సుసీంద్రో సింగ్ నివాసంపై దాడికి యత్నించారు. ముందే పసిగట్టిన పోలీసులు వారిపై టియర్ గ్యాస్ ప్రయోగించారు. ఇంఫాల్ వెస్ట్‌లోని సగోల్‌బంద్ ప్రాంతంలో ఉన్న బీజేపీ ఎమ్మెల్యే రాజ్‌కుమార్ ఇమో సింగ్ నివాసంపై ఆందోళనకారులు దాడి చేశారు. ఇంటి ఎదుట బైఠాయించి 24 గంటల్లో నిందితులను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఆయన స్పందించకపోవడంతో ఆగ్రహంతో బిజెపి ఎమ్మెల్యే ఇంటిని ధ్వంసం చేశారు. ఆస్తులకు నిప్పు పెట్టారు.

# నేడు సి ఎం పర్యటన వేళ ట్రాఫిక్ మళ్ళింపు

హనుమకొండ ప్రతినిధి(భారత శక్తి)నవంబర్18:నేడు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి వరంగల్ పర్యటన సందర్భంగా వరంగల్ ,హనుమకొండ కాజీపేట నగరాల్లో ట్రాఫిక్ మళ్ళింపుతో పాటు ట్రాఫిక్ ఆంక్షలు అమలు చేయబడుతాయి. కావున హైదరాబాద్, ఖమ్మం, హుజురాబాద్, ములుగు అపై ప్రాంతాల నుండి వచ్చే వాహనదారులు క్రింది తెలిపిన విధంగా ఆయా ఆయా మార్గాల్లో ప్రయాణించాల్సి వుంటుందని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా వాహనదారులకు సూచించారు.హుజురాబాద్ వైపు నుండి హైదరాబాద్, ఖమ్మం ప్రాంతాలకు వెళ్ళే వాహనాలు చింతగట్టు ఓ.ఆర్.ఆర్, కరుణాపురం మీదుగా హైదరాబాద్ కు వెళ్లవలసివుంటుంది. కరుణాపురం ఐనవోలు, పున్నేలు మీదుగా ఖమ్మంకు పోవాల్సి వుంటుంది.పరకాల, ములుగు మార్గాల నుండి హైదరాబాద్, ఖమ్మం, కరీంనగర్ ప్రాంతాలకు వెళ్ళే వాహనాలు ఓ.ఆర్.ఆర్, కరుణాపురం మీదుగా హైదరాబాద్ కు వెళ్లవలసివుంటుంది. కరుణాపురం ఐనవోలు, పున్నేలు మీదుగా ఖమ్మం కు వెళ్లవలసి ఉంటుంది. వర్ధన్నపేట అపై మార్గాల నుండి హైదరాబాద్, కరీంనగర్, ములుగు, పర్కాల, భూపాలపల్లి వెళ్ళే వాహనాలు పున్నేలు క్రాస్ నుండి డైవర్షన్ తీసుకోని ఐనవోలు, కరుణాపురం ఓ.ఆర్.ఆర్ మీదుగా పోవాల్సి వుంటుంది.పైన సూచించిన మార్గాల మీదుగా వారి, వారి గమ్యస్థానాలకు చేరుకోవాల్సి వుంటుంది.ముఖ్యంగా హనుమకొండ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజిలో జరిగే ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి బహిరంగ సభకు వచ్చే వాహనాలు క్రింద తెలిపిన మార్గాల మీదుగా రావల్సి వుంటుంది.హుజురాబాద్ వైపు నుండి వచ్చే వాహనాలు చింతగట్టు వద్ద ఆర్ పైకి ఎక్కి ఉనికిచర్ల క్రాస్ రోడ్, వడ్డేపల్లి చర్చి రిజిస్ట్రేషన్ ఆఫీస్ తెలంగాణ జంక్షన్ వడ్డేపల్లి రోడ్ నుండి సర్క్యూట్ గెస్ట్ హౌస్ వద్ద ప్రజలను దింపి ఖాళీ వాహనాలను ఓల్డ్ బస్ డిపో వద్ద తమవాహనాలను పార్కింగ్ చేయాల్సి వుంటుంది.హనుమకొండ ములుగు భూపాల్ పల్లి నుండి వచ్చే వాహనాలు పెద్దమ్మగడ్డ డైవర్షన్ నుండి కేయూసి జంక్షన్, 100 ఫీట్ల రోడ్ మీదుగా గోపాలపూర్ జంక్షన్ తిరుమల జంక్షన్ ఎక్సైజ్ కాలనీ ఐలాండ్ వద్ద దించి ఖాళీ వాహనాలను ఎక్సైజ్ కాలనీ 1 లో తమ వాహనాలను పార్కింగ్ చేయాల్సి వుంటుంది.

నర్సంపేట వైపు నుండి వచ్చే వాహనాలు చింతల్ బ్రిడ్జ్ ఆర్ టీ ఏ హంటర్ రోడ్ మీదుగా నీలిమా జంక్షన్,తెలంగాణ జంక్షన్ వద్ద దింపి తమ వాహనాలను సూచించిన ప్రదేశం లో పార్కింగ్ చేయాల్సి వుంటుంది.మామునూరు నుండి వచ్చే వాహనాలు ఆర్ టీ ఏ జంక్షన్, ఉర్సు గుట్ట సి ఎస్ ఆర్ గార్డెన్స్ మీదుగా హంటర్ రోడ్ నీలిమా జంక్షన్,తెలంగాణ జంక్షన్ వద్ద వద్ద దించి ఖాళీ వాహనాలను విష్ణుప్రియ గార్డెన్స్ లో తమ వాహనాలను పార్కింగ్ చేయాల్సి వుంటుంది.ఘనుపూర్ ఆపై మార్గాల నుండి వచ్చే వాహనాలు ఓ ఆర్ ఆర్ మీదుగా ఉనికిచర్ల ఎక్స్ రోడ్ వడ్డేపల్లి చర్చి ప్రశాంతినగర్ పార్క్ తెలంగాణ జంక్షన్ మీదుగా ఏ టు జడ్ వద్ద దించి ఖాళీ వాహనాలను తెలంగాణ జంక్షన్ వద్ద తమ వాహనాలను పార్కింగ్ చేయాల్సి వుంటుంది.

ఈ ట్రాఫిక్ మళ్లింపు ఆంక్షలు ఉదయం 9 గంటల నుండి సాయంత్రం మీటింగ్ ముగిసే వరకు కొనసాగించబడతాయినేడు ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా వరంగల్ ట్రై సిటి పరిధిలో ట్రాఫిక్ రద్దీ కారణంగా మళ్ళింపు, ఆంక్షలు వున్నందున వాహనదారులు అవసరం వుంటే తప్ప తమ వాహనాలను రోడ్ పైకి తీసుకరావద్దని ,మరీ ముఖ్యంగా బహిరంగ సభ జరిగే ఆర్ట్స్ కాలేజ్ పరిసరాల వద్ద కఠినమైన ఆంక్షలు ఉంటాయని ట్రాఫిక్ పోలీసులు స్పష్టం చేశారు. అలాగే నేడు ట్రైసిటీస్ లోకి ఎటువంటి భారీ వాహనాలను ( రెడిమిక్స్ వాహనాలు, డిసీఎం, లారీలను )అనుమతించబోమని ట్రాఫిక్ పోలీసులు స్పష్టం చేసారు.

# కాంట్రాక్ట్ కార్మికులు విదిగా బ్యాంకు ఖాతా తీసుకోవాలి: ఎస్ ఓ టు జి ఎం.విజయ ప్రసాద్.

మందమర్రి టౌన్, నవంబర్ 18, (భారత శక్తి) ఒప్పంద కార్మికులు విధిగా బ్యాంకు ఖాతా తీసుకోవాలని ఎస్ఓటో జి ఎం. విజయ ప్రసాద్ తెలిపారు. సోమవారం జిఎం కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడుతూ సింగరేణిలో కాంట్రాక్టు కార్మికులకు యాక్సిడెంట్ ఇన్సూరెన్స్ పేరిట హెచ్డిఎఫ్సి బ్యాంకుతో ఒప్పందం చేసుకుందని తెలిపారు. ప్రతి కార్మికుడు బ్యాంకులో ఖాతా తీసుకోవాలని, కార్మికుడు విధుల్లో చనిపోతే 20 లక్షల బీమా వస్తుందని తెలిపారు. ప్రతి కార్మికుడు కనీసం ఆరు నెలలకు ఒకసారైనా తన డెబిట్ కార్డు వినియోగించుకోవాలని, తద్వారా ఆ కార్మికుడికి అదనంగా పదిలక్షల లబ్ధ చేకూరుతుందని అన్నారు. కార్మికుని కుటుంబంలో పిల్లలు చదువుకున్నట్లయితే ఆ కుటుంబానికి నాలుగు లక్షల లభిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో పర్సనల్ మేనేజర్ ఎం శ్యాంసుందర్, శాంతి గాని



ఏజెంట్ డీజీఎం ఖాదిర్ పాషా, సివిల్ స్ ఈ రాము, హెచ్డిఎఫ్సి బ్యాంక్ మేనేజర్ ప్రభాకర్ అధికారులు కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

# మీడియాలో విలువల క్షీణత
# మీడియా అకాడమీ చైర్మన్ నిర్ణయాల పుణ్యమే...!

### -వారి నిష్క్రియ ప్రియత్నం వల్లే జర్నలిజంలో విపరీత పోకడలు

### -బైంసాలో సభ్యత్వ నమోదు కార్యక్రమంలోడబ్ల్యూజేఐ నేతల ఆరోపణ.





బైంసా, భారత శక్తి ప్రతినిధి,నవంబర్ 18:జర్నలిజం వృత్తిలో విలువల క్షీణతకు, విపరీత పోకడలకు,60 ఏళ్లుగా జర్నలిస్టు సమాజానికి తామే ప్రతినిధులమని చెప్పుకుంటున్న సంఘమే ప్రధాన కారణమని బిఎంఎస్ అనుబంధ వర్కింగ్ జర్నలిస్ట్ ఆఫ్ ఇండియా తెలంగాణ రాష్ట్ర శాఖ ఉపాధ్యక్షుడు తాడూరు కరుణాకర్, కార్యదర్శి శివనాద్రి ప్రమోద్ కుమార్ ఆరోపించారు.సమాజంలో జర్నలిజం వృత్తి ఇంతలా అప్రద మూట కట్టుకోవడానికి అరవై ఏళ్లుగా ఆ సంఘానికి నేతృత్వం వహించిన మీడియా అకాడమీ చైర్మన్ కే శ్రీనివాసరెడ్డి నిష్క్రియా ప్రియత్నవే కారణమని అనడంలో సందేహం లేదని తెలిపారు.సోమవారం నిర్మల్ జిల్లా బైంసా కతగాం వేద తపోవం ఇంటర్నేషనల్ స్కూల్ ఆవరణలో జరిగిన డబ్ల్యూజేఐ సభ్యత్వ నమోదు కార్యక్రమానికి కరుణాకర్, ప్రమోద్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జర్నలిజం వృత్తి విలువలు పెంపొందించడంలో, ఈ రంగంలో వస్తున్న పెడధోరణులకు అడ్డుకట్ట వేయడంలో ఇంతకాలం జర్నలిస్టులకు ప్రాతినిధ్యం వహిస్తున్న సంఘాల వైఫల్యం స్పష్టంగా కనిపిస్తుందన్నారు.విలేకరుల వేతన వ్యవస్థ, ఉద్యోగ భద్రత అనేవి ఎండమావిలా మిగిలిపోయాయని వీటిని చక్కదిద్దడంలో జరిగిన వైఫల్యం టియుడబ్ల్యూజే లాంటి సంఘాల వైఫల్య ఫలితమేనని అన్నారు.గ్రామీణ విలేకరుల దుస్థితికి,స్థానిక పత్రికల దయనీయ పరిస్థితులకు మీడియా అకాడమీ చైర్మన్ బాధ్యత వహించాల్సి ఉ ంటుందన్నారు.కాస్తయినా మిగిలి ఉన్న జర్నలిజం వృత్తి విలువలు కాపాడడానికి, ఈ రంగంలోకి కొత్తగా వస్తున్న యువతకు నైపుణ్య శిక్షణ తరగతులు అందించేందుకు, అక్రిడిటేషన్లలో జరుగుతున్న అన్యాయాలపై గళం విప్పేందుకు జాతీయ వాద జర్నలిస్టు సంఘం డబ్ల్యూజేఐ తో తెలంగాణలోని జర్నలిస్టులు కలిసి రావాలని కోరారు.బైంసాలో జరిగిన సమావేశానికి స్థానిక పాత్రికేయుడు మాధవరావు సమన్వయకర్తగా వ్యవహరించగా డబ్ల్యూజేఐ నాయకులు దారం జగన్నాథరెడ్డి, టి. సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. స్థానిక జర్నలిస్టులు పెద్ద సంఖ్యలో హాజరై సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# అమల్లోకి తెలంగాణ ఈవీ పాలసీ...

హైదరాబాద్, నవంబర్ 18, తెలంగాణ ఎలక్ట్రిక్ వెహికిల్ అండ్ ఎనర్జీ స్టోరేజ్ పాలసీ 2020-2030 పేరుతో కాలుష్య నియంత్రణ కొత్త పాలసీని తీసుకొచ్చింది. ప్రమాదాల నివారణ, కాలుష్య నియంత్రణకు ఈ విధానం తెచ్చింది. జీవో నెంబర్ 41 ద్వారా తీసుకొచ్చే ఈ విధానం 2026 వరకు అమల్లో ఉంటుంది. తెలంగాణను కాలుష్యరహితంగా మార్చేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్టు ప్రభుత్వం చెబుతోంది. విద్యుత్ వాహనాల వాడకాన్ని ప్రోత్సహించడానికి భారీగా రాయితీలు ఇస్తోంది. తెలంగాణలో విద్యుత్‌తో నడిచే టూ వీలర్స్, ఆటో, ట్రాన్స్పోర్ట్, బస్సులకు వంద శాతం పన్ను రాయితీ ఇస్తున్నారు. రిజిస్ట్రేషన్ ఫీజు తీసుకోమని ప్రభుత్వం ప్రకటించింది. ప్రభుత్వం కూడా విద్యుత్ వాహనాలను రోడ్లపైకి భారీగా తీసుకురానుంది. రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో దాదాపు 3 వేలకుపైగా ఈవీలను ప్రవేశపెట్టనుంది. ఎలక్ట్రిక్ వెహికల్స్ ద్వారా కాలుష్యం తగ్గడమే కాకుండా వినియోగదారుల డబ్బులు కూడా ఆదా అవుతాయని మంత్రి పొన్నం ప్రభాకర్ చెప్పారు. కొత్తగా తీసుకొచ్చిన ఈ ఎలక్ట్రిక్ వెహికల్ పాలసీ 31 డిసెంబర్ 2026 వరకు అమలులో ఉంటుంది. రాష్ట్రంలో 15 సంవత్సరాల దాటిన వాహనాలు స్క్రాప్ చేయాలని చెప్పామని అందుకు తగ్గట్టుగానే జిల్లాల్లో ఆటోమాటిక్ టెస్టింగ్ సెంటర్స్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. కాలం చెల్లిన వాహనాలతో కాలుష్య మాత్రమే కాకుండా ప్రమాదాలు పెరిగిపోతున్నాయని అన్నారు మంత్రి. ఇలాంటివి తెలంగాణ వ్యాప్తంగా దాదాపు 12 లక్షలు ఉ న్నట్టు వెల్లడించారు.

# మామిడి రైతులను ఆదుకోని దళారుల నుండి కాపాడండి:సామాజిక కార్యకర్త వంజరి వెంకటేష్.

## స్పందించిన బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి.



మంచిర్యాల జిల్లా ప్రతినిధి, నవంబర్ 18, (భారత శక్తి):మంచిర్యాల జిల్లాలోని మూడు నియోజకవర్గల వ్యవసాయ మామిడి రైతులు బెల్లంపల్లి, చెన్నూర్, మంచిర్యాల్, మామిడి రైతులను ఆదుకోవాలని దళారుల నుండి మోసపోకుండా చూడాలి మామిడి వ్యవసాయ మార్కెట్ యార్డ్ ను పూర్తిస్థాయిలో రైతులకు అందుబాటులోకి తీసుకురావాలి అని కోరుతు సామాజిక కార్యకర్త వంజర వెంకటేష్ ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామికి వినతి పత్రం అందజేశారు.అధికారుల నిర్లక్ష్యం, పట్టింపులేని విధానాలతో బెల్లంపల్లి పట్ట ణంలో మామిడి కొనుగోలు కేంద్రం ఏర్పా టులో జాప్యం జరుగుతోంది.

మూడేళ్ల క్రితం స్థలం కేటాయించి రెండు షెడ్లు నిర్మించినప్పటికీ మామిడి పండ్ల కొనుగోలు కేంద్రం ఏర్పాటుకాక షెడ్లు నిరుప యోగంగా మారాయి. బెల్లంపల్లి నియోజక వర్గంలోని బెల్లంపల్లి, నెన్నెల, తాండూర్, భీమిని, చెన్నూర్ నియోజకవర్గంలోని చెన్నూర్, మామిడిగట్టు, కోటపల్లి, భీమారం, మంచిర్యాల నియోజక వర్గంలోని లక్షట్పేట్, హాజీపూర్ ,మండలాల్లో మామిడి తోటలు విస్తరించి ఉన్నాయి. ఈ జిల్లాలో మామిడి పండ్ల కొనుగోలు కేంద్రం అందుబాటులో లేకపోవడంతో ఏటా జిల్లా రైతులు మహారాష్ట్రలోని నాగ్‌పూర్, చంద్రపూర్‌లలో విక్రయిస్తారు. కొందరు మామిడి రైతులు దళారుల బారిన పడి మోసపోతున్నారు. బెల్లంపల్లి వ్యవసాయ మార్కెట్‌లో 2015లో రాష్ట్ర మార్కెటింగ్, శాఖ మంత్రి గారు మామిడిమార్కెట్ యార్డును మంజూరు చేశారు. వ్యవసాయ మార్కెట్ యార్డు పక్కనే గల ఐదు ఎకరాల స్థలాన్ని కేటాయించగా ప్రభుత్వం రూ. 1.26 కోట్లను మంజూరు చేసింది.

దాదాపు 10వేల టన్నుల సామర్థ్యం గల రెండు కవర్ షెడ్లను మూడేళ్ల క్రితం నిర్మించారు. షెడ్లు నిర్మించినప్పటికీ అంతర్గత రోడ్లు నిర్మించలేదు. ఈ యార్డుకు అను బంధంగా కోల్డ్‌స్టోరేజీ ప్లాంటును ప్రభు త్వం మంజూరు చేయలేదు. రెండేళ్ళ క్రితమే కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తా మని ప్రకటించి నప్పటికీ నేటికి దీని ఊసే లేకపోవడంతో జిల్లాకు చెందిన మామిడి రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పుడిప్పుడే మామిడి పూతతో పాటు పిందెలు వస్తున్నాయి. ఏప్రిల్‌లోగా పంట చేతికందే అవకాశాలు ఉన్నాయి. జిల్లా అధికార యంత్రాంగం చొరవచూపి బెల్లంపల్లిలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించాలని కోరుతున్నారు.

జిల్లా వ్యాప్తంగా 18,108 ఎకరాల్లో మామిడి తోటల సాగు.....

మంచిర్యాల జిల్లా వ్యాప్తంగా మొత్తం 18,108 ఎకరాల్లో మా మిడి తోటలను సాగుచేస్తున్నారు. ఏటా 37,170 టన్నుల దిగుబడి అంచనా వేశారు. బెల్లంపల్లిలో 1,664 ఎకరాల్లో, కాసిపేటలో 51, తాండూర్‌లో 1,887 ఎకరాల్లో కలిపి బెల్లంపల్లి డివిజన్‌లో 3,602 ఎకరాల్లో సాగు చేస్తున్నారు. భీమిని 144 ఎకరాల్లో, కన్నెపల్లి 182, నెన్నెల 5,832, వేమనపల్లి 70, భీమారంలో 2,322, చెన్నూర్‌లో 1,167, జైపూర్‌లో 1,908, కోటపల్లిలో 769, మందమర్రి 1,102 ఎకరాల్లో తోటలను సాగు చేస్తున్నారు. దండెపల్లిలో 384 ఎకరాల్లో, హాజీపూర్‌లో 159, జన్నారంలో 421, లక్షెట్టిపేటలో 41, మంచిర్యాలలో 2, నస్పూర్‌లో 3ఎకరాల్లో సాగు చేస్తున్నారు.

అలంకారప్రాయంగా మార్కెట్ షెడ్లు..

కోట్ల రూపాయలు ఖర్చు చేసి మామిడి పండ్ల కొనుగోలు కేంద్రం ఏర్పాటుకు కవర్ షెడ్లు నిర్మించినా అవి నిరుపయోగంగా మారాయని రైతులు వాపోతున్నారు. మహారాష్ట్రలోని నాగపూర్‌లో మామిడి పండ్లను అమ్ముతున్నట్లు రైతులు పేర్కొంటున్నారు. నాగపూర్‌లో సరైన గిట్టుబాటు ధర లభించక మధ్యదళారుల ప్రమేయంతో తీవ్రంగా నష్టపోతున్నట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైన ఉన్నతాధికారులు, రాష్ట్ర ప్రభుత్వం స్పందించి మామిడి మార్కెట్ యార్డులో కోల్డ్ స్టోరేజ్ ప్లాంటు ఏర్పాటుకు నిధులు మంజూరయ్యేలా, అంతర్గత రోడ్లు నిర్మించేలా కృషి చేసీ క్రయవిక్రయాలు జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ స్పందన...... కలెక్టర్కు ఆదేశాలు.

బెల్లంపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి స్పందిస్తూ కోల్డ్ స్టోరేజీ ప్లాంట్ కి సంబంధించిన అయ్యే ఖర్చు అంచనా వేయం తయారు చేయండి అని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మరియు మంచిర్యాల్ జిల్లా మార్కెట్ అధికారి డి ఎం చె ప్పడం జరిగింది.ఈ కార్యక్రమంలో వంజారీ వెంకటేష్ అడిగోప్పల మురళి, వనపర్తి వెంకటేష్, మెరుగు ధనంజయ్ తదితరులు పాల్గొన్నారు.

# పర్మిషన్ లేకుండా ఏర్పాటు చేస్తున్న బార్ అండ్ రెస్టారెంట్ లో ప్రమాదం
# కాలుజారి కరెంటు తీగల మీద పడడంతో తీవ్ర గాయాల పాలైన కార్మికుడు

సూర్యాపేట జిల్లా బ్యూరో (భారత శక్తి) నవంబర్ 18:సూర్యాపేట జిల్లా హుజూర్ నగర్ పట్టణంలో సోమవారం నూతనంగా ఎలాంటి పర్మిషన్లు లేకుండా మూడు రోడ్ల కూడలిలో హాస్పటల్ ప్రక్కన ఏర్పాటు చేస్తున్న స్వాగత్ రెస్టారెంట్ అండ్ బార్ ను త్వరలో ఏర్పాటు చేసేందుకు సిద్ధం చేస్తున్నారు. సోమవారం బిల్డింగ్ పైన రేకులు మరమ్మతు చేస్తూ ఒక్కసారిగా ఇనుప నిచ్చెన జారీ ట్రాన్స్ఫారం పక్కన కరెంటు తీగల మీద పడడంతో బీహార్ కు చెందిన వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఇట్టి విషయంలో మున్సిపల్ అధికారుల పర్మిషన్లు ఉన్నాయా అని అడిగితే ఎలాంటి పర్మిషన్లు లేవని మున్సిపల్ సిబ్బంది తెలియజేశారు. గాయాలు ఆయన వ్యక్తిని పట్టణంలోని ప్రభుత్వ హాస్పిటల్ నందు చేర్పించి చికిత్స అందిస్తున్నట్లు తోటి పని వారు తెలిపారు.



# కేంద్ర మంత్రి జిల్లా కేంద్ర గ్రంధాలయానికి పుస్తకాల బీరువా తో పాటుగా పోటీ పరీక్షలకు అవసరమైన పుస్తకాల బహుకరణ



శ్రీకాకుళం, భారత శక్తి ప్రతినిధి, నవంబర్ 18:జిల్లా గ్రంధాలయ సంస్థ శ్రీకాకుళం 57 వ జాతీయ గ్రంధాలయ వారోత్సవాలకు నేడు ముఖ్య అతిధి గా విచ్చేసిన కేంద్ర పౌరవిమానయాన శాఖామాత్యులు శ్రీ కింజరాపు రామ్మోహన్ నాయుడు గారు ఎర్రన్న విద్యాసంకల్పం కింద జిల్లా కేంద్ర గ్రంధాలయానికి పుస్తకాల బీరువా తో పాటుగా పోటీ పరీక్షలకు అవసరమైన పుస్తకాలను జిల్లా కేంద్ర గ్రంధాలయానికి బహుకరించారు.తదనంతరం ఏర్పాటు చేసిన సభలో మంత్రి వర్యులు గ్రంధాలయ ఉద్యమ పితామహులు, మరియు మాజీ కేంద్ర మంత్రి వర్యులు కీర్తిశేషులు శ్రీ ఎర్రంనాయుడు చిత్రపటం వద్ద జ్యోతిప్రజ్వలన చేసి పూలమాల వేసి నివాళులు అర్పించారు.అనంతరం సభను ఉద్దేశించి ప్రసంగించిన మంత్రివర్యులు పార్లమెంట్ సభ్యుడి గా నావంతు ఏదయినా కృషి చేయాలనీ ఉదేశ్యం తో గ్రంథాలయాల పై ప్రత్యేకంగా ద్రుష్టి పెట్టడం జరిగింది అని యువత ఎక్కువగా ప్రస్తుత పరిస్థితులలో గ్రంథాలయాలకి వచ్చి చదువుకుంటున్నందున ఎర్రన్న విద్యాసంకల్పం కింద పోటీపరీక్షలకు అవసరమైన పుస్తకాలు సమకూర్చినట్లు తెలియజేసారు.మరియు కేంద్ర గ్రంధాలయానికి అవసమైన మౌళిక సదుపాయలు కల్పిస్తామన్నారు.సభను ఉదేశించి ప్రసగించిన శ్రీకాకుళం జిల్లా కలెక్టర్ శ్రీ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ గ్రంధాలయం లో గ్రంధాలయం లో విద్యార్థులు పుస్తకాలు చదివి ప్రభుత్వ పోటీ పరీక్షలలో విజయాన్ని సాధించాలని కోరారు.కార్యక్రమం లో ఉత్తమ గ్రంథపాలకులు ఎం. చంద్రశేఖర్, జి.గోవిందరావు, కె. చిరంజీవులు,ఎన్.చాయారతన్, కాళ్ళరాజు, ఎస్. వీ. రమణ మూర్తి లకు మంత్రి, కలెక్టర్ చేతులమీదుగా సత్కారం చేయడం జరిగింది. ఈకార్యక్రమం శ్రీకాకుళం జిల్లా గ్రంధాలయ కార్యదర్శి బుర్రి కుమార్ రాజు వందన సమర్పణ తో ముగిసినది. ఈ కార్యక్రమం లో శ్రీకాకుళం జిల్లా కేంద్ర గ్రంధాలయ డిప్యూటీ లైబ్రేరియన్ వివిజిఎస్ శంకర రావు, అసిస్టెంట్ లైబ్రేరియన్ భాస్కర రాజా, జిల్లా లో గల గ్రంధాలయాధికారులు పాల్గొన్నారు.

# ఢిల్లీలో బీజేపీ ఆపరేషన్...
# ఆప్ వికెట్లు డౌన్

న్యూఢిల్లీ, నవంబర్ 18,

ఢిల్లీ మంత్రి, ఆమ్ ఆద్మీ పార్టీ నాయకుడు కైలాష్ గెహ్లాట్ రాజీనామా చేశారు. ఈ మరేకు పార్టీ అధినేతఅరవింద్ కేజ్రీవాల్‌కు రాసిన లేఖలో తన రాజీనామాకు కారణాలు వివరించారు. ఇందులో కీలక ఆరోపణలు చేశారు. పార్టీ స్థాపించినప్పటి విలువలకు ఇప్పుడు జరుగుతున్న పరిణామాలకు చాలా వ్యత్యాసం ఉందని అభిప్రాయపడ్డారు. అందర్నీ ఏకం చేసిన విలువ నుంచి పార్టీ దూరమై సవాళ్లు ఎదుర్కొంటోందని అన్నారు. ప్రజల పట్ల పార్టీ నిబద్ధతను రాజకీయ ఆశయాలు అధిగమించాయని అన్నారు గెహ్లాట్. ఫలితంగా చాలా వాగ్దానాలు నెరవేరకుండా మిగిలిపోయాయని అన్నారు.

# సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాలి:జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

## ప్రజావాణిలో వినతులను స్వీకరించిన జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్ లు







ఖమ్మం ప్రతినిది (భారత శక్తి ), నవంబర్ 18:ప్రజావాణిలో తమ సమస్యలు తెలుపుతూ ప్రజలు సమర్పించిన దరఖాస్తుల పరిష్కారానికి సత్వర చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అధికారులను ఆదేశించారు.

సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్ లు డా. పి. శ్రీజ, పి. శ్రీనివాస్ రెడ్డి, శిక్షణ సహాయ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ లతో కలిసి ప్రజల నుండి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ, ప్రజావాణి దరఖాస్తులకు ప్రాధాన్యత నిచ్చి సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాలని అన్నారు. బోనకల్ మండలం మొటమర్రి గ్రామానికి చెందిన మరీదు వెంకన్న తమది చాలా నిరుపేద కుటుంబమని, తన పాప చదువుకు ఆర్థిక భారం అవ్వకుండా మహాత్మ జ్యోతి బా పూలే రెసిడెన్షియల్ స్కూల్ నందు ఆరవ తరగతిలో సీట్ ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, ఆర్.సి.ఓ., బీసీ సంక్షేమ అధికారికి రాస్తు పరిశీలించి చర్యలు తీసుకోవాలని అన్నారు.

నేలకొండపల్లి మండలం చెరువుమాధారం గ్రామానికి చెందిన ఎస్.కే. పాషా తాను ఎం.ఎల్.టి, డిప్లొమా ఇన్ మల్టీ పర్పస్ హెల్త్ అసిస్టెంట్ చదువుకున్నానని, ఆర్థికంగా ఇబ్బందులు ఉన్నందున తనకు ఏదో ఒక ఉద్యోగం ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారికి రాస్తూ పరిశీలించాలని కలెక్టర్ తెలిపారు. రఘునాధపాలెం మండలం పువ్వాడ ఉదయ నగర్ కాలనీకి చెందిన యర్రం ఉమాదేవి తన భర్త కృష్ణకు రెండు కిడ్నీలు క్షీణించి మరణించారని, తనకు వితంతు పెన్షన్ మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారిణి ఎం. రాజేశ్వరి, డిఆర్డీవో ఎస్. సన్యాసయ్య, కలెక్టరేట్ ఏవో అరుణ, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ స్థాయిలో జిల్లా కూచిపూడి కళాకారుల ప్రతిభ

## తెలుగువారి గొప్ప నృత్య సంపద కూచిపూడి.



మంచిర్యాల జిల్లా ప్రతినిధి, నవంబర్ 18, (భారత శక్తి): భారతీయ శాస్త్రీయ సంప్రదాయ నృత్యాలన్నీ దేవుళ్లను ఆరాధిస్తూ కొనసాగుతాయి. అందుకే ఆయా అంశాలకు కళాకారులు పలికించే భావాల్లో ఆ భగవంతున్ని సాక్షాత్కరిస్తాడని వక్తలన్నారు. సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ ఫారం ఫ్రైడ్ ఇండియా కల్చర్ ఆధ్వర్యంలో శ్రీకాళహస్తిలోని ఎంవీఎస్ ఫంక్షన్ హాల్ లో కార్తీక పౌర్ణమి పురస్కరించుకొని రెండు రోజులు పాటు నిర్వహించిన నేషనల్ లెవెల్ ఆర్ట్స్ అండ్ కల్చర్ అవార్డు ఫెస్ట్ నృత్య సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ రాష్ట్రాల నుంచి కళాకారులు చక్కటి అంశాలను ప్రదర్శించి ప్రేక్షకులను మెప్పించారు. భారతీయ సాంస్కృతిక వైభవాన్ని చాటిచెప్పారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా "డాక్టర్ వేదాంతం రాజేశం మాస్టర్ కూచిపూడి లెజెండరీ" హాజరయ్యారు.. ఈ నాట్యోత్సవంలో సోమవారం తెలంగాణలోని మంచిర్యాల జిల్లా నుండి శ్రీ నందిని నృత్యాలయం ఫౌండర్, గురువు, నేషనల్ లెవెల్ డా? ఏపీజే అబ్దుల్ కలాం ఎక్స్ లెన్స్ అవార్డు గ్రహీత, నాట్య విభూషణి శ్రీ అన్నం కల్పన శిష్య బృందం శ్రీకరి, వినుజ, ఓజస్వి, శివాళిక, అభిజ్ఞ శ్రీ, హిరణ్య, సాధిక, అలోఖి, జ్ఞాపిక ప్రవస్తి, ఆరాధ్య, గీతిక, కూచిపూడి నాట్య ప్రదర్శనలు చెశారు. వారి ప్రతిభను గుర్తించి. "అవార్డుతోపాటు సర్టిఫికెట్ మెడలు, బ్యాడ్జీలు ప్రధానం చేశారు. అనంతరం గురువు అన్నం కల్పన ను అవార్డ్" తో ఘనంగా సన్మానించి సత్కరించారు.. మంచిర్యాల జిల్లా నుండి శ్రీ నందిని నృత్యాలయం ఆధ్వర్యంలో జాతీయస్థాయి లో నృత్య ప్రదర్శన చేసి అవార్డులు అందుకున్నందుకు మన జిల్లాకే గౌరవకరమని పలువురు ప్రశంసించి అభినందనలు తెలియజేశారు..

# మీడియాలో విలువల క్షీణత

## మీడియా అకాడమీ చైర్మన్ నిర్ణయాల పుణ్యమే...!

### -వారి నిష్క్రియ ప్రియత్నం వల్లే జర్నలిజంలో విపరీత పోకడలు

### -బైంసాలో సభ్యత్వ నమోదు కార్యక్రమంలోడబ్ల్యూజేఐ నేతల ఆరోపణ.

బైంసా, భారత శక్తి ప్రతినిధి,నవంబర్ 18:జర్నలిజం వృత్తిలో విలువల క్షీణతకు, విపరీత పోకడలకు,60 ఏళ్లుగా జర్నలిస్టు సమాజానికి తామే ప్రతినిధులమని చెప్పుకుంటున్న సంఘమే ప్రధాన కారణమని బిఎంఎస్ అనుబంధ వర్కింగ్ జర్నలిస్ట్ ఆఫ్ ఇండియా తెలంగాణ రాష్ట్ర శాఖ ఉపాధ్యక్షుడు తాడూరు కరుణాకర్, కార్యదర్శి శివనాద్రి ప్రమోద్ కుమార్ ఆరోపించారు.సమాజంలో జర్నలిజం వృత్తి ఇంతలా అపప్రద మూట కట్టుకోవడానికి అరవై ఏళ్లుగా ఆ సంఘానికి నేతృత్వం వహించిన మీడియా అకాడమీ చైర్మన్ కె శ్రీనివాసరెడ్డి నిష్క్రియా ప్రియత్నమే కారణమని అనడంలో సందేహం లేదని తెలిపారు.సోమవారం నిర్మల్ జిల్లా బైంసా కతగాం వేద తపోవం ఇంటర్నేషనల్ స్కూల్ ఆవరణలో జరిగిన డబ్ల్యూజేఐ సభ్యత్వ నమోదు కార్యక్రమానికి కరుణాకర్, ప్రమోద్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జర్నలిజం వృత్తి విలువలు పెంపొందించడంలో, ఈ రంగంలో వస్తున్న పెడధోరణులకు అడ్డుకట్ట వేయడంలో ఇంతకాలం జర్నలిస్టులకు ప్రాతినిథ్యం వహిస్తున్న సంఘాల వైఫల్యం స్పష్టంగా కనిపిస్తుందన్నారు.విలేకరుల వేతన వ్యవస్థ, ఉద్యోగ భద్రత అనేవి ఎండమావిలా మిగిలిపోయాయని వీటిని చక్కదిద్దడంలో జరిగిన వైఫల్యం టియుడబ్ల్యూజే లాంటి సంఘాల వైఫల్య ఫలితమేనని అన్నారు.గ్రామీణ విలేకరుల దుస్థితికి,స్థానిక పత్రికల దయనీయ పరిస్థితులకు మీడియా అకాడమీ చైర్మన్ బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు.

కాస్తయినా మిగిలి ఉన్న జర్నలిజం వృత్తి విలువలు కాపాడడానికి, ఈ రంగంలోకి కొత్తగా వస్తున్న యువతకు నైపుణ్య శిక్షణ తరగతులు అందించేందుకు, అక్రిడిటేషన్లలో జరుగుతున్న అన్యాయాలపై గళం విప్పేందుకు జాతీయ వాద జర్నలిస్టు సంఘం డబ్ల్యూజేఐ తో తెలంగాణలోని జర్నలిస్టులు కలిసి రావాలని కోరారు.బైంసాలో జరిగిన సమావేశానికి స్థానిక పాత్రికేయుడు మాధవరావు సమన్వయకర్తగా వ్యవహరించగా డబ్ల్యూజేఐ నాయకులు దారం జగన్నాథరెడ్డి, టి. సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. స్థానిక జర్నలిస్టులు పెద్ద సంఖ్యలో హాజరై సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# హుజూర్ నగర్ మఠంపల్లి మండలాధికారుల పరిమిషన్లు లేకుండానే మట్టితోలకాలు



సూర్యాపేట జిల్లా బ్యూరో (భారత శక్తి) నవంబర్ 18:సూర్యాపేట జిల్లా హుజూర్ నగర్ పట్టణ కేంద్రంలో ప్రతిరోజు 10 నుండి 20 ట్రిప్పర్లు మట్టితో ఎలాంటి భయం లేకుండా ఎలాంటి పర్మిషన్లు లేకుండా రాంగ్ రూట్లో పయనిస్తున్నా కనీసం అధికారులకు కనబడకపోవడం లేదా మఠంపల్లి హుజూర్నగర్ సరిహద్దుల్లో గల ఎర్రగట్టు వద్ద గల గుట్టలను యథేచ్ఛగా తవ్వేస్తున్నారు. భారీ యంత్రాలతో మట్టి తొలిచి రోడ్లు,లేఅవుట్లు, వెంచర్లు,ఇంటి నిర్మాణ పనులకు అక్రమంగా తరలిస్తూ మట్టి గుట్టలు మాయం చేస్తున్నారు మట్టి తవ్వకాలకు మఠంపల్లి, హుజూర్ నగర్ రెవిన్యూ, గ్రామపంచాయతీ, మరియు భూగర్భ శాఖఅధికారుల నుంచి ఎలాంటి అనుమతి తీసుకోవడం లేదు. నిబంధనలకు తిలోదకాలిస్తూ మట్టిని తవ్వి టిప్పర్లలో నింపి తరలిస్తున్నా సంబంధిత శాఖా అధికారుల ఉదాసీన వైఖరి వల్లనే మూడు పువ్వులు ఆరు కాయళ్ళ మట్టి వ్యాపారం కొనసాగుతుందని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

# నాణ్యమైన ధాన్యాన్ని వేగవంతంగా కొనుగోలు చేయాలి:జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

## కూసుమంచి మండలం పాలేరు గ్రామంలో సన్న రకం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్

ఖమ్మం ప్రతినిది (భారత శక్తి న్యూస్ ), నవంబర్ 18:కొనుగోలు కేంద్రాలకు వచ్చిన వెంటనే ధాన్యం నాణ్యత ప్రమాణాలు పరిశీలించి కొనుగోలు చేయాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సంబంధిత అధికారులకు సూచించారు. సోమవారం జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ కూసుమంచి మండలం పాలేరు గ్రామంలో సన్న రకం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని అదనపు కలెక్టర్ డా. పి. శ్రీజ, శిక్షణ సహాయ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠలతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కొనుగోలు కేంద్రాలకు వచ్చిన రైతులతో ఎన్ని ఎకరాలలో పంట సాగు చేశారు, ఎంత దిగుబడి వచ్చింది, కొనుగోలు కేంద్రాలకు పంట తెచ్చి ఎన్ని రోజులు అవుతుంది, తేమ శాతం ఎంత ఉంది, టార్పాలిన్ కవర్లు ఇస్తున్నారా, మొదలగు వివరాలను అడిగి తెలుసుకున్నారు. కొనుగోలు కేంద్రాలలో సన్న రకం ధాన్యం కొనుగోలు రిజిస్టర్ లను పరిశీలించారు. కొనుగోలు కేంద్రాల వద్ద అవసరమైన మేర గన్ని బ్యాగులు, టార్పాలిన్ కవర్లు అందుబాటులో ఉంచామని అన్నారు. వర్షాభావ పరిస్థితుల్లో అప్రమత్తంగా ఉంటూ పంటకు టార్పాలిన్ కవర్లు కప్పాలని కలెక్టర్ తెలిపారు. గన్ని సంచులు నాణ్యతను కలెక్టర్ పరిశీలించారు. డెలివరీ సమయంలో నాణ్యతను పరిశీలించాలని కలెక్టర్ సూచించారు. నాణ్యత తక్కువ, చిరిగి ఉన్న గన్ని సంచులు వినియోగించవద్దని, సరఫరా చేసిన వారిపై చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. పాలేరు ధాన్యం కొనుగోలు కేంద్రంలో ఇప్పటి వరకు 99 మంది రైతుల వద్ద నుంచి పంట కొనుగోలు పూర్తి చేశామని అన్నారు. తేమ రాగానే వడ్లకు కాంటా వేయాలని, కొనుగోలు చేసిన ధాన్యం వివరాలు ఎప్పటి కప్పుడు ఓపిఎంఎస్ లో నమోదు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. సన్న రకం ధాన్యానికి ప్రభుత్వం ప్రత్యేకంగా క్వింటాలుకు 500 రూపాయల బోనస్ ప్రకటించిందని, ఇది ప్రత్యేకంగా రైతుల ఖాతాలలో జమ చేయడం జరుగుతుందని అన్నారు. ధాన్యం అమ్మే సమయంలో రైతులు సమర్పించిన బ్యాంకు ఖాతాల్లో బోనస్ డబ్బులు పడ్తాయని అన్నారు.మద్దతు ధరపై నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు చేసిన వెంటనే సంబంధిత మిల్లులకు తరలించాలని, ఎటువంటి ఆలస్యం జరగడానికి వీలు లేదని కలెక్టర్ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఈ తనిఖీలలో జిల్లా కలెక్టర్ వెంట ఐ.కె.పి. ఇన్చార్జి కొత్త జ్యోతి, ఏ.పి.ఎం. సత్యవర్దన్ రాజ్, ఏ.ఓ. రామడుగు వాణి, రైతులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ భూమి కబ్జా.....!

## -పట్టించుకోని అధికారులు

## -గతంలో కూలగొట్టిన చోటనే మళ్లీ నిర్మాణాలు.



మంచిరాల ప్రతినిధి, నవంబర్ 18(భారత శక్తి): మంచిర్యాల జిల్లా మందమర్రి మండల కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయం సమీపంలో గల డబుల్ బెడ్ రూమ్ ఇల్ల పక్కన కోల్బెల్ట్ రహదారి అనుకొని ఉన్న ప్రభుత్వ భూమి కబ్జాకు గురి అయింది. గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చెన్నూరు నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ ఆధ్వర్యంలో డబుల్ బెడ్ రూమ్ ముందు గల కేకే 5 దొరల బంగ్లా ఏరియా నుండి పాల చెట్టు ఏరియా వరకు నిర్మించిన అక్రమ గృహాలను సంబంధిత అధికారులతో కలిసి కూల్చివేయడం జరిగింది. బతుకమ్మ ప్రాంగణం సమీపంలోని ఒక ఆర్ఎంపీ డాక్టర్ ఇల్లు నిర్మించడమే కాకుండా వెనుక వైపు డబుల్ బెడ్ రూమ్ ఇల్లు సమీపం వరకి ఆక్రమించి ప్రహరీ గోడ నిర్మించారు. అలాగే కేకే 5 కాలనీ బస్టాండ్ సమీపంలో నిర్మించుకున్న గృహాల వెనుక కబ్జాకు గురి అయింది. ఎంత కబ్జా చేసినా కూడా అధికారులు పట్టించుకున్న పాపాన పోలేదు ఇల్లు లేని సామాన్యుడు తన నివాసం కోసం గృహాన్ని నిరూపించుకుంటే సంబంధిత అధికారులు కూల్చివేసిన సంఘటనలు ఎన్నో ఉన్నాయి. ప్రభుత్వ భూమి కబ్జా చేసి ఇల్లు నిర్మించుకున్న అధికారులు పటించుకపోవడంలో ఆంతర్యం ఏమిటి ని ప్రజలు వాపోతున్నారు. రాజకీయ%శీ% లో తిరుగుతున్న వారు ఎలాంటి స్థలాన్ని కబ్జా చేసిన పట్టించుకోరా?అలా అయితే సామాన్య ప్రజలు ఇంటి నిర్మాణం కోసం ఇల్లు నిర్మించుకుంటే ఎన్నో ప్రశ్నలూ అలాగే నిర్మించుకున్న ఇళ్లను కూల్చివేయడం ఎంతవరకు సమంజసం అని ప్రజల అభియోగం.

వీటి వెనకాల అధికార పార్టీ ప్రమేయం ఉందని పలువురులు ఆరోపిస్తున్నారు. ఇప్పుడు నిర్మించుకున్న స్థలం కబ్జా చేసిన వారిలో అందరూ అధికార పార్టీలో తిరుగుతున్న వారే,ఇప్పటికైనా కబ్జాదారుల నుండి ప్రభుత్వ భూమిని కాపాడాలి.దీనిపై ఎమ్మార్వో ను వివరణ కోరగా.. తమ దృష్టికి రాలేదని అయినా అధికారులతో తనిఖీ చేయించి అక్రమ నిర్మాణాలు చేపట్టితే చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# డీజీపీకి ఫిర్యాదు చేసినా కేసులు నమోదు చేయలే!

## సామాన్యుడికి న్యాయం జరిగేదేలా?



సూర్యాపేట జిల్లా బ్యూరో (భారత శక్తి) నవంబర్ 18:సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలం వెలిదండ గ్రామ నివాసి పందిరి యల్లారెడ్డి భార్య పందిరి సావిత్రమ్మ కు గరిడేపల్లి మండలంలోని వెలిదండ గ్రామ రెవెన్యూ పరిధిలో సర్వే నెంబర్ 550/ ఆ 3 లో విస్తీర్ణం 20 కుంటలు మరియు 550/ఆ 8 లో 0.8 గుంటలు మొత్తం 28 గుంటల భూమి కలదు ఇట్టి భూమిపై హుజూర్నగర్ జూనియర్ సివిల్ జడ్జి న్యాయస్థానం నందు దావా దాఖలు చేయగా కోర్టు వారు శాశ్వత ఇంజక్షన్ ఆర్డర్ జారీ చేసి పోలీస్ ప్రొటక్షన్ కూడా ఇచ్చారు. రెవెన్యూ, పోలీస్, కోర్టు అధికారుల సమక్షంలో భూమిని కొలిచి హద్దులు నిర్ధారించి భూమిపైకి బెల్లంకొండ రాధాకృష్ణ, బెల్లంకొండ మోహన్ రంగా లను వెళ్ళవద్దు అని ఆదేశించినా కోర్టు ఆదేశాలను ధిక్కరించి సర్వేకు వచ్చిన సర్వే అధికారిపై కూడా దౌర్జన్యం చేశారని తమను చంపుతామని రెండుసార్లు బెదిరించినట్లుగా పేర్కొంటూ గరిడేపల్లి పోలీస్ స్టేషన్ లో 2023 జూలై 13న, డిసెంబర్ 19న ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని వాపోయారు.ఇట్టి విషయంపై 2024 జూలై 05 న డీజీపీకి ఫిర్యాదు చేయడం జరిగిందని అయినా చర్యలు తీసుకోకపోవడంతో నవంబర్ 13న, మరలా గరిడేపల్లి పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు అందజేయడం జరిగిందని తెలిపారు.ఎన్ని మార్లు పోలీస్ డిపార్ట్మెంట్ కు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడంలేదని,దౌర్జన్యం చేసన్తూ భూమిని ఆక్రమించుకోవాలని చూస్తున్న వారిపై కేసులు నమోదు చేయకుండా వారికే వంత పాడుతున్నారని సోమవారం హుజూర్ నగర్ మీడియా ముందు పందిరి యల్లారెడ్డిఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా పోలీసు అధికారులు చర్యలు తీసుకుని తనకు తన భూమికి రక్షణ కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు.

# రేషన్ కార్డులో మార్పులకు అవకాశం



హైదరాబాద్, నవంబర్ 18,

తెలంగాణ సర్కార్ రేషన్ కార్డు వివరాల మార్పు చేర్పులపై కీలక నిర్ణయం తీసుకుంది. కుటుంబ సభ్యుల్లో కొత్త వారి పేర్లు జోడించడం, మరణించిన వృద్ధుల పేర్లు తొలగించడం... మార్పులకు మీ-సేవా కేంద్రాల్లో అవకాశం కల్పించారు.తెలంగాణలో గత పదేళ్లుగా కొత్త రేషన్ కార్డులు జారీ కాలేదు. దీంతో రేషన్ కార్డుల్లో మార్పుచేర్పులకు అవకాశం లేకపోయింది. కుటుంబాల్లో వృద్ధుల మరణాలు, పెళ్లిల్లు, పిల్లలు జన్మించడం ఇలా ఎన్నో మార్పులు జరిగాయి. ఇలాంటి సందర్భాల్లో కొత్త పేర్లు చేర్చేందుకు, అవసరంలేని పేర్లు తొలగించేందుకు ఇన్నిరోజులు ఎలాంటి అవకాశం లేకపోయింది. రేషన్ కార్డుల్లో మార్పు చేర్పులకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం అవకాశం కల్పించింది.రేషన్ కార్డుదారులు తమ వివరాలు మార్చుకునేందుకు మీ-సేవా కేంద్రానికి వెళ్లాల్సి ఉంటుంది. మీ దగ్గర్లోని మీ-సేవా కేంద్రానికి వెళ్లి.. ఎవరి వివరాలు జోడించాలో, మార్పు చేయాలో వారికి సంబంధించిన గుర్తింపుకార్డులు, అవసరమైన పత్రాలు, ఫొటో తీసుకుని మీ సేవా కేంద్రానికి వెళ్లాలి. రేషన్ కార్డులో భార్య పేరును యాడ్ చేయాలనుకుంటే.. ఆమె ఫొటో, గుర్తింపు కార్డుతో పాటు మ్యారేజ్ సర్టిఫికెట్ తీసుకుని మీ-సేవా కేంద్రాన్ని సంప్రదించాలి. పిల్లల పేర్లు చేర్చాలనుకున్నా, ఆ పిల్లల గుర్తింపు కార్డులు, ఫొటోలతో పాటు బర్త్ సర్టిఫికెట్లు కావాలి. రేషన్ కార్డుల్లో మార్పుచేర్పులకు సంబంధించి...అవసరమైన పత్రాలు ఆపరేటర్లు స్కాన్ చేసి వెబ్సైట్లో అప్లోడ్ చేస్తారు. మీ-సేవా కేంద్రాల ద్వారా అప్ లోడ్ చేసిన మీ వివరాలు పౌర సరఫరాల శాఖకు చేరుతాయి. ఈ వివరాలను అధికారులు పరిశీలించి మార్పులను ఆమోదిస్తారు.

# తెలంగాణ రాష్ట్రం లో సీఎం రేవంత్ రెడ్డి ఫార్మసీ చట్టాలను కఠినంగా అమలు చేయాలి: రాష్ట్ర అధ్యక్షులు బత్తిని సుదర్శన్ గౌడ్ డిమాండ్



భారతశక్తి ప్రతినిధి, హనుమకొండ, నవంబర్ 18:63వ జాతీయ ఫార్మసీ వారోత్సవాలను భారత దేశంలో అన్ని రాష్ట్రలలో జరుపు కుంటున్నారని, అలాగే మన తెలంగాణ రాష్ట్రంలో కూడా ఫార్మసిస్ట్ లు అందరూ ఘనంగా జరుపుకోవాలని తెలంగాణ గవర్నమెంట్ ఫార్మసిస్ట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు బత్తిని సుదర్శన్ గౌడ్ పిలుపునిచ్చారు.జాతీయ ఫార్మసీ వారోత్సవాల సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు బత్తిని సుదర్శన్ గౌడ్ మాట్లాడుచూ గౌరవ ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణ రాష్ట్రంలో ఫార్మసీ ఆక్ట్ 1948సెక్షన్ 42 ని కఠినంగా అమలు చేయుటకు ఆదేశాలు ఇవ్వాలని,ఫార్మసీ చట్టాలను స్ట్రిక్ట్ గా అమలు చేసినట్లయితే ప్రజలకు మెరుగైన వెద్య సేవలు అందుతాయని అన్నారు.ఫార్మసిస్ట్ అంటే ప్రాణ రక్షకుడని, ప్రపంచములోని అభివృద్ధి చెందిన దేశాలు అన్నీ కూడా ఫార్మసిస్ట్ లకు ఎంతో గుర్తింపు నిస్తూ మంచి గౌరవ ప్రధమైన వేతనాలు ఇస్తున్నారని,మన దేశం లో ఫార్మసిస్ట్ లకు ప్రభుత్వాలు సరియైన గుర్తింపు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు.ఫార్మసిస్ట్ పేషంట్ కి వైద్యునికి వారధి లాంటి వాడని,ఏ చిన్న ఆరోగ్య సమస్య ఉత్పన్నమైనా అందరికి అందుబాటులో ఉండే ప్రదేశం ఫార్మసీ అని అక్కడ ఔషధాలతో పాటు అవసరమైన సలహాలు సూచనలు ఇచ్చి స్వస్థత చేకూర్చే ఆరోగ్య సంరక్షణ నిపుణులు ఫార్మసిస్ట్ లే అని,ఐక్యరాజ్య సమితి 2018లో కజకిస్తాన్లో జరిగిన వరల్డ్ హెల్త్ ప్రొఫెషనల్స్ అలయెన్స్ మహాసభలో సార్వత్రిక ఆరోగ్య సంసాధనకు ప్రాథమిక ఆరోగ్య సంరక్షణను బలోపేతం చేయటమే ముఖ్యమని తీర్మానించిందని అన్నారు. దీనిలో భాగంగా 2024 మే 22 న థింక్ హెల్త్ - థింక్ ఫార్మసీ అని ప్రపంచవ్యాప్త ప్రచారాన్ని చేపట్టిందని మన దేశంలో ఇండియన్ ఫార్మస్యూటికల్ అసోసియేషన్ (ఐ పి ఎ) ప్రతి ఏటా నవంబర్ మూడవ వారాన్ని జాతీయ ఫార్మసీ సప్తాహంగా పాటిస్తూ ఒక నినాదంతో ఫార్మసిస్ట్ ల ప్రాధాన్యతను ప్రజలకు మరింతగా తెలియ చేస్తున్నదని ఈ సంవత్సరం థింక్ హెల్త్ - థింక్ ఫార్మసీ అనే నినాదాన్ని ఎఫ్.ఐ.పి సమ్మతితో స్వీకరించిందని ఐపిఎ దేశంలోని 17 లక్షల ఫార్మసిస్ట్ లకు ప్రాతినిధ్యం వహిస్తున్నదని తెలిపారు.అలాగే ఫార్మసిస్ట్ లు అధ్యాపకులుగా, పరిశోధకులుగా,ఔషధ ఉత్పాదకులుగా,ఔషధ నియంత్రణ అధికారులుగా వలు రంగాలలో కృషి చేస్తున్నారని,కమ్యూనిటీ ఫార్మసిస్టు,హాస్పిటల్ ఫార్మసిస్టు ప్రజలకు ప్రత్యక్ష సేవలు అందించే వృత్తి నిపుణులుగా ఉన్నారని తెలిపారు.హాస్పిటల్ లలో మన ఫార్మసిస్ట్ లు ఔషధ వితరణ సహా బహుముఖీ సేవలు అందిస్తున్నరాని,చికిత్సలో ఔషధమే ఆయువు పట్టు కానీ ఔషధ నిపుణులైన వారికి వ్యవస్థలో అధికారుల పరంగాకాని, ప్రభుత్వ పరంగా గాని సరియైన గుర్తింపు లేదని,ఆర్గనైజేషన్ ఫర్ ఎకనామిక్ కో-ఆపరేషన్ అండ్ డెవలప్మెంట్ సంస్థ ఆరోగ్య రక్షణ వ్యవస్థలో ఫార్మసిస్ట్ ల పాత్రను మరింత విస్తృత పరచాలని సూచించిందని మన హెల్త్ ఎకనామిస్ట్ లు మాత్రం ఫార్మసిస్ట్ ల పాత్రను న్యూనతరం చేస్తున్నారని అన్నారు. డి ఫార్మ్, బి ఫార్మ్, ఫార్మ్ డి వంటి ఉన్నత చదువులు చదివిన ఫార్మసిస్టు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కోల్పోతుండగా,ప్రజల ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం పడుతుందని తెలిపారు.ప్రజలకు సరియైన రీతిలో వైద్య సేవలు అందించడానికి తెలంగాణ రాష్ట్రం లో మన ముఖ్య మంత్రి ఫార్మసిస్ట సేవలను గుర్తించి అన్ని మెడికల్ కాలేజ్ లలో,జిల్లా వైద్యశాలలలో హాస్పిటల్ అండ్ క్లినికల్ ఫార్మసీ డిపార్ట్మెంట్లలో వెంటనే నెలకొల్పాలని,వైద్య ఆరోగ్య శాఖలో ఫార్మసిస్ట్ ల విధి విధాన నిర్వహణకు సపరేట్ ఫార్మసీ డైరెక్టరేట్ ఏర్పాటు చేయాలని,ఫార్మసీ చట్టాలను అమలు చేయాలని అన్నారు.పల్లె ధవాఖానా,బస్తీ ధవాఖానాల్లో ఫార్మసిస్ట్స్ పోస్ట్స్ భర్తీ చేయాలని,ప్రతీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లో ముగ్గురు ఫార్మసిస్ట్స్ ఉండాలని,ఫార్మసిస్ట్ లకు వారి విద్యార్హతలు ఆధారంగా మంచి వేతనాలు ఇవ్వాలని, ఫార్మసిస్ట్ లకు వారి సర్వీస్ లో కనీసం నాలుగు రకాల ప్రమోషన్స్ ఇవ్వాలని తెలిపారు.ఇన్ సర్వీస్ ఫార్మసిస్ట్ లకు వారి విద్యార్హతల ఆధారంగా డ్రగ్స్ ఇన్స్పెక్టర్, డ్రగ్స్ అనలిస్ట్, డైటీషియన్ రిక్రూట్ మెంట్ లో కనీసం 30% పోస్ట్స్ ఇవ్వాలని,ప్రతీ జిల్లా లో ఫార్మసీ సూపర్ వైజర్ పోస్ట్స్ శాంక్షన్ చేయాలని, మందులు ఉన్న ప్రతీ విభాగం లో ఫార్మసిస్ట్స్ పోస్ట్స్ శాంక్షన్ చేయాలని ముఖ్య మంత్రికి విజ్ఞప్తి చేశారు.

ఇట్లు

బత్తిని సుదర్శన్ గౌడ్,

స్టేట్ ప్రెసిడెంట్,

తెలంగాణ గవర్నమెంట్ ఫార్మసిస్ట్స్ అసోసియేషన్, హైదరాబాద్.

# ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి వెంటనే చర్యలు తీసుకోవాలి : అదనపు కలెక్టర్ (రెవిన్యూ) వి.విక్టర్



(భారత శక్తి ప్రతినిధి) కామారెడ్డి, నవంబర్ 18: ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి వాటిపై చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ (రెవిన్యూ) వి.విక్టర్ అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల సమస్యలపై సమర్పించిన అర్జీలను ఆయా శాఖల అధికారులు పరిశీలించి చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ ప్రజావాణిలో (66) అర్జీలు రావడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సిఈఓ చందర్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఆర్ పి డబ్ల్యు డి చట్టం 2016 ప్రకారం రిజిస్ట్రేషన్ చేసుకోవాలి: ఇంచార్జ్ జిల్లా సంక్షేమ అధికారి ఫైజాన్ అహ్మద్



భారత శక్తి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, నవంబర్ 18: నిర్మల్ జిల్లా లో దివ్యంగుల సంక్షేమానికి నిర్వహించే ఆశ్రమాలు, పాఠశాలలు, వివిధ సంస్థలు నిర్వహించాలంటే తప్పనిసరిగా ఆర్.పి డబ్ల్యు డి - చట్టం 2016 ప్రకారము రిజిస్ట్రేషన్ చేసుకోవాలి.

ఎలాంటి అనుమతి లేకుండా నిర్వహిస్తే అట్టి సంస్థలు, ఆశ్రమాలు, పాఠశాలలు రద్దు చేయబడతాయి దివ్యాంగుల సంక్షేమ చట్టము ప్రకారం రిజిస్ట్రేషన్ కోసం నవంబర్ 25వ తారీకు 2024 లోపు నిర్మల్ జిల్లా, దివ్యాంగుల, వయోవృద్దులు మరియు ట్రాన్సెండర్ సంక్షేమ శాఖ కార్యాలయములో దరకాస్తు చేసుకోవాలని, ఈనెల 25 వ తేది తరువాత రిజిస్ట్రేషన్ చేసుకొని సంస్థలు రద్దు చేసి కఠిన చర్యలు తీసకోబడతాయని ఇంచార్జ్ జిల్లా సంక్షేమ శాఖ అధికారి ఫైజాన్ అహ్మద్ పత్రిక ప్రకటనలో తెలిపారు.మరిన్ని వివరాలకు, సందేహాలకు జిల్లా సంక్షేమ అధికారి కార్యాలయం (ఎఫ్ -17 రూమ్ నందు)కార్యాలయ పనివేళలో సంప్రదించవల్సిందిగా ఇంచార్జ్ జిల్లా సంక్షేమ అదికారి ఫైజాన్ అహ్మెద్ (ఐఎఎస్ ) స్థానిక సంస్థల అదనపు పాలన అదికారి ఫైజాన్ అహ్మద్ పత్రికా ప్రకటన ద్వారా తెలిపారు.

# మహారాష్ట్ర సార్వత్రిక ఎన్నికల సందర్భంగా వైన్ షాప్, కల్లు డిపోలు, కల్లు దుకాణాలు మూసి ఉంచాలి: జిల్లా ఎస్పీ జానకి షర్మిల.



భారత శక్తి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, నవంబర్ 18: మహారాష్ట్ర లో నవంబర్ 20, బుధవారం రోజున జరుగబోవు సార్వత్రిక ఎన్నికల సందర్భంగా మహారాష్ట్ర కు 5 కీలవమేటర్ల సరిహద్దులో గల వైన్ షాప్ , కల్లు డిపోలు, కల్లు దుకాణాలు, బార్ అండ్ రెస్టారెంట్ , తేదీ 18 నవంబర్ సాయంత్రం 6 గంటల నుండి 20 నవంబర్ బుధవారం ఎన్నికలు ముగిసే వరకు మరియు నవంబర్ 23 శనివారం రోజు పూర్తిగా ఎన్నికల ఫలితాలు తెలిపే వరకు తెరువకూడదని జిల్లా కలెక్టర్ ఆఫీసు నుండి ఉత్తర్వులు వెలువడ్డాయని జిల్లా ఎస్పీ డా. జి.జానకి షర్మిల పత్రిక ప్రకటనలో తెలిపారు.

సరిహద్దులో గల దుకాణాల వివరాలు :

బాసర లో శారద వైన్ షాప్ . కుబీర్ లో గల హల్దా, రంగా శివిని. పర్డి (బి), మర్లగొండ, బెల్గాం, పల్సి, సిర్పల్లి, నిగ్వ , సౌలీ, మహాలింగి,భామ్ని. కల్లు దుకాణాలు మరియు తానూర్ లో గల బెల్ తరోడ, బొరిగావ్, మొగిలి,తొండల, దౌలతాబాద్, జవులా, ఎల్వత్, మరియు బాసర లో గల బిద్రెల్లి , లబ్ధి కల్లు దుకాణాలు మూసి ఉంచాలని ఆదేశాలు జారీచారు.

# మట్టి అప్రోచ్ రోడ్లపై దుమ్ము లేపుతున్న భారీ వాహనాలు



భారత శక్తి ప్రతినిధి, నిర్మల్ నవంబర్ 18: జిల్లా అధికారుల నిర్లక్ష్యం, కాంట్రాక్టర్ల నిర్వాకం ప్రజలకు గుదిబండగా మారిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. మామడ మండలం బోరిగం లింగాపూర్ గ్రామాల మధ్య అటవీ జంతువులకు రోడ్డు ప్రమాదాలు జారగకుండా రోడ్డు దాటేందుకు వీలుగా అండర్ పాస్ వంతెనలు రాకేరా సంస్థ నిర్మింస్తున్న , వాటిని అనుబంధంగా అప్రోచ్ రోడ్ల నిర్మాణంలో నిర్లక్ష్యం వల్ల రాకపోకలకు వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.. అప్రోచ్ బి టి రోడ్డు నిర్మాణం చేపట్టకుండా వంతెనలను కూడా ప్రారంభించారు. దీంతో వంతెనలకు ఇరువైపులా వేసిన మట్టి అప్రోచ్ రొడ్లు భారి వాహనాల రాకపోకలతో నిత్యం రద్దీగా ఉండే పెద్ద పెద్ద గుంతలుగా ఏర్పడి ,మట్టి రోడ్డు దుమ్ముతో ఎదురువచ్చే వాహనాలు కనబడక వాహనదారులు రాకపోకలకు వాహనదారులు ఇబ్బందులు పడక తప్పడం లేదు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నత స్థాయి అధికారులు స్పందించి, వంతెనలు నిర్మించిన చోట ఇరువైపులా పటిష్టమైనబిటి అప్రోచ్ రోడ్డు నిర్మాణాలు చేపట్టి రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

# నిర్మల్ జిల్లాలో తరుచూ ఏసీబీ దాడులు.. అయినా మారని అధికారుల తీరు,అవినీతి కంపు.







భారత శక్తి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో షేక్ అహ్మద్, నవంబర్ 18: నిర్మల్ జిల్లా లో ప్రభుత్వ ఉద్యోగులు కొందరు లంచాలకు తెగబడుతున్నారు. నెలనెల వేతనాలు వస్తున్నా.. పేదలను పట్టి పీడిస్తున్నారు. నిర్మల్ జిల్లాలో ఏడాదిలో ముగ్గురు అధికారులు ఏసీబీకి చిక్కారు. ముఖ్యంగా మున్సిపల్, రెవెన్యూ శాఖ కార్యాలయాల్లో లంచాలు సర్వ సాధారణం అయిపోయాయి. దీంతో బాధితులు ఏసీబీని ఆశ్రయిస్తున్నారు.

ఏసీబీకి చిక్కిన మున్సిపల్ ఉద్యోగి

నిర్మల్ మున్సిపాలిటీలో ఇంఛార్జ్ ఆర్ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న షాకీర్ ఖాన్.. రూ.15 వేల లంచం తీసుకుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. మున్సిపల్ కార్యాలయంలో బిల్ కలెక్టర్గా పనిచేస్తున్న చందుల భరత్.. ఏసీబీ అధికారులను ఆశ్రయించి పట్టించాడు. భరత్ చెప్పిన వివరాలు ప్రకారం.. రెండు నెలలుగా తన ఉద్యోగం రెగ్యులర్ చేయడం కోసం డబ్బులు ఇవ్వాలని వేధిస్తున్నాడని ఆరోపించారు. మొదట రూ.20 వేలు డిమాండ్ చేయగా.. రూ.15 వేలు ఇచ్చేందుకు అంగీకరించామని చెప్పారు.

ఏడాదిలోపే రెండు సార్లు..

కొన్ని నెలల కిందట మున్సిపాలిటీలో బిల్ కలెక్టర్గా పని చేస్తున్న వ్యక్తి ఏసీబీకి చిక్కాడు. మళ్లీ తాజాగా అదే శాఖలో షాకీర్ ఖాన్ రూ.15 వేల లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు చిక్కారు. ఇటీవల నిర్మల్ జిల్లాలోని పలు శాఖల్లో పనిచేసే అధికారులు లంచావతారం ఎత్తుతున్నారు. అయితే.. కొందరు చేసే అవినీతి కారణంగా అందరికీ చెడ్డపేరు వస్తుందని.. తోటి ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఈ 3 శాఖల్లో..

నిర్మల్ జిల్లాలో ముఖ్యంగా మున్సిపాలిటీల్లో అవినీతి తిమింగలాలు ఎక్కువగా ఉన్నాయి. తోటి ఉద్యోగులను సైతం లంచం కోసం వేధించిన ఘటనలు ఉన్నాయి. రెవెన్యూ, రిజిస్ట్రేషన్, మున్సిపల్ శాఖల్లో లంచగొండి అధికారులకు కొదవే లేదు. ఈ మూడు శాఖల పేరు చెబితేనే ప్రజలు వణికిపోయే పరిస్థితి వచ్చింది.

ఖానాపూర్ తహసీల్దార్..

ఖానాపూర్ తహసీల్దార్ నరేందర్పై అవినీతికి ఆరోపణలు వచ్చాయి. తన వారసత్వ భూమిని మార్చుకోవడానికి వస్తే.. ఎమ్మార్వో లంచం అడుగుతున్నారని రైతు ఆవేదన వ్యక్తం చేశారు. ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేశారు. 30 జులై 2021లో ఏసీబీ అధికారులు ఆ తహసీల్దారును పట్టుకున్నారు.

కడెం తహసీల్దార్ ఆఫీసులో..

కొత్త మద్దిపడగ గ్రామానికి చెందిన రైతు తన భూమిని పట్టా భూమిగా మార్చుకునేందుకు రెవెన్యూ అధికారులను ఆశ్రయించాడు. అయితే.. అందుకు రూ.15 వేలు లంచం అడిగారు. డీటీ చిన్నయ్య ద్వారా తహసీల్దార్ రాజేశ్వరి డబ్బులు డిమాండ్ చేశారు. దీంతో రైతు ఏసీబీని ఆశ్రయించారు.

ఎమ్మార్వో, డీటీ ఇద్దరు ఏసీబీకి చిక్కారు. ఈ వ్యవహారం కడెం మండలంలో సంచలనంగా మారింది. తరచూ ఏసీబీకి చిక్కుతున్నా.. అధికారుల్లో మార్పు రావడం లేదు.

# పేదలు,కష్ట జీవులు, కార్మికుల పార్టీ సిపిఐ

## -త్యాగాలతో నిర్మితమైన సిపిఐకి ఎదురు లేదు

## -ప్రజాబలంతోనే వందేళ్లు మనగలిగాం

## -వాడవాడలా సిపిఐ వందేళ్ల ఉత్సవాలు జరపాలి

## -సిపిఐ నేతలు జమ్మల జితేందర్ రెడ్డి,బెజవాడ రవిబాబు

ఖమ్మం ప్రతినిది (భారత శక్తి ), నవంబర్ 18: పేద ప్రజలు, కష్టజీవులు,కర్షకులు, కార్మికుల పార్టీ సిపిఐ అని, సుదీర్ఘ పోరాటాలు, త్యాగాలతో నిర్మితమైన ఎర్ర జెండా పార్టీకి ఎదురులేదని, మరో వందేళ్లైనా చెక్కు చెదరకుండా అజేయంగా నిలుస్తుందని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు జమ్ముల జితేందర్ రెడ్డి,సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బెజవాడ రవి బాబు పునరుద్ఘాటించారు.సోమవారం మున్సిపాలిటీ పరిధి మడుపల్లి సిపిఐ కార్యాలయం అజయ్ భవనం వద్ద పార్టీ కౌన్సిల్ సమావేశం సిపిఐ మండల కార్యదర్శి ఊట్ల కొండలరావు అధ్యక్షతన జరిగింది.ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా హాజరైన జమ్ముల జితేందర్ రెడ్డి,బెజవాడ రవిబాబు మాట్లాడారు.సిపిఐది వందేళ్ల చరిత్ర అని మరో వందేళ్లైనా చెక్కు చెదరకుండా ప్రజాక్షేత్రంలో మనగలుగుతామన్నారు.



ఈ ఏడాది డిసెంబర్ 26నాటికి సిపిఐ వందేళ్ల వసంతాలు పూర్తి చేసుకుంటున్న తరుణంలో ఉత్సవాలని వాడవాడలా ఘనంగా నిర్వహించాలని, పార్టీ చరిత్రను,త్యాగాలను ప్రజలకు వివరించడంతోపాటు అమరులకు ఘన నివాళులర్పించాలని సూచించారు.అలాగే పార్టీ సభ్యత్వ సేకరణను వేగవంతంగా పూర్తి చేసి పార్టీ వంద వసంతాల ఉత్సవాలకు సిద్ధం కావాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.ఈ కౌన్సిల్ సమావేశం హాజరైన సభ్యుల్లో 40 మంది పార్టీ సభ్యత్వాన్ని తీసుకున్నారు.ఈ కార్యక్రమంలో ఏఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు మడుపల్లి లక్ష్మణ్,సిపిఐ నాయకులు రహీం,సిపిఐ జిల్లా సమితి సభ్యులు పెరుమాళ్ళపల్లి ప్రకాశరావు,రైతు సంఘం మండల అధ్యక్షులు వంగ శేషగిరిరావు,సిపిఐ మడపల్లి గ్రామ శాఖ కార్యదర్శి శిలువేరు శ్రీనివాసరావు,సిపిఐ మండల నాయకులు అన్నవరపు సత్యనారాయణ,రంగు నాగ కృష్ణ,పున్నవెల్లి అప్పారావు,జల్ల బ్రహ్మం, ఎస్ కే కొండ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ వికేంద్రీకరణ: జిల్లా కలెక్టర్ డా.శ్రీధర్ చెరుకూరి

కడప, నవంబర్ 18(భారత శక్తి ) : ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి వాటిని పరిష్కరించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ ను మండల, మున్సిపల్ స్థాయిలో కూడా నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డా.శ్రీధర్ చెరుకూరి ఒక ప్రకటనలో తెలిపారు."ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ " అర్జీల స్వీకరణ కార్యక్రమాన్ని జిల్లా కేంద్రంతో పాటు మండల, మున్సిపల్ స్థాయిలో కూడా నిర్వహిస్తామని కలెక్టర్ అన్నారు.అర్జీదారులు ఈ విషయాన్ని గమనించి తమ ఫిర్యాదులను సమీపంలోని మండల కార్యాలయాలు లేదా మున్సిపల్ కార్యాలయాలలో సమర్పించుకోవచ్చునన్నారు. ప్రజలకి పాలనను మరింత చేరువ చేయడానికి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను మండల, మున్సిపల్ స్థాయిలకు ప్రభుత్వం వికేంద్రీకరించినట్లు ఆయన తెలిపారు.ప్రజలు ఈ విషయాన్ని గుర్తించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ డా.శ్రీధర్ చెరుకూరి విజ్ఞప్తి చేశారు.

# అంగరంగ వైభవంగా గంధోత్సవం పెద్ద దర్గాలో గంధాన్ని సమర్పించిన పీఠాధిపతి



వైయస్సార్ జిల్లా, నవంబర్ 18(భారత శక్తి ): దేశంలోనే ప్రసిద్ధ సూఫీ ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రమైన కడప , అమీన్‌పీర్ పెద్దుదర్గాలో వెలసిన హజరత్ సూఫీ సరమస్తసాని చల్లాకష్ ఖ్వాజా సయ్యద్‌షా ఆరీఫుల్లా మొహమ్మద్ మహమ్మదుల్ హుసేనీ చిస్తివుల్ ఖాద్రి ఉరుసు అంగరంగ వైభవంగా మొదలయ్యాయి. అమీన్ పీర్ దర్గా ఉరుసు మహోత్సవం పెద్ద దర్గాలో సూఫీ సర్ మస్త్ సాని చిల్లా కష్ ఆరిఫుల్లా మహమ్మద్ మొహమ్మద్ ఉల్ చిష్తి ఉల్ ఖాదరి వారి గంధ మహోత్సవం వైభవంగా జరిగింది.ఉరుసు లో మొదటి రోజు లో భాగంగా ఉదయం 10 గంటలకు ఫకీర్లు మేళ తాళాలతో దర్గా నుండి బయలుదేరి బాదుల్లా ఖాన్ మకాన్ చేరుకొని అక్కడ ఫతేహ సమర్పించి అన్న ప్రసాదం పంపిణీ జరిగింది. అనంతరం సాయంత్రం మూడు గంటలకు తిరిగి దర్గాకు చేరుకున్నారు. దర్గా పీఠాధిపతి ఆరిఫుల్లా హుస్సేనీ గారు మలాంగ్ షా మూడు రోజుల దీక్ష కొరకు గద్ది నషీన్ పై కూర్చోబెట్టినారు. మూడు రోజులు నిద్రాహారాలు మాని తప్పొ బంగిమలు ఉంటూ ఈ దర్గా పూర్వపు గురువుల సూఫీ యోగ తత్వాన్ని ప్రదర్శించారు. రాత్రి 9 గంటలకు గంధ మహోత్సవం ప్రారంభమైంది.

పీఠాధిపతి స్వగృహం నుండి గంధకలశం తీసుకొని వచ్చి స్వామివారి మజార్ మీద సమర్పించి ఫతేహ సమర్పించారు. రాత్రి 10 గంటలకు ప్రముఖ ఖవ్వాలి అస్లాం అక్రమ్ సబ్రి చే గొప్ప ఖవ్వాలి కార్యక్రమం నిర్వహించడం జరిగింది.ప్రముఖ సంగీత విద్వాంసుడు ఏఆర్ రెహమాన్ పెద్ద దర్గా ఉరుసు గంధ మహోత్సవంలో పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో కడప ఎమ్మెల్యే మాధవి రెడ్డి,టిడిపి జిల్లా అధ్యక్షులు శ్రీనివాసుల రెడ్డి,కడప 6వ అడిషనల్ జడ్జి ఇంతియాజ్ , మైదుకూరు జడ్జ్ ఇస్మాయిల్, సీఎం ఆఫీస్ చీఫ్ మినిస్టర్ అధికారి ఠాగూర్ డిగ్, స్థానిక నాయకులు గోవర్ధన్ రెడ్డి హరి ప్రసాద్ రెడ్డి, , ఫకీర్లు ఇతర దర్గాల పీఠాధిపతులు,ఇతర రాష్ట్రాల నుండి వచ్చిన భక్తాదులు పాల్గొన్నారు.

# సోలార్ పవర్ ప్లాంట్ సందర్శించిన ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు.

మందమర్రి, భారత శక్తి ప్రతినిధి, నవంబర్ 18:మందమర్రి పట్టణంలోని పాలచెట్టు సమీపంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు నో బ్యాగ్ డే సందర్భంగా స్థానిక సోలార్ పవర్ ప్లాంట్ ను గైడ్ టీచర్ భీమ్ పుత్ర శ్రీనివాస్ నేతృత్వంలో సందర్శించారు. ఈసందర్భంగా పవర్ ప్లాంట్ డిప్యూటీ సూపరింటెండెంట్ ఇంజనీర్ ఆర్ రాజేష్ విద్యార్థులకు ప్రత్యామ్నాయ ఇంధన వనరులైన సౌర విద్యుత్ ఉత్పత్తి విధానం, పర్యావరణ హితమైన విద్యుత్ ఉత్పత్తి చేసే విధానాన్ని వివరించారు.



ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు మాట్లాడుతూ, భవిష్యత్తులో కాలుష్యం లేకుండా తరుగులేని శక్తిగా సౌరశక్తి ఉపయోగంలోకి వస్తుందని, భవిష్యత్ పౌరులుగా ప్రకృతి వనరుల పట్ల అవగాహన పొందాల్సిన అవసరం ప్రతీ విద్యార్థుల బాధ్యతని తెలిపారు. గైడ్ టీచర్ భీమ్ పుత్ర శ్రీనివాస్ మాట్లాడుతూ తరగతి నాలుగు గోడలే కాదు అని ప్రకృతి నుండి అపారజ్ఞానం పొందవచ్చునని, అందుకోసమే ప్రత్యక్ష పద్ధతిలో పాఠ్యాంశాల ద్వారానే నిజమైన జ్ఞానాన్ని పొందవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసా చారి ఉపాధ్యాయులు రవి, ఉమ, ఇన్నారెడ్డి లు పాల్గొన్నారు.

# బాసర ఆర్జీయూకేటీ అధ్యాపకుడికి వైస్ ఛాన్సలర్ అభినందన




భారత శక్తి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, నవంబర్ 18: ఆర్జీయూకేటీ బాసరలో కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ శాఖలో అధ్యాపకునిగా విధులు నిర్వర్తిస్తున్న అధ్యాపకుడు డాక్టర్ వెంకట్ రామన్ కి డాక్టరేట్ అవార్డును ఉస్మానియా విశ్వవిద్యాలయం ప్రదానం చేసింది. ఈ సందర్భంగా ఆర్జీయూకేటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ గోవర్ధన్, డాక్టరేట్ అవార్డు పొందిన అధ్యాపకుడు డాక్టర్. వెంకట్ రామన్ కి అభినందనలు తెలియజేశారు. ఈ విశ్వవిద్యాలయంలో ఇప్పటికే చాలామంది డాక్టరేట్ అవార్డులు పొంది ఉన్నారని అందులో మరొక అధ్యాపకుడు పీహెచ్డీ అవార్డు పొందడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. దీంతో పరిశోధన రంగంలోనూ నాణ్యమైన విద్యను అందించడంలోనూ వీరి పాత్ర ఎంతో కీలకమని కొనియాడారు. డాక్టర్. బి వెంకట్ రామన్ " క్వాంటం కంప్యూటింగ్ ఫర్ కలర్ ఇమేజ్ క్లాసిఫికేషన్ ." అనే అంశంపై ఉస్మానియా విశ్వవిద్యాలయం కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ విభాగం ప్రొఫెసర్ నాగరత్న పర్యవేక్షణలో పరిశోధన పూర్తిచేశారు. వీరు జాతీయ, అంతర్జాతీయ సదస్సుల్లో పలు పరిశోధనా పత్రాలను ప్రచురించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ పని మరియు పరిశోధన రంగాలలో అత్యాధునిక సాంకేతికతలతో ప్రపంచాన్ని నడిపిస్తోంది. క్వాంటం కంప్యూటింగ్ అనేది కంప్యూటింగ్ ప్రపంచంలో భవిష్యత్తును మార్చే రంగాలలో ఒకటి. క్వాంటం కంప్యూటర్‌ని ఉపయోగించి అత్యుత్తమ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెంట్ అప్లికేషన్‌లను తీసుకురావడం పరిశోధన లక్ష్యం. ఈ సందర్భంగా అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ రణధీర్ సాగి, కంప్యూటర్ సైన్స్ డిపార్ట్మెంట్ అధ్యాపకులు రంజిత్ కుమార్, సహ అధ్యాపకులు, విద్యార్థులు అభినందనలు తెలిపారు.

# ప్రశాంతంగా ముగిసిన గ్రూప్-3 పరీక్షలు పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

భారత శక్తి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, నవంబర్ 18: రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా నిర్వహించిన గ్రూప్-3 పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ బాలుర కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్షలు నిర్వహిస్తున్న తీరును నిశితంగా పరిశీలించారు. నిబంధనలు పక్కాగా పాటిస్తున్నారా లేదా అన్నది పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. కాగా, కట్టుదిట్టమైన ఏర్పాట్ల నడుమ సాఫీగా పరీక్షలు నిర్వహించడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. సోమవారం జరిగిన పరీక్షకు జిల్లాలో మొత్తం 8124 మంది అభ్యర్థులకు గాను, 4,665 మంది హాజరు కాగా, 3,459 మంది గైర్హాజరు అయ్యారని వివరించారు. సగటున 57.42 శాతం హాజరు నమోదయ్యిందని తెలిపారు. ఈ పరిశీలనలో రీజినల్ కోఆర్డినేటర్ పిజి రెడ్డి, డిపార్ట్మెంట్ అధికారి శ్రీకాంత్ రెడ్డి, పట్టణ తహసిల్దార్ రాజు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా గ్రంధాలయ కవితా దినోత్సవం



శ్రీకాకుళం, భారత శక్తి ప్రతినిధి, నవంబర్ 18:జాతీయ గ్రంధాలయ వారోత్సవాల్లో భాగంగా శ్రీకాకుళం కేంద్ర గ్రంధాలయంలో కవితాదినోత్సవం ఘనంగా జరిగింది.ఈ కార్యక్రమానికి సాహితీవేత్త స్థానిక శాంతినికేతన్ డైరెక్టర్ సురంగి. మోహనరావు ముఖ్య అతిధిగా పాలోన్నారు. కార్యక్రమానికి గ్రంధాలయసంస్థ కార్యదర్శి ప్రముఖకవి బుర్రి. కుమార్ రాజు అధ్యక్షత వహించారు. ప్రతి విద్యార్థి సెల్ (చరవాణి)కి స్వస్తి పలికి గ్రంధాలయాలకు రావాలని విజ్ఞానాన్ని పొంది మంచి ఉన్నతిలో వుండాలని ఆకాంక్షించారు. ముఖ్య అతిధిగా పాల్గొన్న సురంగి. మోహనరావు ప్రసంగిస్తూ... గ్రంధాలయాలకు యువత వచ్చే విధంగా రచయితలు /కవులు రచనలు చేయాలన్నారు.ఈ సభకు కేంద్ర గ్రంధాలయ డిప్యూటీ లైబ్రరియన్ శంకరరావు కవులందరికిసమాజానికి ఉపయోగపడే మంచి రచనలు అందించాలన్నారు.నేడు కవితా దినోత్సవం కవిసమ్మేళం వేమన కవితామయం అధ్యక్షులు ప్రసిద్ధ కవి మహ్మద్ రఫీ (ఈవేమన ) నిర్వహణ చేశారు. సుమారు 20మంది లబ్ద ప్రతిష్ట కవులు పాల్గొన్నారు.సీనియర్ కవి గుడిమెట్ల. గోపాలకృష్ణ హాస్యం-వ్యంగ్యం తో కూడిన మినీ కవితలతో అలరిస్తే...ప్రముఖ కవి కె. వి. రాజారావు సందేశాత్మక కవిత, వావిలపల్లి. రాజారావు, ఉమాకవి, కె. శ్రీనివాసరావుసంతోష్,ఐ ఎన్. డి. ప్రసాదరావు,చోడవరపు. ఈశ్వర్ కవితలు ఆలోచింపజేసాయి. ఉప్పు. త్రినాదరావు, మజ్జి మోహనరావు గ్రంధాలయం పై పాడిన గేయాలు అద్భుతం. వాడాడ. శ్రీనివాసరావు పద్యకవిత చాలాబావుంది. ప్రముఖ సీనియర్ జర్నలిస్ట్ జంధ్యాల. శరత్ బాబు గేయం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అనంతరం కవులు అందరకూ శాలువలతో సత్కరించారు.

# పోలీస్ అధికారులతో ముందస్తు జాతీయ లోక్ అదాలత్ మీటింగ్

భారత శక్తి ప్రతినిధి, కడప, నవంబర్ 18: గౌరవ శ్రీమతి జి.శ్రీదేవి, చైర్మన్ కం జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కడప మరియు శ్రీ ఎస్.బాబా ఫక్రుద్దీన్, సెక్రటరీ-మరియు-సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కడప, జిల్లా ప్రధాన న్యాయమూర్తి చాంబర్ నందు పోలీస్ అధికారులతో ముందస్తు జాతీయ లోక్ అదాలత్ మీటింగ్ నిర్వహించారు . ఈ సందర్భంగా మాట్లాడుతూ డిసెంబర్ 14 వ తేదీన జరగబోయే జాతీయ లోక్ అదాలత్ లో ఎక్కువ సంఖ్యలో కేసులు రాజీ అయ్యేవిధంగా కృషి చేయాలని అన్నారు. ఈ



కార్యక్రమంలో పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

# కృషి, పట్టుదల, క్రమశిక్షణ ఉంటే జీవితంలో ఏదైనా సాధించవచ్చు: చైతన్య పాఠశాల కరెస్పాండంట్ మేరెడ్డి యల్లారెడ్డి



సూర్యాపేట జిల్లా బ్యూరో (భారత శక్తి) నవంబర్ 18:సూర్యాపేట జిల్లా హుజూర్ నగర్ పట్టణ కేంద్రం లోని చైతన్య పాఠశాలలో బాలల దినోత్సవం సందర్భంగా స్వయం పరిపాలన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో విద్యార్థిని విద్యార్థులందరూ ఉత్సాహంగా పాల్గొని కలెక్టర్, డిఈవో, ఎంఈవో తదితర వేశాధారణలతో అలరించారు. ఈ సందర్భంగా చైతన్య పాఠశాల కరెస్పాండంట్ మేరెడ్డి యల్లారెడ్డి విద్యార్థిని, విద్యార్థులు అభినందనలు తెలిపారు.

విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు ఇలాంటివి ఉపకరిస్తాయన్నారు. కృషి, పట్టుదల, క్రమశిక్షణ ఉంటే జీవితంలో సాధించలేనిది ఏది ఉండదని చిన్ననాటి నుండి లక్ష్యాలను ఎంపిక చేసుకొని వాటి సాధన కొరకు నిరంతరం కృషి చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో సారెడ్డి ప్రతాప్ రెడ్డి, ఉపాధ్యాయులు శరత్, ఆనంద్ హుసేన్ మియా, మనోహర్,శ్రావణి,రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

# ఇన్నర్ రింగ్ రోడ్డు పనులు తిరిగి ఉత్తమ్ పాలనలోనే పూర్తి

సూర్యాపేట జిల్లా బ్యూరో (భారత శక్తి) నవంబర్ 18:హుజూర్ నగర్ మున్సిపాలిటీ పుర ప్రముఖులు నుతన బైపాస్ రోడ్డు పనులను పరిశీలించి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర నీటిపారుదల శాఖ మరియు పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి హుజూర్ నగర్ పట్టణంలో 2013 సంవత్సరంలో మొదలు పెట్టిన ఇన్నర్ రింగ్ రోడ్డు పనులు తిరిగి ఉత్తమ్ పాలనలోనే పూర్తవుతున్నందుకు ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మిర్యాలగూడ రోడ్డు నుండి మట్టపల్లి, మేళ్లచెరువు వెళ్లే భారీ వాహనాలు కి ఇన్నర్ రింగ్ రోడ్డు అందుబాటులోకి రావడంతో హుజూర్ నగర్ పట్టణ ట్రాఫిక్ సమస్య తీరినట్లేనని అన్నారు ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్, వైస్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# కంది పంటను సందర్శించిన కృషి విజ్ఞాన కేంద్రం రంగారెడ్డి శాస్త్రవేత్తలు



(భారత శక్తి ప్రతినిధి) యాదాద్రి, నవంబర్ 18: క్షేత్రస్థాయి కంది సందర్శనలో భాగంగా మోత్కూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఆరెగూడెం గ్రామంలో టి.డి.ఆర్.జి 59 కంది పంటను సాగుచేసిన బిల్లపాటి గోవర్ధన్ రెడ్డి, కొనతం మహేందర్ రెడ్డి వ్యవసాయ క్షేత్రంలో కృషి విజ్ఞాన కేంద్రము - రంగారెడ్డి జిల్లా కేంద్రీయ మెట్ట వ్యవసాయ పరిశోధనా సంస్థ శాస్త్రవేత్తలు పి. రామకృష్ణ , డా. గౌతం వి చౌహాన్ సందర్శించి కంది సాగు , సస్యరక్షణ పద్ధతులు, వివరించి తగిన సూచనలు చేశారు

# దివ్యాంగుల సమస్యలను పరిష్కరించాలని స్థానిక సంస్థల ఆదనపు కలెక్టర్, జిల్లా సంక్షేమ అధికారి ఫైజాన్ అహ్మద్ కు వినతి పత్రం అందజేత



భారత శక్తి ఉమ్మడి హైదరాబాద్ జిల్లా బ్యూరో, నవంబర్ 18: సోమవారం కలెక్టర్ కార్యాలయంలోని చాంబర్లో వినతి పత్రాన్ని అందించిన దివ్యాంగుల జాయింట్ యాక్షన్ కమిటీ సభ్యులు. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో అదనపు కలెక్టర్ ను సన్మానించిన కమిటీ సభ్యులు రాష్ట్ర కన్వీనర్ సత్తి సాయన్న, కో కన్వీనర్ కే ప్రవీణ్ కుమార్, ప్రధాన కార్యదర్శి ముత్యం, సెక్రటరీ కే భగవాన్, సత్యనారాయణ, నరసయ్య, లక్ష్మీనారాయణ, శ్రీనివాసులు, తదితరులు వున్నారు.

# ఆస్ట్రేలియా గడ్డపై కోహ్లీకిదే చివరి సిరీస్.. గంగూలీ కీలక వ్యాఖ్యలు



స్వదేశంలో జరిగిన టెస్టు సిరీస్‌ల్లో పేలవ ప్రదర్శనతో టీమ్‌ఇండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్న విషయం తెలిసిందే. ఈనేపథ్యంలో అతడికి మాజీ కెప్టెన్ సౌరబ్ గంగూలీ మద్దతుగా నిలిచాడు. త్వరలో ప్రారంభం కానున్న ప్రతిష్ఠాత్మక బోర్డర్–గావస్కర్ ట్రోఫీ అతడికి చక్కటి అవకాశమని.. అతడు తిరిగి ఫామ్‌లోకి వస్తాడని ఆశాభావం వ్యక్తంచేశాడు.

కోహ్లీ ఈ ఏడాదిలో ఆడిన 12 టెస్టు ఇన్నింగ్స్‌ల్లో మొత్తం 250 పరుగులు మాత్రమే చేశాడు. జట్టు కష్టకాలంలో ఉన్నప్పుడు ఔట్ అవుతూ.. నిరాశపరుస్తున్నాడు. అయితే.. ఆస్ట్రేలియాలో ఈ పరుగుల రారాజు రికార్డులు మాత్రం బాగానే ఉన్నాయి. 13 టెస్టుల్లో 54.08 సరాసరితో మొత్తం 1,352 పరుగులు చేశాడు. ఇందులో ఆరు శతకాలు ఉండటం విశేషం. ఈ గణాంకాలనే చూపుతూ కోహ్లీకి ఆస్ట్రేలియా గడ్డపై ఇది గొప్ప సిరీస్ అవుతుందని గంగూలీ పేర్కొన్నాడు. అతడి కెరీర్‌లో ఆసీస్ గడ్డపై ఆడే చివరి టెస్టు సిరీస్ కూడా ఇదే అయ్యే అవకాశం ఉందని అభిప్రాయపడ్డారు.

"కచ్చితంగా విరాట్ ఒక ఛాంపియన్ బ్యాటర్. గతంలో అతడు ఆస్ట్రేలియా గడ్డపై విజయాలు సాధించాడు. 2014లో నాలుగు సెంచరీలు నమోదు చేశాడు. 2018లో ఒక శతకం బాదాడు. ఈ సిరీస్‌ను అతడు తీవ్రంగా తీసుకుంటాడు. టెస్టు క్రికెట్ కోసం ఆస్ట్రేలియాలో పర్యటించడం కెరీర్‌లో ఇదే చివరిసారని కూడా అతడికి తెలుసు. కాబట్టి.. ఏ కోణంలో చూసినా.. ఈ సిరీస్ అతడికి ఎంతో ప్రతిష్ఠాత్మకం అవుతుంది" అని దాదా ఓ క్రీడా ఛానల్‌తో మాట్లాడుతూ విశ్లేషించాడు.

రోహిత్ – బుమ్రా నాయకత్వంలో ఓడితే.. కోహ్లీకి సారథ్యం ఇవ్వమంటారు: హర్భజన్

ఇక ఇటీవల కోహ్లీ న్యూజిలాండ్ సిరీస్‌లో దారుణంగా విఫలమయ్యాడు. స్పిన్నర్లను ఎదుర్కోవడంలో ఇబ్బందిపడుతున్నాడు. ఈ విషయంపైనా గంగూలీ స్పందిస్తూ.. అతడి ఫామ్‌పై ఎలాంటి ఆందోళన లేదన్నాడు. ఆ పిచ్‌లు బ్యాటింగ్‌కు అనుకూలించలేదని.. ఆస్ట్రేలియాలోని పరిస్థితులు వేరని వివరించాడు. 'న్యూజిలాండ్‌తో సిరీస్‌లో కోహ్లీ ఫామ్ గురించి లోతుల్లోకి వెళ్లాల్సిన పని లేదు. బ్యాటింగ్‌కు ఆ పిచ్‌లు పెద్దగా సహకరించలేదు. అయితే ఆసీస్‌లోని పరిస్థితులను మాత్రం కోహ్లీ బాగా ఎంజాయ్ చేస్తాడు. అక్కడ మంచి పిచ్‌లు ఉంటాయి. అక్కడ అతడు గొప్ప ప్రదర్శన చేస్తాడని నేను నమ్ముతున్నాను" అని గంగూలీ తెలిపాడు.

సర్ఫరాజ్ ఖాన్‌ను కూడా గంగూలీని వెనకేసుకొచ్చాడు. న్యూజిలాండ్‌తో తొలి టెస్టులో 150 పరుగులు చేసిన అతడు.. చివరి రెండు మ్యాచ్‌ల్లో విఫలమయ్యాడు. అయితే.. అతడికి బోర్డర్ గావస్కర్ ట్రోఫీలో అవకాశం ఇవ్వాలని కోరాడు.

# బుమ్రా 18 ఓవర్లు.. విరాట్ రెండుసార్లు బ్యాటింగ్.. వార్మప్ మ్యాచ్ వీడియో

ఆస్ట్రేలియా పర్యటనకు (వచ్చిన భారత్ జట్టు నెట్ ప్రాక్టీస్ తర్వాత.. ఇంట్రాస్క్వాడ్ వార్మప్ మ్యాచ్ ఆడింది. పెర్త్ పిచ్‌కు తగ్గట్టుగా ఉండే వాకా స్టేడియం వేదికగా జరిగింది. మూడు రోజులపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో భారత బ్యాటర్లు, బౌలర్లకు గొప్ప సాధనే లభించింది. మూడోరోజు వార్మప్‌నకు సంబంధించి వీడియోను బీసీసీఐ తన సోషల్ మీడియా ఖాతాల్లో పోస్టు చేసింది. పెర్త్ వేదికగా ఆస్ట్రేలియాతో నవంబర్ 22 నుంచే తొలి టెస్టు ప్రారంభం కానున్న సంగతి తెలిసిందే.



శుభ్‌మన్ గిల్ ( గాయం కారణంగా మూడోరోజు వార్మప్ మ్యాచ్ బరిలోకి దిగలేదు. విరాట్ కోహ్లీ, రిషభ్ పంత్, కేఎల్ రాహుల్, సర్ఫరాజ్ ఖాన్ తదితరులు బౌన్సీపిచ్‌పై బంతిని ఎదుర్కొనేందుకు కాస్త ఇబ్బంది పడ్డారు. వీరందరితో పోలిస్తే రుతురాజ్ గైక్వాడ్ నాణ్యమైన ఆటతీరు ప్రదర్శించాడు. తొలుత విరాటపరుగులకే ఔట్ కాగా.. మళ్లీ రెండోసారి బ్యాటింగ్‌కు దిగి 30 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. జస్‌ప్రీత్ బుమ్రా 18 ఓవర్లు బౌలింగ్ చేశాడు. అతడితోపాటు మరో ఇద్దరు కూడా అదేస్థాయిలో బంతులేసినట్లు సహాయక కోచింగ్ సిబ్బంది వెల్లడించింది. రెండో రోజుతో పోలిస్తే మూడో రోజు బౌలర్లు మరిన్ని ఓవర్లు వేసినట్లు అసిస్టెంట్ కోచ్ అభిషేక్ నాయర్ తెలిపాడు.

"ప్రతిఒక్కరికీ అవకాశం వచ్చేలా ప్రయత్నించాం. ఒకసారి ఔటైనప్పటికీ మళ్లీ మైదానంలోకి దిగేలా రూల్స్‌ను మార్చుకున్నాం. పిచ్ పరిస్థితులను అర్థం చేసుకొనేందుకు ఇదొక ఛాన్స్. బౌన్సీ పిచ్‌కు అలవాటుపడేందుకు అవకాశం. ఆస్ట్రేలియా పర్యటనకు రాకముందే నెట్ ప్రాక్టీస్, వార్మప్ మ్యాచ్‌ల గురించి ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్, కెప్టెన్ రోహిత్ శర్మ చర్చించారు. మూడు రోజుల వార్మప్ ఉండాలనుకున్నాం. సీనియర్లతోపాటు యువకులకు పిచ్‌ను అంచనా వేయడానికి అవకాశం దక్కింది. నాలుగేళ్ల తర్వాత ఇక్కడికి వచ్చి టెస్టు ఆడబోతున్నాం" అని అభిషేక్ నాయర్ వెల్లడించాడు.

సిరాజ్ మనసు గొప్పది: మోర్నీ

భారత జట్టు ప్రణాళికల గురించి బౌలింగ్ కోచ్ మోర్నీ మోర్కెల్ వివరిస్తూ ఉండగా.. బ్యాటింగ్ ప్రాక్టీస్ కోసం వచ్చిన సిరాజ్ వెనకుండి మోర్నీని అనుకరిస్తూ ఉన్నాడు. అప్పుడే చూసిన మోర్నీ.. సిరాజ్‌పై ప్రశంసల వర్షం కురిపించాడు. లెజెండ్‌గా అభివర్ణిస్తూ మంచి మనసు కలిగిన క్రికెటర్ అంటూ కొనియాడాడు. "సిరాజ్ గొప్ప క్రికెటర్. మంచి మనసు కలిగిన వ్యక్తి. దూకుడుగా ఉండే ప్లేయర్. ఈ సిరీస్‌లో అతడి ఎటాకింగ్‌ను చూసేందుకు ఆసక్తిగా ఉన్నా. గత సిరీస్‌లో క్లిష్టమైన పరిస్థితుల్లో అదరగొట్టాడు. ఇప్పుడు సీనియర్‌గా అతడి పాత్ర అత్యంత కీలకం. ఆల్ ది బెస్ట్ సిరాజ్" అంటూ మోర్నీ వ్యాఖ్యానించాడు.

# ఆసీస్‌తో ఐదు టెస్టులు.. కోహ్లీకి కాస్త అదృష్టం కలిసి వస్తే : సునీల్ గావస్కర్



ఆస్ట్రేలియా, భారత్ ) మధ్య నవంబర్ 22 నుంచి బోర్డర్ – గావస్కర్ ట్రోఫీ ప్రారంభంకానుంది. టీమ్‌ఇండియా ఇతర జట్ల ఫలితాలతో సంబంధం లేకుండా నేరుగా ప్రపంచ టెస్టు ఛాంపియన్ ఫైనల్‌కు చేరాలంటే ఈ సిరీస్ 4–0తో కైవసం చేసుకోవాలి. అయితే, ఇటీవల స్వదేశంలో న్యూజిలాండ్‌తో జరిగిన సిరీస్‌లో స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ () విఫలమయ్యాడు. కోహ్లీ మూడు మ్యాచ్‌ల్లో కలిపి 93 పరుగులే చేశాడు. మరి ఆస్ట్రేలియాతో సిరీస్‌లో అతను ఎలా ఆడతాడో అని అభిమానులు ఆందోళనగా ఉన్నారు. అయితే, ఆసీస్‌పై కోహ్లీ చెలరేగి ఆడతాడని భారత మాజీ బ్యాటర్ సునీల్ గావస్కర్ ) విశ్వాసం వ్యక్తం చేశారు. కివీస్‌పై విఫలమవడంతో ఆస్ట్రేలియా పర్యటనలో ఎలాగైనా భారీగా పరుగులు చేయాలనే కసితో ఉంటాడని పేర్కొన్నారు.

"కోహ్లీ న్యూజిలాండ్‌పై పరుగులు చేయకపోవడంతో ఆస్ట్రేలియాలో భారీగా రన్స్ చేయాలనే కసితో ఉన్నాడు. గత ఆసీస్ పర్యటనలో అడిలైడ్‌లో జరిగిన తొలి టెస్టు రెండో ఇన్నింగ్స్‌లో భారత్ 36 పరుగులకే ఆలౌటైంది. అయితే, ఫస్ట్ ఇన్నింగ్స్‌లో కోహ్లీ 70కిపైగా (74) పరుగులు చేశాడు. ఈ ఇన్నింగ్స్‌లో నాకు గుర్తున్నంత వరకు అతను రనౌటయ్యాడు. అడిలైడ్ మైదానంలో కోహ్లీ నిలకడగా ఆడాడు. అతనికి ఈ మైదానం సుపరిచితం. ఇక, ప్రస్తుతం తొలి టెస్టు జరిగే పెర్త్ స్టేడియం విషయానికొస్తే.. అక్కడ కోహ్లీ 2018–19లో అత్యుత్తమ సెంచరీ సాధించాడు. అతను ఈ మైదానాల్లో అద్భుతమైన ప్రదర్శన చేశాడు. ఇది కోహ్లీకి అదనపు ఆత్మవిశ్వాసాన్నిస్తుంది. అయితే, ఇన్నింగ్స్ ఆరంభంలో కోహ్లీకి కాస్త అదృష్టం కలిసి రావాలి. అతను క్రీజులో కుదురుకుని శుభారంభం చేస్తే భారీగా పరుగులు చేస్తాడు' అని గావస్కర్ విశ్లేషించారు.

# ఆ ఘటనతో సచిన్‌పై మరింత గౌరవం పెరిగింది : గంగూలీ



భారత క్రికెట్‌ను మరోస్థాయికి తీసుకెళ్లిన క్రికెటర్లలో సచిన్ తెందూల్కర్ (%ఘుఎఫ్త్రఱఅ ు౧వఅసబ్రీస్ఖుతీ%) , సౌరవ్ గంగూలీ (%ూశీబతీఖుజ +ఘుఅస్త్రబ్రీఎ%)ది ప్రత్యేక స్థానం. ఒకరు ప్రపంచ క్రికెట్‌లో రికార్డుల ప్రభంజనం సృష్టిస్తే.. మరొకరు టీమ్‌ఇండియాకు దూకుడు స్వభావాన్ని తీసుకువచ్చారు. ఇటీవల ఒక కార్యక్రమంలో.. ఇప్పుడున్న ఆటగాళ్లలో మీరు ఎవరి నుంచి స్ఫూర్తి పొందారు..? అని గంగూలీకి ప్రశ్న ఎదురైంది. దీనికి అతడు సచిన్ అని టక్కున సమాధానమిచ్చాడు. అతడి గొప్పతనాన్ని వివరించే ఓ ఘటనను దాదా ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నాడు.

'సచిన్.. ఎంతో ప్రత్యేకం. అతడిని నేను చాలా దగ్గరగా చూశాను. పాకిస్థాన్‌తో మ్యాచ్ ఆడుతున్నప్పుడు షోయబ్ అక్తర్ బౌలింగ్‌లో బంతి సచిన్ పక్కటెముకలకు బలంగా తాకింది. అయితే, అప్పుడు అతడు ఎలాంటి స్పందన తెలియజేలేదు. వెంటనే అతడి దగ్గరికి వెళ్లి.. బాగానే ఉన్నావా..? అని అడిగా. అంతా ఓకే అని చెప్పాడు. ఆ గాయాన్ని లెక్క చేయకుండా జట్టుకు పరుగులు చేసి పెట్టాడు. అయితే.. ఆ మరుసటి రోజు అతడు రెండు ఫ్రాక్చర్లతో కనిపించాడు. ఆ ఘటన సచిన్‌పై నాకు మరింత గౌరవం పెంచింది" అని దాదా వివరించాడు.

గాలీ కెప్టెన్సీలో సచిన్ ఆడిన విషయం తెలిసిందే. ఎన్నో మరుపురాని ఇన్నింగ్స్‌లతో వీరిద్దరూ టీమ్‌ఇండియాకు అద్భుత విజయాలను అందించారు. 2003లో జరిగిన వన్డే ప్రపంచకప్‌లో గంగూలీ నేతృత్వంలో సచిన్ ఆడాడు. అప్పుడు టీమ్‌ఇండియా అద్భుత ప్రదర్శనతో ఫైనల్ వరకు చేరుకోగలిగింది. కానీ.. ఆస్ట్రేలియాలో చేతిలో ఓటమి తప్పలేదు. ఈ ప్రపంచకప్‌లో అత్యధిక పరుగులు చేసిన ఆటగాడిగా సచిన్ (673) నిలిచాడు.

# విరాట్ ఆర్సీబీ కెప్టెనైతే.. ఆ బౌలర్‌ను తీసుకోవడం ఖాయం: మంజ్రేకర్

మరో ఆరు రోజుల్లో ఐపీఎల్ మెగా వేలం ప్రారంభం కానుంది. కనిష్ఠంగా ఇద్దరి నుంచి గరిష్ఠంగా ఆరుగురి వరకు క్రికెటర్లను ఫ్రాంచైజీలు రిటైన్ చేసుకున్నాయి. అయితే, కొన్ని టీమ్‌లు సారథులను నియమించుకోవాల్సిన అవసరం ఉంది. అందులో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు కూడా ఉంది. ఫాఫ్ డుప్లెసిస్‌ను ఆర్సీబీ రిటైన్ చేసుకోలేదు. సీనియర్ క్రికెటర్ విరాట్ కోహ్లీకి మరోసారి బాధ్యతలు అప్పగిస్తారనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. ఒకవేళ అదే జరిగితే.. తప్పకుండా యుజ్వేంద్ర చాహల్‌ను జట్టులోకి తీసుకుంటాడని మాజీ క్రికెటర్, వ్యాఖ్యాత సంజయ్ మంజ్రేకర్ వెల్లడించాడు.

"రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుకు కెప్టెన్‌గా విరాట్ కోహ్లీ వస్తే జట్టులో చాలా మార్పులు ఉండే అవకాశం ఉంది. గతంలో ఆడిన యుజ్వేంద్ర చాహల్‌ను మరోసారి తీసుకొనేందుకు కోహ్లీ ఆసక్తి చూపిస్తాడు. కానీ, వేలంలో రాజస్థాన్ రాయల్స్ నుంచి గట్టి పోటీ తప్పదు. అశ్విన్‌తో కాంబినేషన్ కోసం చాహల్‌ను తీసుకోవాలని రాజస్థాన్ భావిస్తుంది. అయితే ఆర్ఆర్ దగ్గర రూ.41 కోట్లు మాత్రమే ఉన్నాయి. కాబట్టి చాహల్ కోసం ఎక్కువ డబ్బులు పెట్టి తీసుకునే ధైర్యం చేయకపోవచ్చు" అని మంజ్రేకర్ చెప్పాడు.

"గత సీజన్‌లో ఆర్సీబీ తరఫున బరిలోకి దిగిన గ్లెన్ మ్యాక్స్‌వెల్ నిరాశపరిచాడు. రిటైన్ చేసుకోకుండా అతడిని ఆర్సీబీ పక్కన పెట్టింది. అయితే, వేలంలో మ్యాక్సీని దక్కించుకోవడానికి ప్రయత్నిస్తుందని అనుకుంటున్నా. బ్యాటింగ్‌తోపాటు బౌలింగ్ చేయడం అతడి స్పెషాలిటీ. ఒక్కసారి ఫామ్‌లోకి వస్తే అతడిని అడ్డుకోవడం చాలా కష్టం. కొత్తకుర్రాడిని తీసుకొనే బదులు డుప్లెసిస్‌ను దక్కించుకోవడం బెటర్. సీఎస్కే, ఆర్సీబీ తరఫున మంచి ఇన్నింగ్స్‌లు ఆడాడు. యంగ్ ప్లేయర్ కంటే సీనియర్, అనుభవజ్ఞుడైన డుప్లెసిస్ మంచి ఆప్షన్ అవుతుంది" అని మంజ్రేకర్ వెల్లడించాడు.



నవంబర్ 24, 25 తేదీల్లో సౌదీ అరేబియా వేదికగా ఐపీఎల్ మెగా వేలం జరగనుంది. ఇప్పటికే షార్ట్ లిస్ట్‌ను ఐపీఎల్ కమిటీ ప్రకటించిన సంగతి తెలిసిందే. రిషభ్ పంత్, కేఎల్ రాహుల్, శ్రేయస్ అయ్యర్ వంటి భారత స్టార్ క్రికెటర్లు మెగా వేలం బరిలోకి నిలిచారు.

# ఓ గురువులా అశ్విన్ చాలా విషయాలు నేర్పాడు: నాథన్ లైయన్

ఆ ఇద్దరూ ప్రత్యర్థులు. మైదానంలోకి దిగితే తమ జట్ల కోసం వికెట్ల వేట కొనసాగిస్తారు. ఒక్కసారి మ్యాచ్ బయటకు వచ్చేస్తే మాత్రం తాము ఎలాంటి దాపరికాలు లేకుండా చర్చించుకుంటామని ఆస్ట్రేలియా స్టార్ స్పిన్నర్ నాథన్ లైయన్ అంటున్నాడు. అతడు చెప్పేది భారత సీనియర్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ గురించే కావడం విశేషం. ప్రస్తుతం వీరిద్దరూ మరోసారి తలపడేందుకు సిద్ధమయ్యారు. బోర్డర్ – గావస్కర్ ట్రోఫీలో () భాగంగా ఆసీస్‌తో భారత్ నవంబర్ 22న తొలి టెస్టు ఆడనుంది. అశ్విన్ స్పిన్ టెక్నిక్స్‌ను చూసి చాలా విషయాలు నేర్చుకున్నానని లైయన్ వ్యాఖ్యానించాడు.

"అశ్విన్ అద్భుతమైన బౌలర్ అని ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. అతడి గణాంకాలే చెబుతాయి. నా కెరీర్‌లో ఎక్కువగా అతడితో తలపడ్డా. పడుతూనే ఉన్నా. అశ్విన్ నుంచి చాలా విషయాలను నేర్చుకున్నా. పరిస్థితులకు త్వరగా ఎలా అలవాటుపడాలనేది అతడిని చూసే తెలుసుకున్నా. ప్రపంచంలోనే అత్యుత్తమ బౌలర్లలో అతడూ ఒకడు. ఓ గురువుగా నాకు ఎన్నో విషయాలు చెప్పాడు. అశ్విన్ బౌలింగ్ ఫుటేజీలను చూస్తూ ఉండేవాడిని. మరోసారి ఇరు జట్ల మధ్య సిరీస్ రసవత్తరంగా మారుతుందని భావిస్తున్నా. ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ ఫైనల్‌కు వెళ్లాలంటే ఈ సిరీస్ అత్యంత కీలకం" అని లైయన్ తెలిపాడు.

పెర్త్ వేదికగా జరగబోయే తొలి టెస్టులో కనీసం నలుగురు పేసర్లు ఉండేలా భారత జట్టు చూసుకోనుంది. ఇద్దరు స్పిన్ ఆల్‌రౌండర్లలో ఒకరికి మాత్రమే అవకాశం దక్కనుందని క్రికెట్ వర్గాలు పేర్కొన్నాయి. ఈక్రమంలో అశ్విన్‌ను ( తుదిజట్టులోకి తీసుకోవాలని భారత మాజీ కెప్టెన్ సౌరభ్ గంగూలీ వ్యాఖ్యానించాడు.

# మస్క్‌కు చుక్కలు చూపిస్తున్న 'బ్లూ స్కై'..
# యూజర్లు 'ఎక్స్'ను ఎందుకు వీడుతున్నారు?

అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో ట్రంప్ విజయం తర్వాత ఎలాన్ మస్క్ షేర్లు రాణించడం అందరికీ తెలిసిందే. కానీ, ఒక్క విషయం మాత్రం ఆయనను కలవరపాటుకు గురిచేస్తోంది. తన సామాజిక మాధ్యమమైన 'ఎక్స్' ( అమెరికన్లు పెద్ద సంఖ్యలో వీడుతుండడమే దీనికి కారణం. ఇలా వెళ్లిన వారంతా బ్లూ స్కైలో చేరుతున్నారు. దీంతో ఈ కొత్త సామాజిక మాధ్యమం అనతికాలంలోనే 10 మిలియన్ల సబ్‌స్క్రైబర్లను సొంతం చేసుకుంది. అమెరికాలో యాపిల్ స్టోర్, గూగుల్ ప్లే స్టోర్‌లో టాప్ ఛార్ట్‌లో నిలిచింది.



ఇవీ కారణాలు..

రిపబ్లికన్ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ విజయంలో ఎలాన్ మస్క్ కీలక భూమిక పోషించారు. ట్రంప్ ప్రచారానికి పెద్ద మొత్తంలో నిధులు సమకూర్చడంతో పాటు ఆయన తరఫున ప్రచారం కూడా చేశారు. ఇది కొందరు అమెరికన్లకు రుచించలేదు. ట్రంప్ విజయం అనంతరం ఎలాన్ మస్క్‌కు కీలక బాధ్యతలు అప్పగించడం ఆ వ్యతిరేకత తీవ్ర రూపం దాల్చినట్లయ్యింది. ఇక 'ఎక్స్' పూర్తిగా రైట్‌వింగ్‌కు మాత్రమే పెద్ద పీట వేస్తుందన్న అంచనాలు 'అసంతృప్తులను' ప్రత్యామ్నాయ మార్గాల వైపు చూసేలా చేసింది. ఎక్స్ ఇటీవల సవరించిన టర్మ్స్ అండ్ కండీషన్స్ కూడా మరో కారణమైంది. తన ఏఐ చాట్‌బాట్ మోడల్ 'గ్రోక్'కు శిక్షణ ఇచ్చేందుకు యూజర్లు చేసే పోస్టులు, ఫొటోలను వాడుకుంటామని అందులో పేర్కొనడం మరో కారణం.

మీటింగ్‌కు రాలేదని సీఈవో ఆగ్రహం.. 99 మంది తొలగింపు

ఇంతకీ ఏంటీ బ్లూ స్కై..?

ట్విటర్ మాజీ సీఈఓ జాక్ డోర్సే స్థాపించిన సోషల్‌మీడియానే ఈ బ్లూ స్కై. 2019లో దీన్నో ఇంటర్నెల్ ప్రాజెక్ట్‌గా రూపొందించారు. తొలుత ఇన్విటేషన్ ఆధారంగా తీసుకొచ్చారు. ఈ ఏడాది దాన్ని పూర్తి స్థాయిలో యూజర్లకు అందుబాటులోకి తెచ్చారు. సెప్టెంబర్ వరకు 10 మిలియన్ యూజర్లు మాత్రమే ఉండగా.. ఎన్నికల తర్వాత దీనికి ఒక్కసారిగా క్రేజ్ పెరిగింది. ప్రస్తుతం 19 మిలియన్ యూజర్లతో ట్రెండింగ్‌లో కొనసాగుతోంది.

ఇది అచ్చం ఎక్స్‌లానే పనిచేస్తుంది. ఫొటోలు, వీడియోలు, డైరెక్ట్ మెసేజులు పంపించొచ్చు. అయితే, ఇందులో యూజర్లు ఫాలో అయ్యే అకౌంట్ల నుంచి ఫీడ్ మాత్రమే చూపిస్తుంది. వ్యక్తులే తమ ఫీడ్‌ను కస్టమైజ్ చేసుకునే సదుపాయం ఇందులో ఉంది. మిగిలిన కంపెనీల్లా యూజర్ల డేటా కంపెనీ సొంత సర్వర్లలో ఉండదు. యూజర్లు కావాలనుకుంటే సొంత సర్వర్లను వాడుకోవచ్చు. లేదా సంస్థ సర్వర్‌పై ఆధారపడొచ్చు. అయితే, మెటాకు చెందిన థ్రెడ్స్ కూడా ఎక్స్‌కు పోటీగా వచ్చినప్పటికీ.. దాని అల్గారిథమ్ పొలిటికల్ పోస్టులకు అంతగా ప్రాముఖ్యం ఇవ్వకపోవడం 'బ్లూ స్కై'కి కలిసొచ్చింది. ఇప్పటికే జర్నలిస్టులు, అథ్లెట్లు, ప్రముఖులు బ్లూస్కై ఖాతాలు తెరవడంతో తమ టీమ్‌ను పెంచుకునే పనిలో పడింది ఆ సంస్థ.

# దేశీయ విమాన ప్రయాణాల్లో సరికొత్త రికార్డ్

దిల్లీ: దేశీయ పౌర విమాన రంగంలో సరికొత్త రికార్డు నమోదైంది. దేశీయ విమాన ప్రయాణికుల సంఖ్య ఒక్కరోజులో 5 లక్షలు దాటింది. నవంబర్ 17న (ఆదివారం) ఈ రికార్డు నమోదైంది. దేశీయంగా ఒకే రోజులో ఈ స్థాయిలో ప్రయాణికుల సంఖ్య ఇదే మొదటిసారి కావడం గమనార్హం. మొత్తం 5,05,412 మంది ప్రయాణికులు విమాన ప్రయాణం చేసినట్లు గణాంకాలు చెబుతున్నాయి. తొలిసారి 5 లక్షల మార్కును దాటడం గమనార్హం.



ఈ స్థాయిలో డిమాండ్ పెరగడానికి పండగలు, వివాహ వేడుకలే కారణమని ఆ రంగానికి చెందిన నిపుణులు చెబుతున్నారు. ఈ వింటర్ సీజన్‌లో ఇదే ఒరవడి కొనసాగుతుందని ఆశిస్తున్నట్లు ప్రముఖ ట్రావెల్ పోర్టల్ క్లియర్ ట్రిప్ వైస్ ప్రెసిడెంట్ గౌరవ్ పట్వారీ ఆశాభావం వ్యక్తంచేశారు. ఆదివారం నడిచిన విమానాలు 90 శాతం కంటే అధిక ఆక్యుపెన్సీతో నడవడం గమనార్హం. మరోవైపు వివిధ కారణాల వల్ల ఆదివారం విమానాల సమయపాలన (ఆన్ టైమ్ పర్ఫార్మెన్స్- ప్రభావితం అయినట్లు గణాంకాలు చెబుతున్నాయి. ఆదివారం ఇండిగో ఓటీపీ 74.2 శాతంగా ఉండగా.. అలయన్స్ ఎయిర్ 71%, ఆకాశ ఎయిర్ 67.6%, స్పైస్‌జెట్ 66.1%, ఎయిరిండియా 57.1% శాతంగా ఉంది. అక్టోబర్ 27 నుంచి 2024 మార్చి 29 వరకు వింటర్ సీజన్ కొనసాగుతుంది. డీజీసీఏ షెడ్యూల్ ప్రకారం.. ఈ సీజన్‌లో వారంలో 25,007 విమాన సర్వీసులు రాకపోకలు సాగిస్తాయి.

# ఉద్యోగ ప్రకటనల్లో వాటిని పేర్కొనొద్దు ..
# పొరపాటు సరిదిద్దుకున్న ఫాక్స్‌కాన్




: భారత్‌లో టెక్ దిగ్గజం యాపిల్ ( ఉత్పత్తుల సప్లయర్ ఫాక్స్‌కాన్ తమ వద్ద నియామకాల్లో పాల్గొనే మధ్యవర్తులకు కీలక ఆదేశాలు జారీ చేసింది. ఉద్యోగ ప్రకటనల్లో ఇకనుంచి వయసు, లింగం, వైవాహిక స్థితి వంటి అంశాలను పేర్కొనవద్దని స్పష్టంచేసినట్లు తెలుస్తోంది.

వివాహితులను ఉద్యోగాల నుంచి తీసివేస్తోందంటూ ఫాక్స్‌కాన్ కొంతకాలంగా తీవ్ర విమర్శలు ఎదుర్కొంటోన్న సంగతి తెలిసిందే. అవివాహితులతో పోలిస్తే గృహిణులకు అదనపు బాధ్యతలు ఉండటాన్ని సాకుగా చూపుతోందని అంతర్జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి. ఈ అంశంపై న్యూదిల్లీ ప్రభుత్వం కూడా స్పందించింది. ప్రాంతీయ చీఫ్ లేబర్ కమిషనర్‌ను ఇందులో వాస్తవాలను పరిశీలించి తమకు తెలియజేయాలని పేర్కొంది.

నాడు విమర్శలపై స్పందించిన యాపిల్, ఫాక్స్‌కాన్.. 2022లో నియామకాల సమయంలో హెచ్ఆర్ పాలసీలో లోపాలు ఉన్నాయని.. వాటిని మెరుగుపర్చామని వివరణ ఇచ్చాయి. ఈ సంఘటన తర్వాత ఫాక్స్‌కాన్ రిక్రూట్ ప్రకటనల్లో మార్పులు చేపట్టినట్లు తెలుస్తోంది. కార్మికుల కోసం ఏజెంట్లపై ఆధారపడుతున్న సంస్థ.. ఇకనుంచి ఉద్యోగ ప్రకటనల్లో లింగం, వయసు, వైవాహిక స్థితితో పాటు తయారీదారు పేరును తీసివేయాలని ఆదేశించింది.

# ఎస్‌బీఐ నుంచి మరో 500 బ్రాంచీలు: నిర్మలా సీతారామన్

ముంబయి: ప్రభుత్వ రంగ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాను మరింత విస్తరించనున్నట్లు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం చివరి నాటికి దేశవ్యాప్తంగా మరో 500 బ్రాంచీల ను ప్రారంభించనున్నట్లు తెలిపారు. దీంతో బ్యాంకు బ్రాంచీల సంఖ్య 23వేలకు చేరుతుందన్నారు.




ముంబయిలోని ఎస్‌బీఐ ప్రధాన కార్యాలయం 100వ వార్షికోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నిర్మలా సీతారామన్ ప్రసంగించారు. ఈ సందర్భంగా 1921 నుంచి బ్యాంకు ఎలా విస్తరించిందో గుర్తుచేసుకున్నారు. "అప్పట్లో మూడు ప్రెసిడెన్సీ బ్యాంకులను విలీనం చేసి ఇంపీరియల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గా ఏర్పాటు చేశారు. ఆ తర్వాత 1955లో పార్లమెంట్‌లో చట్టం చేసి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాగా మార్చారు. 1921లో 250 బ్రాంచీలు ఉండగా.. ఇప్పుడా సంఖ్య 22,500కు పెరిగింది. వచ్చే ఏడాది మార్చి చివరి నాటికి మరో 500 బ్రాంచీలు అందుబాటులోకి రానున్నాయి" అని ఆర్థిక మంత్రి వివరించారు.

ప్రస్తుతం ఎస్‌బీఐ కి 50 కోట్లకు పైగా కస్టమర్లు ఉన్నారని, దేశంలోని మొత్తం డిపాజిట్లలో ఈ బ్యాంకు వాటా 22.4శాతంగా ఉందని వెల్లడించారు. డిజిటల్ పెట్టుబడులు కూడా విపరీతంగా పెరుగుతున్నాయన్నారు. రోజుకు 20 కోట్ల యూపీఐ లావాదేవీలను బ్యాంకు నిర్వహిస్తోందని తెలిపారు. ఈ సందర్భంగా ముంబయి బ్రాంచీ శత వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని రూ.100 స్మారక నాణెం ఆవిష్కరించారు. ప్రస్తుతం దేశంలో 43 ఎస్‌బీఐ బ్రాంచీలు శతాబ్దం చరిత్ర కలిగినవేనన్నారు.

# మీటింగ్‌కు రాలేదని సీఈవో ఆగ్రహం..
# 99 మంది తొలగింపు

అమెరికాకు చెందిన ఓ మ్యూజిక్ కంపెనీ సీఈఓ తీవ్ర నిర్ణయం తీసుకున్నారు. తాను నిర్వహించిన సమావేశానికి హాజరుకాలేదని ఉద్యోగులను తొలగించారు. ఒకేసారి 99 మందిపై వేటు వేశారు. మొత్తం ఆ సంస్థలో 111 మంది విధులు నిర్వర్తిస్తుండగా.. ఆ భారీ తొలగింపు చోటుచేసుకుంది. ఆ సంస్థలో పనిచేస్తోన్న ఓ ఇంటర్న్(కార్యకలాపాలు నిర్వహించే తాత్కాలిక ఉద్యోగి) పెట్టిన పోస్టుతో ఈ విషయం వైరల్‌గా మారింది.



వైరల్‌గా మారిన సందేశాలను బట్టి చూస్తే ఆ మ్యూజిక్ సంస్థ సీఈఓ పేరు బాల్డ్విన్. జాబ్‌ను సీరియస్‌గా తీసుకోలేదని తొలగింపునకు గురైన ఉద్యోగులపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. " మన ఒప్పందం ప్రకారం మీరు చేయాల్సిన పనులు పూర్తిచేయడంలో, సమావేశాలకు హాజరుకావడంలో విఫలమయ్యారు. అందువల్లే మన మధ్య ఉన్న ఒప్పందాన్ని రద్దు చేస్తున్నాను. మీ వద్ద ఉన్న సంస్థ వస్తువులను వెనక్కి ఇచ్చేయండి. అన్ని ఖాతాలను సైన్ఔట్ చేయండి. మీ జీవితాలను మెరుగుపర్చుకోవడానికి, కష్టపడి పనిచేయడానికి మీకొక అవకాశం ఇచ్చాను. కానీ మీకొచ్చిన అవకాశాన్ని సీరియస్‌గా తీసుకోవడం లేదని మీరు చూపించారు. 111 మంది ఉద్యోగుల్లో కొందరే సమావేశానికి హాజరయ్యారు. వారు మాత్రం సంస్థలో ఉంటారు. మిగిలినవారిని తొలగించాను'' అని అంటూ పంపిన సందేశంలో తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు.

కాగా, సీఈఓ తీరుపై నెట్టింట్లో తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. "మీటింగ్ గురించి ఉద్యోగులకు సరిగా సమాచారం అందలేదని నేను అనుకుంటున్నాను. సమాచారం ఉంటే.. 99 మంది హాజరుకాకుండా ఉంటారా..? ఇదంతా నమ్మశక్యంగా లేదు'' అని ఓ నెటిజన్ రాసుకొచ్చారు. "ఆ సంస్థలో ఇంకేదో జరుగుతున్నట్లు అనిపిస్తోంది. ఒక్క మీటింగ్‌కు హాజరుకానందుకు 90 శాతం మందిని అలా తొలగించరు. ఆర్థికపరమైన సమస్యల వల్లే ఎలాంటి హెచ్చరిక లేకుండా తొలగించారనిపిస్తోంది'' అని మరొకరు కామెంట్ చేశారు. మొత్తంగా ఈ వ్యవహారమంతా వింతగా ఉందని పలువురు అభిప్రాయపడ్డారు.

# ఐటీ స్టాక్స్‌లో అమ్మకాలు..
# ఏడో రోజూ నష్టాల్లో సూచీలు

ముంబయి: దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు మరోసారి నష్టాల్లో ముగిశాయి. బలహీన త్రైమాసిక ఫలితాలు, విదేశీ మదుపర్ల అమ్మకాలతో సూచీలు మరోసారి అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. ముఖ్యంగా ఇన్ఫోసిస్, టీసీఎస్ వంటి ఐటీ స్టాక్స్ సూచీలను పడేశాయి. దీంతో సెన్సెక్స్ ఓ దశలో 600 పాయింట్లు కోల్పోయింది. తర్వాత కాస్త కోలుకుంది. నిఫ్టీ 23,450 వద్ద ముగిసింది.

సెన్సెక్స్ ఉదయం 77,863.54 (క్రితం ముగింపు 77,580.31) తొలుత లాభాల్లో ప్రారంభమైంది. కాసేపటికే నష్టాల్లోకి జారుకుంది. ఇంట్రాడేలో 76,965.06 వద్ద కనిష్ఠాన్ని తాకింది. ఓ దశలో కాస్త లాభాల్లోకి వచ్చినప్పటికీ.. లాభాల స్వీకరణతో మళ్లీ సూచీకి నష్టాలు తప్పలేదు. చివరికి 241.30 పాయింట్ల నష్టంతో 77,339 వద్ద ముగిసింది. నిఫ్టీ 78.90 పాయింట్ల నష్టంతో 23,453 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 84.40గా ఉంది.



సెన్సెక్స్ 30 సూచీలో టీసీఎస్, ఇన్ఫోసిస్, ఎన్టీపీసీ, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, యాక్సిస్ బ్యాంక్ షేర్లు నష్టాలను మూటగట్టుకున్నాయి. టాటా స్టీల్, హిందుస్థాన్ యూనిలీవర్, నెస్లే ఇండియా, మహీంద్రా అండ్ మహీంద్రా, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా షేర్లు లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ 71.67 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 2596 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

# బాలయ్య కొత్త సినిమా 'డాకు మహారాజ్' టీజర్ వచ్చేసింది

హైదరాబాద్: నటుడు బాలకృష్ణ దర్శకుడు బాబీ ) దర్శకత్వంలో ఓ సినిమా తెరకెక్కుతోన్న విషయం తెలిసిందే. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై నాగవంశీ నిర్మిస్తున్నారు. %చీదీఖ% 109గా ఇది ప్రచారంలో ఉంది. తాజాగా ఈ సినిమా టైటిల్‌ను చిత్రబృందం ప్రకటించింది. 'డాకు మహారాజ్' (అనే పేరు ఖరారు చేసింది. దీనికి సంబంధించిన టీజర్ విడుదల చేసింది.

"ఈ కథ వెలుగుని పంచే దేవుళ్లది కాదు. చీకటిని శాసించే రాక్షసులది కాదు. ఆ రాక్షసులను ఆడించే రావణుడిదీ కాదు. ఈ కథ రాజ్యం లేకుండా యుద్ధం చేసిన ఒక రాజుది. గండ్ర గొడ్డలి పట్టిన యమధర్మరాజుది. మరణాన్నే వణికించిన మహారాజుది" అనే సంభాషణలతో టీజర్ మొదలైంది. "గుర్తుపట్టావా.. డాకు మహారాజ్" అంటూ బాలయ్య చెప్పే డైలాగ్స్, విజువల్స్ ఈలలు వేయించేలా ఉన్నాయి. సంక్రాంతి కానుకగా జనవరి 12న ఈ సినిమా విడుదల కానుంది.



'భగవంత్ కేసరి' తర్వాత బాలకృష్ణ నటిస్తోన్న చిత్రమిది. పూర్తిస్థాయి ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రం రానున్నట్లు సమాచారం. ఇందులో ఆయన క్లాసీ లుక్‌లో కనిపించనున్నారని టాక్ వినిపిస్తుంది. అలాగే దీనిలో పొలిటికల్ బ్యాక్‌డ్రాప్ నేపథ్యంలో ఫ్లాష్‌బ్యాక్ ఎపిసోడ్ ఉంటుందట. దీంతో అంచనాలు పెరిగాయి. భిన్న కాలాల్ని ప్రతిబింబించే కథతో రూపొందుతుండడం... ఆ కథ సాగే కాలానికి తగ్గట్టుగానే బాలకృష్ణ మూడు కోణాల్లో కనిపిస్తారని తెలుస్తోంది. ఆయన సరసన ప్రగ్యాజైస్వాల్, చాందినీచౌదరీ, శ్రద్ధాశ్రీనాథ్ కథానాయికలుగా నటిస్తున్నారు. బాలీవుడ్‌కు చెందిన బాబీదేవోల్ ఇందులో కీలకపాత్రలో కనిపించనున్నారు. మలయాళ చిత్ర పరిశ్రమకు చెందిన ఒక అగ్ర నటుడు కూడా ఇందులో నటిస్తున్నారంటూ ఇటీవల వార్తలు వచ్చాయి.

# శ్రద్ధా శ్రీనాథ్ నో చెప్పడంతో బాధపడ్డా: విశ్వక్ సేన్

హైదరాబాద్: విశ్వక్ సేన్ (ప్రధాన పాత్రలో నటిస్తోన్న చిత్రం 'మెకానిక్ రాకీ' . రవితేజ ముళ్లపూడి దర్శకుడు. మీనాక్షి చౌదరి, శ్రద్ధా శ్రీనాథ్ కథానాయికలు. ఈ సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా ఇటీవల ఓ కాలేజీలో జరిగిన కార్యక్రమంలో విశ్వక్ సేన్ పాల్గొన్నారు. సినిమా విశేషాలు పంచుకున్నారు. రవితేజ చెప్పిన కథ తనకెంతో నచ్చిందని.. అందుకే వెంటనే ఓకే చెప్పేశానని అన్నారు. ఇందులో తన పాత్ర యూత్‌కు బాగా చేరువవుతుందని తెలిపారు. అనంతరం ఆయన శ్రద్ధా శ్రీనాథ్ గురించి మాట్లాడారు. గతంలో ఆమె తన ఆఫర్‌ను తిరస్కరించిందని తెలిపారు.



"బిట్స్ పిలానీ కాలేజీతో నాకెంతో మంచి అనుబంధం ఉంది. ఇక్కడ జరిగిన ఓ పోటీలో నేను పాల్గొని అవార్డు అందుకున్నాను. ఆ తర్వాత దర్శకత్వంపై మనసు మళ్లింది. 'ఫలక్‌నుమా దాస్' తెరకెక్కించా. మంచి విజయాన్ని అందుకున్నా. 'మెకానిక్ రాకీ'లో నా రోల్ ప్రతిఒక్కరికీ తప్పకుండా నచ్చుతుంది. లోకల్ బాయ్‌గా కనిపిస్తా. ఇందులో హీరోయిన్‌గా నటించిన శ్రద్ధా శ్రీనాథ్ గురించి ఓ విషయాన్ని చెప్పాలి. 'ఫలక్‌నుమా దాస్' కోసం మొదట ఆమెనే తీసుకోవాలని అనుకున్నా. ఆమెకు కథ చెప్పడం కోసం బెంగళూరు వెళ్లా. కలిసి కథ కూడా చెప్పా. కాకపోతే ఆమె నో చెప్పింది. చేతులో డబ్బుల్లేనప్పటికీ ఖర్చు పెట్టుకొని బెంగళూరుకు వెళ్లి.. అనుకున్న పని జరగకపోవడంతో కాస్త బాధపడ్డా. ఇప్పుడు ఆమె నా సినిమాలో యాక్ట్ చేస్తుంటే ఆనందంగా ఉంది'' అని విశ్వక్‌సేన్ తెలిపారు.

యాక్షన్ కామెడీ ఫిల్మ్‌గా ఇది తెరకెక్కింది. రామ్ తాళ్లూరి నిర్మించారు. సునీల్, నరేశ్ వి.కె తదితరులు ముఖ్య పాత్రలు పోషించారు. ఈ సినిమా నవంబరు 22న ప్రేక్షకుల ముందుకురానుంది. ఇటీవల జరిగిన ట్రైలర్ విడుదల కార్యక్రమంలో విశ్వక్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ప్రేక్షకులు తప్పకుండా ఈ చిత్రాన్ని రెండోసారి కూడా చూస్తారని అన్నారు. "ఇటీవలే మా సినిమా ఫైనల్ కాపీ చూశా. చాలా నమ్మకంగా ఉన్నాం. ఇది ప్రేక్షకుల్ని సీటు అంచున కూర్చోబెట్టే సినిమా. రెండోసారి కూడా చూసే స్థాయిలో ఉంటుంది. ద్వితీయార్ధంలో థియేటర్స్ అన్నీ ఆడిటోరియంలా మారిపోతాయి. 21వ తేదీన పెయిడ్ ప్రీమియర్స్ వేయాలనుకుంటున్నాం" అని తెలిపారు.

# అభిషేక్‌ని పిలిచినందుకు బాధపడుతున్నా: అమితాబ్ బచ్చన్

ముంబయి: బాలీవుడ్ అగ్రనటుడు అమితాబ్ బచ్చన్ ( హోస్ట్‌గా వ్యవహరిస్తోన్న రియాల్టీ షో 'కౌన్ బనేగా కరోడ్‌పతి' (%16). తాజాగా ఈ కార్యక్రమంలో అమితాబ్ తనయుడు, నటుడు అభిషేక్ బచ్చన్ (సందడి చేశారు. తన తదుపరి సినిమా 'ఐ వాంట్ టు టాక్' విశేషాలు పంచుకున్నారు. దీనికి సంబంధించిన ప్రోమో తాజాగా విడుదలైంది. అభిషేక్.. తన తండ్రి వాయిస్ ఇమిటేట్ చేస్తూ కనిపించారు. కుటుంబసభ్యులందరూ ఒకేచోట కలిస్తే బిగ్‌బీని ఎలా ఇమిటేట్ చేస్తారో చేసి చూపించారు.



"డిన్నర్ సమయంలో ఫ్యామిలీ అంతా కలుస్తాం. ఆ సమయంలో పిల్లలంతా నాన్నలా 'సాట్ క్రోర్' అంటూ మిమిక్రీ చేస్తుంటారు" అని తెలిపారు. అంతేకాకుండా 'సాట్ క్రోర్' అంటూ పదే పదే బిగ్‌బీని ఇమిటేట్ చేశారు. దీంతో అమితాబ్‌తోపాటు సెట్‌లో ఉన్న ప్రేక్షకులంతా నవ్వులు పూయించారు. "ఇతడిని ఇక్కడికి పిలిచి తప్పు చేశాం" అని అమితాబ్ పేర్కొన్నారు. ప్రస్తుతం ఈ ప్రోమో నెటిజన్ల దృష్టిని ఆకర్షిస్తోంది.

దాదాపు 16 సీజన్ల నుంచి ఈ షో విజయవంతంగా కొనసాగుతోంది. మొదటినుంచి ఈ కార్యక్రమానికి హోస్ట్‌గా అమితాబ్ వ్యవహరిస్తున్నారు. కేవలం మూడో సీజన్‌కు మాత్రమే షారుక్ ఖాన్ వ్యాఖ్యాతగా చేశారు. ఇందులో ఒక వ్యక్తి దాదాపు రూ.7 కోట్ల వరకూ గెలుచుకొనే అవకాశం ఉంది.

# అదే నా ఆశ.. పవన్‌కల్యాణ్‌లో నచ్చే విషయమిదే: అల్లు అర్జున్

తెలుగు హీరోలందరి తరఫున తాను జాతీయ అవార్డు తీసుకున్నట్లు హీరో అల్లు అర్జున్ చెప్పారు. బాలకృష్ణ వ్యాఖ్యాతగా వ్యవహరిస్తోన్న సెలబ్రిటీ టాక్ షో 'అన్‌స్టాపబుల్ సీజన్ 4'కు ఆయన అతిథిగా హాజరయ్యారు. టాలీవుడ్ హీరోల గురించి ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. 'నేను కృష్ణుడిని నువ్వు అర్జునుడివి. మనిద్దరం బంధువులం' అని బాలకృష్ణ అనగా 'మీరు గీత ఇవ్వండి.. నేను కురుక్షేత్రం చేస్తాను' అని అల్లు అర్జున్ అన్నారు. ఎపిసోడ్ మధ్యలో అల్లు అర్జున్ అమ్మ నిర్మల కూడా వచ్చి బన్నీ గురించి కొన్ని విషయాలు పంచుకున్నారు. ఆ విశేషాలు మీకోసం..



గంగోత్రిలో ఉన్న అల్లు అర్జున్.. ఐకాన్ స్టార్ అల్లు అర్జున్‌కు ఏం సలహా ఇస్తాడు?

అల్లు అర్జున్: అప్పుడు ఎలా ఉన్నావో.. ఇప్పుడు అలాగే ఉండు. ఏం మారొద్దు. పనిచేస్తూనే ఉండు. అలానే ఎదిగావు. అలాగే ఉండు.

పాన్ ఇండియా స్టార్‌గా గుర్తింపు తెచ్చుకున్నప్పుడు మనసులో ఏమనిపించింది?

అల్లు అర్జున్: నేను దీన్ని అసలు ఊహించలేదు. 'పుష్ప'ను తెలుగులో విడుదల చేశాం. అలాగే అన్ని భాషల్లోనూ రిలీజ్ చేద్దాం అనుకున్నాం. ఇలా నాలుగు సినిమాలు చేస్తే.. పాన్ ఇండియా స్థాయిలో గుర్తింపు వస్తుంది అనుకున్నా. అనుకోకుండా 'పుష్ప' సినిమాకే ఆ గుర్తింపు వచ్చింది.

జాతీయ అవార్డు వచ్చినప్పుడు ఎలా భావించారు?

అల్లు అర్జున్: నా దృష్టిలో అందరూ చూసే సినిమానే కమర్షియల్ సినిమా. అందరూ అంగీకరించిన చిత్రానికి అవార్డులు రావడం లేదని చిన్నచూపు ఉండేది. దాన్ని చెరిపేయాలన్న తపనతో సినిమా చేశా. ఒక టైమ్‌లో నేషనల్ అవార్డు ఎవరికి వచ్చింది అని పరిశీలిస్తే.. ఒక్క తెలుగు హీరో పేరు కూడా లేదు. అది నా మనసులో ఉండిపోయింది. ఇంతమంది గొప్ప నటులు ఉన్నప్పటికీ వాళ్లకు జాతీయ అవార్డు ఎందుకు రాలేదని బాధపడ్డాను. అప్పుడే మనసులో అనుకున్నా.. ఎలా అయినా దీన్ని సాధించాలి అని రాసి పెట్టుకున్నా. సుకుమార్ 'పుష్ప' కథ చెప్పినప్పుడు ఈ చిత్రానికి నేషనల్ అవార్డు రావాలని చెప్పా. ఆయన చాలా కష్టపడ్డారు. ప్రతి సన్నివేశం పూర్తికాగానే నేషనల్ అవార్డు గురించే మాట్లాడుకున్నాం. నా జాతీయ అవార్డును తెలుగు హీరోలందరికీ అంకితమిస్తున్నా. అది నా నటనకు వచ్చిందని నేను భావించడం లేదు.. మీ అందరి తరఫున నాకు వచ్చిందని భావిస్తున్నా

%మనిద్దరం కలిసి పౌరాణిక సినిమా చేయాలి?

అల్లు అర్జున్: నాకు భయం సర్. (బాలకృష్ణ: నేనున్నాగా)

ఈ డైలాగులు ఎవరికి సరిపోతాయో చెప్పండి?

ఒక వర్గానికి మీరు స్ఫూర్తి: బాలకృష్ణ

మేడం సర్ మేడమంతే: పూజాహెగ్డే

మన పనిలో మంచి కనిపించాలి.. మనిషి కాదు: అల్లు అరవింద్

'పుష్ప 3' ఉందా?

అల్లు అర్జున్: వామ్మో.. ఇప్పుడప్పుడే చేయలేను. రెండు సంవత్సరాల్లో మూడు సినిమాలు చేయాలని నా ఆశ.

ఈ టాలీవుడ్ హీరోలను చూడగానే మీకు ఏమనిపిస్తోందో చెప్పండి?

అల్లు అర్జున్: మహేశ్ బాబు: అందరూ ఆయన అందం గురించే మాట్లాడతారు. కానీ.. ఆయన కమ్‌బ్యాక్స్ చాలా బాగుంటాయి. ఫెయిల్యూర్స్ తర్వాత ఆయన కమ్‌బ్యాక్స్ నాకు ఇష్టం. తెలుగు సినిమా స్టాండర్డ్స్ పెంచిన వ్యక్తి.

పవన్ కల్యాణ్: కల్యాణ్ గారి ధైర్యం నాకు ఇష్టం. నేను చాలామంది లీడర్స్‌ను దగ్గర నుంచి చూశాను. కానీ.. లైవ్‌లో దగ్గరి నుంచి చూసిన డేరింగ్ పర్సన్ కల్యాణ్ గారు.

ప్రభాస్: ఆరడుగుల బంగారం. మేమిద్దరం స్నేహితులం. నాకు చాలా ఇష్టం. ప్రతి సంవత్సరం నేను క్రిస్మస్ ట్రీ పెడతాను. ప్రభాస్‌కు ఈ విషయం తెలిసి నాకోసం యూరప్ నుంచి డెకరేషన్ ఐటెమ్స్ తీసుకొచ్చారు.

రణ్‌బీర్‌కపూర్: బాలీవుడ్‌లో ఈ జనరేషన్‌లో వావ్ అనిపించే యాక్టర్. నేను, రణ్‌బీర్ మల్టీస్టారర్ చేస్తే అద్భుతంగా ఉంటుంది.

మీనాన్న పర్సులో డబ్బులు ఎప్పుడైనా కొట్టేశావా?

అల్లు అర్జున్: ఆయన ఎప్పుడూ పర్సులో డబ్బులు పెట్టుకోరు. ముందుచూపుతో దుస్తుల మధ్యలో దాచేస్తారు.

పెళ్లికి ముందు ఎంతమంది గర్ల్‌ఫ్రెండ్స్ ఉన్నారు? వాళ్లలో ఎంతమంది గురించి మీ ఆవిడకు చెప్పావు?

అల్లు అర్జున్: ఈ టాక్‌షో నా పిల్లలు చూస్తారు. నేను చూసిన, ప్రేమించిన మొదటి అమ్మాయి మీ అమ్మ అని వాళ్లకు చెప్పాను. అందుకే ఇప్పుడు వీటి గురించి ఇక్కడ చెప్పను. అయినా.. నా లవ్ స్టోరీలు అన్నీ మా ఆవిడకు తెలుసు.

షూటింగ్స్ కు వెళ్లకుండా ఉండేందుకు ఎప్పుడైనా సాకులు చెప్పావా?

అల్లు అర్జున్: ఆ అవసరం ఎప్పుడూ రాలేదు.

ఈ తరం హీరోల్లో నీకు ఇష్టమైన హీరో ఎవరు?

అల్లు అర్జున్: ఈ తరం వాళ్లందరూ చాలా బాగా నటిస్తున్నారు. 'అర్జున్‌రెడ్డి' సినిమాలో విజయ్ దేవరకొండ యాక్టింగ్ నాకు నచ్చింది. తర్వాత నవీన్ పొలిశెట్టి. జాతిరత్నాలు పడిపడి నవ్వి చూశాను. సిద్ధూ జొన్నలగడ్డ, విష్వక్‌సేన్, అడివిశేష్‌లు బాగా నటిస్తారు. ఒకరి పేరు చెప్పమంటే మాత్రం సిద్ధూ పేరు చెబుతాన

నీకు రష్మిక () కంటే పూజా హెగ్డేతో పనిచేయడం ఇష్టమా?

అల్లు అర్జున్: నేను ఏ సినిమా చేస్తే.. ఆ చిత్రబృందం నా ఫేవరేట్. ప్రస్తుతం 'పుష్ప 2' చేస్తున్నా కాబట్టి రష్మికనే.

త్రివిక్రమ్ ఇష్టమా.. సుకుమార్ ఇష్టమా?

అల్లు అర్జున్: చేస్తున్న దర్శకుడు ఒకరు.. చేయనున్న దర్శకుడు ఒకరు.. నేను ఇప్పుడే చెప్పాను కదా.. ఏ సినిమా చేస్తే.. ఆ చిత్రబృందం నా ఫేవరేట్ అని. అందుకే సుకుమార్ అంటే ఇష్టం.

తెలుగు సినిమా ఇండస్ట్రీలో డ్యాన్స్‌లో నువ్వే టాప్ అనుకుంటున్నావా?

అల్లు అర్జున్: నిజమే సర్(నవ్వుతూ). బాలకృష్ణ గారు చెప్పారు కాబట్టి నేనే నంబర్ వన్ డ్యాన్సర్‌ని.

తెలుగు సినిమా ఇండస్ట్రీలో నీకు పోటీ ఎవరు.. ప్రభాస్.. మహేశ్ బాబా?

అల్లు అర్జున్: నన్ను మించి ఎదిగినవాడు ఇంకోడు ఉన్నాడు చూడు.. ఎవరంటే అది రేపటి నేనే. నాకు నేనే పోటీ. అలాగే నేను అందరినీ గౌరవిస్తాను.

మీ ఇల్లు చూసి ఎవరో నమ్మలేదట.. ఏంటి ఆ కథ?

అల్లు అర్జున్: నేను సరిగ్గా చదవడం లేదని స్కూల్ మార్చారు. ఆ స్కూల్‌కు కారులో వెళ్లే ఏకైక స్టూడెంట్ నేను ఒక్కడినే. మొహమాటంతో కారును రోడ్డు చివర ఆపేసి నడుచుకుంటూ వెళ్లేవాడిని. ఒకరోజు నా ఫ్రెండ్ మా ఇంటికి వచ్చాడు. అంతపెద్ద ఇల్లు మాది అంటే నమ్మలేదు. నేను, శిరీష్ ఇద్దరం ఫ్రెండ్స్‌లా ఉంటాం. చిన్నప్పుడు తెగ కొట్టుకున్నాం. నాకు, మా అన్నయ్యకు ఏజ్ గ్యాప్ ఎక్కువ.

నీకు, మీ అన్నయ్యకు మధ్య కారు గోల ఏంటి?

అల్లు అర్జున్: నాకు 18 ఏళ్లు వచ్చాక మా నాన్న కారు కొనిస్తా అన్నారు. కొత్తది కొనడానికి ఆయనకు మనసు రాలేదు. ఒక పాత కారు నాకు ఇచ్చారు. నేను, మా అన్నయ్య ఆ కారు నడపడం కంటే తోసుకెళ్లిన రోజులే ఎక్కువ. మా అన్నయ్య, నేను మిడిల్‌క్లాస్ మెంటాలిటీలో ఉంటాం. శిరీష్ అలా కాదు.

బెల్‌గ్రేడ్ ఎందుకు వెళ్లావు.. అక్కడేం జరిగింది?

అల్లు అర్జున్: నా 40వ పుట్టినరోజు నాడు ఫ్రెండ్స్ 60 మందితో కలిసి బెల్‌గ్రేడ్ వెళ్లా. ఒక మూడు రోజులు ఎంజాయ్ చేశాం.

గోవా బార్‌లో ఎందుకు కనిపించావు?

అల్లు అర్జున్: నేను ఆల్కహాల్ కు దూరం. 'నాపేరు సూర్య' సినిమా షూటింగ్ జరుగుతున్నప్పుడు.. మా ఫ్రెండ్ గోవాకు వచ్చాడు. ఏం కావాలని వాడిని అడిగితే.. ఒక బ్రాండ్ పేరు చెప్పాడు. నేను బాయ్‌ను పిలిచి చెప్పాను. తనకు అర్థం కావడంలేదని నేనే బార్‌కు వెళ్లి అడిగాను.

సాయి దుర్గాతేజ్ ఇప్పటికీ అలాగే ఉన్నాడు: పవన్ కల్యాణ్

మీ అబ్బాయ్ ఎప్పుడైనా అల్లరి పనులు చేశాడా?

నిర్మల: వీడు పెద్దైతే ఎలా ఉంటాడా అని మా మామయ్య కూడా భయపడ్డారు. అందుకే ముందుజాగ్రత్తగా వీడి పేరు మీద డబ్బులు వేశారు. కానీ.. 14 ఏళ్ల తర్వాత పూర్తిగా మారిపోయాడు. ఇప్పుడు అర్జున్ చెప్పింది.. మేము వింటున్నాం.

అల్లు అర్జున్: 15 ఏళ్లు వచ్చేవరకు మా నాన్నతో క్లోజ్‌గా ఉండలేదు. అప్పటివరకు ఆయనకు ఏది చెప్పాలన్నా.. మా అమ్మతో చెప్పించేవాడిని.

మీరు చిన్నప్పుడు ఎప్పుడైనా బన్నీని కొట్టారా?

అల్లు అర్జున్: దేనితో కొట్టలేదు అని అడగండి. అన్నిటితో కొట్టింది. నేను మాత్రం స్నేహ అనే వెపన్ వల్ల మారాను.

స్నేహ గురించి ఎప్పుడు చెప్పాడు?

నిర్మల: హీరో అయ్యాక ఒకరోజు నా దగ్గరకు వచ్చి నేను ఒక అమ్మాయిని ఇష్టపడుతున్నా. పెళ్లి చేసుకోవాలనుకుంటున్నా అన్నాడు. నువ్వు ఆ అమ్మాయితో సంతోషంగా ఉండగలవు అని అనుకుంటే చేసుకోమని చెప్పా.

అర్జున్ గురించి ఏ విషయంలోనైనా బాధపడతారా?

నిర్మల: ఒకటి అనుకుంటే ఇంక దానిగురించే ఆలోచిస్తూ ఉంటాడు. వీడు ఎవరిమాటైనా వింటే బాగుండు అని అనుకుంటూ ఉంటా. ప్రతి దాన్ని పాజిటివ్‌గా తీసుకుంటాడు. 'జయం ' సినిమా సమయంలో తనకు వస్తుందనుకున్న రోల్ రాకపోయినా బాధపడలేదు. ఏదైనా జరిగినప్పుడు దానినుంచి ఎలా బయటకు రావాలని ఆలోచిస్తుంటాడు.

# శానిటైజర్‌ను అతిగా వాడుతున్నారా..? అయితే మీ మెదడు ప్రమాదంలో పడినట్లే..!

హ్యాండ్ శానిటైజర్‌దీని గురించి తెలియని వారు ఉండరు. కరోనా పుణ్యమా అని ఇప్పుడు అంతా దీన్నే ఎక్కువగా వాడుతున్నారు. ఇంట్లో ఉన్నా, బయట ఉన్నా చేతులకు శానిటైజర్ రాసుకోవడం మాత్రం రోజూ కార్యకలాపాల్లో భాగంగా మారిపోయింది. దేన్ని పట్టుకున్నా వెంటనే జేబు లేదా పర్స్‌లో నుంచి శానిటైజర్ బాటిల్‌ను తీసుకుని వెంటనే చేతులపై రాసేసుకుంటున్నారు. అయితే, అనవసరంగా, అతిగా శానిటైజర్



వాడటంవల్ల చాలా దుష్ప్రభావాలు తలెత్తే అవకాశం లేకపోలేదు.

హ్యాండ్ శానిటైజర్ అతిగా వాడటం వల్ల మన బ్రెయిన్ దెబ్బతింటుందని ) తాజా అధ్యయనంలో తేలింది. ఒహియో కేస్ వెస్ట్రన్ రిజర్వ్ యూనివర్సిటీలోని మాలిక్యులర్ బయాలజీ డిపార్ట్‌మెంట్ చేసిన సర్వేలే ఈ విషయం వెలుగులోకి వచ్చింది. హ్యాండ్ శానిటైజర్ వల్ల మెదడులోని కణాలు దెబ్బతింటాయని ఈ అధ్యయనంలో తేలింది. మనుషుల మెదడులో ఒలిగోడెండ్రోసైట్స్ అనే కణాలు ఉంటాయి. ఈ కణాలు మెదడులోని నరాల చుట్టూ వ్యాపించి ఉంటాయి. మెదడు వేగంగా, చురుగ్గా పనిచేసేందుకు ఈ కణాలు సహాయపడతాయి. ముఖ్యంగా మన బుర్రకు వేగంగా సంకేతాలు పంపించడంలో ఇవి ముఖ్యపాత్ర పోషిస్తాయి. అయితే, ప్రస్తుతం మనం వాడే శానిటైజర్లలో ఉన్న కొన్ని రసాయనాల కారణంగా ఈ కణాలు దెబ్బతినే ప్రమాదం ఉందని తాజా అధ్యయనం చెబుతోంది.

మనం వాడే శానిటైజర్ కారణంగా అందులోని రసాయనాలు ముక్కు (వాసన), చేతులు, చర్మం ద్వారా శరీరంలోకి వెళతాయి. అలా వెళ్లిన శానిటైజర్‌లోని రసాయనాలు.. మెదడులోని నరాల చుట్టూ వ్యాపించి ఉన్న ఒలిగోడెండ్రోసైట్స్ కణాలను దెబ్బతీస్తాయని.. దీని వల్ల క్రమంగా మెదడు చురుగ్గా పనిచేయడం మానేస్తుందని అధ్యయనంలో వెల్లడైంది. ఒక్క హ్యాండ్ శానిటైజరే కాదు.. సబ్బులు,ఇంటినీ, టాయ్‌లెట్లను శుభ్రపరచటానికి ఉపయోగించే రసాయనాలను అతిగా వాడటం వల్ల సమస్యలు వచ్చి పడతాయట.

కేవలం మెదడుకే కాదు.. శానిటైజర్ అతిగా వాడటం మన ఆరోగ్యానికి చాలా హానికరమని నిపుణులు హెచ్చరిస్తున్నారు. శానిటైజర్ తరచుగా వాడినప్పుడు.. చర్మం కందిపోయి దద్దుర్లు వచ్చే అవకాశాలు ఎక్కువ. ఇందులోని ఆల్కహాల్‌తో పాటు ఉండే అనేక రసాయనాలు చర్మపు సహజ నూనెలను హరిస్తాయి. దాంతో చర్మంలోని సహజమైన తేమ తగ్గిపోయి పగుళ్లు ఏర్పడతాయి. ఈ పగుళ్ల ద్వారా బ్యాక్టీరియా చాలా తేలిగ్గా చర్మంలోకి చేరుతుంది.

శానిటైజర్లోని ఆల్కహాల్‌లో ఉండే ఐసోప్రొపనాలియన్ వంటివి చేతుల్లోని కణాలకు హాని కలిగిస్తాయి. దాంతో చర్మం పొడిబారుతుంది. ఇలా జరిగినప్పుడు డెర్మటైటిస్ ఇన్ఫెక్షన్‌లు వచ్చే అకవాశాలు ఎక్కువ. అంతేకాదు శానిటైజర్లలో ఉపయోగించే రసాయనాల పరిమళాలు కొందరికి అలర్జీ కలిగేలా చేస్తాయి. అంతేకాదు దీని వాడకం వల్ల హార్మోన్ల అసమతుల్యతకూ కారణమవుతుంది. అందులో ఉండే ట్రైక్లోసామ్ అనే రసాయనం యాంటీబయాటిక్ రెసిస్టెన్స్ బ్యాక్టీరియా పెరుగుదలకు దోహదం చేస్తుంది. అంతేకాకుండా ఈ బ్యాక్టీరియాకు యాంటీబయాటిక్‌లను తట్టుకునే సామర్థ్యమూ పెరుగుతుంది. దీంతో తేలికగా ఇన్ఫెక్షన్‌కు గురయ్యే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

# పొగ.. వదల్లేకపోతున్నారు! ‘



‘మధ్యలో వచ్చింది మధ్యలోనే పోతుంది’ అని పెద్దల మాట. అలా మధ్యలో వచ్చేది దురలవాటైతే.. వీలైనంత త్వరగా పోవడం మంచిది. కానీ, ఈ తరం మగువలు మధ్యలో వచ్చిన కొన్ని అలవాట్లను అంత త్వరగా వదల్లేకపోతున్నారట. ముఖ్యంగా వ్యసనాల్లో పడితే.. పీకల్లోతుదాకా మునిగిపోతున్నారట. ఆ దురలవాట్ల బారినుంచి పురుషులు బయటపడినంత సులువుగా అతివలు తప్పించుకోలేక పోతున్నారని తాజా పరిశోధన ఒకటి వెల్లడించింది.

మోడ్రన్ కల్చర్‌లో పురుషులతో సమానంగా పొగ తాగుతున్న మహిళలు ధూమపానాన్ని మానేయడానికి డక్కామొక్కీలు పడుతున్నారని కెంటకీ యూనివర్సిటీ (యూఎస్) అధ్యయనంలో తేలింది. మగవాళ్లతో పోలిస్తే స్మోకింగ్ మానేయడం వాళ్లకు కష్టంగా ఉందని ఆ అధ్యయన సారాంశం.

నికోటిన్‌కు అడిక్ట్ కావడానికి మహిళల్లోని సెక్స్ హార్మోన్ ఈస్ట్రోజన్ కీలక పాత్ర పోషిస్తుందని వెల్లడైంది. ఏదైనా కావాలనుకునే ఆశను వ్యక్తీకరించే మెదడులోని ఒల్ఫాక్టోమెడిన్ ప్రొటీన్ కూడా ఈ వ్యసనానికి కారణమని అధ్యయనంలో తేలింది. కాబట్టి, ఆధునిక మగువలూ.. కొత్త పోకడలకు పోయే ముందు కీడెంచి మేలెంచడం మంచిది!!

# పర్పుల్ ఫుడ్స్‌తో మెరిసే చర్మం మీ సొంతం

%ఎముశ్రీష్ట్ర ఎఅజూం% ఎ పర్పుల్ కలర్ మీకు ఇష్టమైతే మీ ప్లేట్‌లోనూ అది ఉండేలా చూసుకునే సమయం వచ్చేసింది. సహజంగా పర్పుల్ రంగులో ఉండే పండ్లు, కూరగాయల్లో చర్మ ఆరోగ్యాన్ని కాపాడటంతో పాటు ఇన్ఫ్లమేషన్‌తో పోరాడి ఆరోగ్యాన్ని మెరుగుపరిచే యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా లభిస్తాయి. పర్పుల్ వర్ణంలో ఉండే ఆహార పదార్థాల్లో మొక్కల ఆధారిత యాంటీఆక్సిడెంట్స్ పాలీపెనాల్స్ అధికంగా ఉంటాయని జర్నల్ ఆఫ్ న్యూట్రిషన్ అండ్ మెటబాలిజంలో ప్రచురితమైన అధ్యయనం వెల్లడించింది.



పాలీపెనాల్స్ చర్మ క్యాన్సర్ ముప్పును తగ్గించడమే కాకుండా చర్మం కాంతులీనేలా చేస్తాయి. ఇక ద్రాక్ష, కిస్‌మిస్‌లు అధికంగా తీసుకోవడం ద్వారా చర్మాన్ని అల్ట్రావయలెట్ రేడియేషన్‌కు గురికాకుండా నిలువరిస్తాయని పలు అధ్యయనాలు వెల్లడించాయి. ఇక బీట్రూట్ జ్యూస్ తరచూ తీసుకోవడం ద్వారా ఇన్ఫ్లమేషన్ తగ్గడంతో పాటు శరీరంలో రక్త సరఫరా మెరుగవుతుందని ఇది చర్మ ఆరోగ్యానికి కూడా మేలు చేస్తుందని వెబ్ఎండీ తెలిపింది.

ఆక్సిడేటివ్ స్ట్రెస్ నుంచి కణాలను కాపాడటంలో బీట్రూట్ కీలకంగా పనిచేస్తుందని జర్నల్ ఫుడ్ సైన్స్ అండ్ న్యూట్రిషన్‌లో ప్రచురితమైన పరిశోధన వెల్లడించింది. ఆక్సిడేటివ్ స్ట్రెస్ క్రానిక్ ఇన్ఫ్లమేషన్‌కు దారితీసి క్యాన్సర్ సహా చర్మ వ్యాధులకు దారితీస్తుంది. ఇంకా చర్మ సంరక్షణకు, నునుపైన చర్మం కోసం ప్యాషన్ ఫ్రూట్, పర్పుల్ క్యాబేజ్, వంకాయలను రోజువారీ ఆహారంలో భాగం చేసుకోవాలని పరిశోధకలు సూచిస్తున్నారు.

# ఎ ఈ ఆహారపదార్థాలతో అజీర్తి, మలబద్ధకం, కడుపు ఉబ్బరానికి చెక్

ఆధునిక జీవనశైలితో మనలో చాలా మంది మలబద్ధకం, అజీర్తి, కడుపుబ్బరం వంటి సమస్యలతో బాధపడుతుంటారు. అయితే ప్రేవుల ఆరోగ్యం పదిలంగా కాపాడుకుంటే ఈ సమస్యలను



అధిగమించవచ్చు. దైనందిన జీవితంలో ఆరోగ్యకరమైన అలవాట్లతో ప్రేవుల ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవచ్చు. ప్రేవుల ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు డైటీషియన్ మన్‌ప్రీత్ కల్రా సులభమైన మార్గాలను సూచిస్తున్నారు.

రాత్రివేళ నాలుగైదు కిస్‌మిస్‌లను నీటిలో నానబెట్టి ఉదయాన్నే వాటిని తీసుకుంటే అందులో ఉండే ఫైబర్, సహజమైన చక్కెరలు జీర్ణక్రియ సాఫీగా సాగేలా చేస్తాయని ప్రేవుల కదలికలను ప్రేరేపిస్తాయని చెబుతున్నారు. ఇక ప్రతిరోజూ నిర్ణీత సమయంలో భోజనం ముగించేలా చూసుకోవాలి. ప్రతి రోజూ ఒకే సమయంలో బ్రేక్‌ఫాస్ట్, లంచ్, డిన్నర్ తీసుకోవడం ద్వారా ప్రేవుల ఆరోగ్యం మెరుగవుతుంది.

శరీరాన్ని హైడ్రేట్‌గా ఉంచుకోవడంతో పాటు ఫైబర్ తగినంతగా అందేలా మధ్యాహ్నం 12 గంటల ప్రాంతంలో గ్లాస్‌లో ఒక టీస్పూన్ చియా సీడ్స్‌తో కూడిన వాటర్‌ను తీసుకోవడం మేలు. చియా గింజల్లో అధిక ఫైబర్‌తో పాటు శరీరానికి అవసరమైన పోషకాలు ప్రేవుల ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి. ఇంకా అవిసె గింజలు, పండ్లు, కూరగాయలు, తగినంత నీరు, ప్రొ బయాటిక్ ఫుడ్స్, రాత్రి వేళ నెయ్యి, పాలుతో పాటు పడుకునే ముందు అంజీరా పండ్లు తీసుకుంటే ఇందులో ఉండే ఫైబర్‌తో మలబద్ధకం నివారించవచ్చు.

# ముందే తినేయాలి!

రోజూ వీలైనంత త్వరగా భోజనంచేస్తే గుండె రక్తనాళాల వ్యాధుల ముప్పు తగ్గుతుందట. నేచర్ కమ్యూనికేషన్స్ జర్నల్‌లో ప్రచురితమైన ఈ అధ్యయనం కోసం పరిశోధకులు 1,03,389 మంది నుంచి ఆహార విధానాలు, గుండె రక్తనాళాల జబ్బులకు సంబంధించిన సమాచారం సేకరించారు. వీరిలో 79 శాతం మంది మహిళలే. పరిశోధనలో పాల్గొన్నవాళ్ల సగటు వయసు 42 ఏండ్లు..

వయసు, లింగం, కుటుంబ పరిస్థితి మొదలైన సామాజిక పరిస్థితులు, ఆహారంలో పోషకాల నాణ్యత, జీవనశైలి, నిద్రా చక్రాన్ని పరిశోధకులు పరిగణనలోకి తీసుకున్నారు. పొద్దున్నే టిఫిన్ చేయకుండా భోజనం చేసేవారిలో ఒక్కో గంట ఆలస్యానికి గుండె రక్తనాళాల వ్యాధుల తీవ్రత 6 శాతం పెరుగుతుందని పరిశోధకులు కనుక్కొన్నారు. అంటే పొద్దునే 9 గంటలకు తినే వ్యక్తికి 8 గంటలకే తిన్న వ్యక్తితో పోలిస్తే గుండె రక్తనాళాల జబ్బుల ముప్పు 6 శాతం ఎక్కువగా ఉంటుందన్నమాట. 9 తర్వాత ఒక్కో గంట గడుస్తుంటే ఈ ముప్పు 28 శాతం ఎక్కువగా ఉంటుందని అధ్యయనం వెల్లడించింది. అయితే, ముందురోజు రాత్రి చివరి భోజనానికి, తర్వాతి రోజు ఉదయం భోజనానికి మధ్య విరామం ఎక్కువగా ఉంటే గుండె రక్తనాళాల వ్యాధుల ముప్పు తక్కువట. అలా ఈ పరిశోధన రోజూ పొద్దున, సాయంత్రం భోజనాలు వీలైనంత త్వరగా ముగించేయాలని వెల్లడిస్తున్నది.



గ్లోబల్ బర్డన్ ఆఫ్ డిసీజెస్ అధ్యయనం ప్రకారం ప్రపంచ ప్రజల్లో మరణాలకు కారణమయ్యే వ్యాధుల్లో గుండె రక్తనాళాల సమస్యలే ముందువరుసలో ఉన్నాయి. 2019లో గుండె సమస్యలతో 18.6 మిలియన్ల మంది మరణించారు. వీటిలో 7.9 శాతం మరణాలకు ఆహారపు అలవాట్లే ప్రధాన కారణంగా నిలిచాయి. అంటే%ొా% “ఈ తరహా వ్యాధుల పుట్టుక, అభివృద్ధిలో ఆహారం కీలకపాత్ర పోషిస్తున్నదని తెలుస్తుంది. పశ్చిమ దేశాల సమాజాల ఆధునిక జీవనశైలి రాత్రి భోజనం మరీ ఆలస్యంగా చేయడం, పొద్దునే టిఫిన్ తీసుకోకపోవడం మొదలైన ఆహారపు అలవాట్లకు దారితీసింది. అయితే, ఉదయం, రాత్రి భోజనాలు వీలైనంత తొందరగా ముగించుకునే అలవాట్లను స్వీకరిస్తే గుండె రక్తనాళాల వ్యాధుల ముప్పు తగ్గించుకోవచ్చు” అని పరిశోధకులు పేర్కొన్నారు.

# ఒకేసారి లీటరు కొబ్బరి నీళ్లు తాగొచ్చా?

ఎండాకాలం దాహం కోసమో, ఆరోగ్యానికి మంచిదనో కొబ్బరి నీళ్లు తాగుతుంటాం. అయితే ఇటీవల బోండాలతోపాటు బాటిళ్లలోనూ కొబ్బరి నీళ్లను అమ్ముతున్నారు. ఇలా ఒకేసారి లీటరు కొబ్బరి నీళ్లు తాగొచ్చా? దీనివల్ల కిడ్నీల మీద ఏమైనా భారం పడుతుందా! అసలు ఒక రోజులో, లేదా వారంలో ఎన్ని కొబ్బరి నీళ్లు తాగొచ్చు తెలియజేయండి?

శరీరంలో ద్రవాల స్థాయిని నియంత్రణలో ఉంచేందుకు, ఎలక్ట్రోలైట్లను సమతౌల్యం చేసేందుకు కొబ్బరి నీళ్లు ఎంతగానో ఉపయోగపడతాయి. సోడియం, పొటాషియం, మాంగనీసులాంటివి ఇందులో ఎక్కువగా ఉంటాయి. వడదెబ్బకు, డయేరియాకు కొబ్బరినీళ్లు మంచి మందు. పొటాషియం ఎక్కువగా ఉంటుంది కాబట్టి గుండె జబ్బులు, బీపీ ఉన్నవాళ్లకు మంచిది. ఇందులో ఉండే మీడియం చెయిన్ ట్రై గ్లిజరైడ్లు చర్మానికి, జుట్టుకి మేలు చేస్తాయి. జీర్ణశక్తికి కూడా ఉపయోగపడతాయి.

పొటాషియం శరీరంలోని విషతుల్యాలను బయటికి నెట్టేసేందుకు ఉపయోగపడుతుంది. కాబట్టి కిడ్నీలకు కూడా మంచివి. అంతేకాదు కొబ్బరినీళ్లలో విటమిన్ సి ఎక్కువగా ఉంటుంది. ఇది రోగనిరోధక వ్యవస్థకు మేలు చేస్తుంది. ఇందులో విటమిన్లు, మినరళ్లు పోను 95 శాతం మంచి నీళ్లే ఉంటాయి. 20–40 ఏండ్ల మధ్య వయసున్న వాళ్లు రోజుకు లీటరు కొబ్బరినీళు



తాగొచ్చు. యాభై ఏండ్లు పైబడిన వాళ్లు ఏ ఇతర ఆరోగ్య సమస్యలు లేకపోతే చక్కగా వీటిని తాగొచ్చు. అయితే డయాబెటిస్ ఉన్న వాళు మాత్రం రక్తంలోని గ్లూకోజ్ స్థాయులను బట్టి తీసుకోవాలి. కాబట్టి, న్యూట్రీషనిస్టులను సంప్రదించి దానికి తగ్గట్టు తీసుకోవడం మంచిది.

# స్నానం తర్వాత బ్రషింగా?.. అయితే మీకు ఈ ముప్పు పొంచిఉన్నట్టే!



ఒక్కోసారి హడావుడిగా, ఏదో ఆలోచనలో ఉండి బ్రష్ చేసుకోలేదనే విషయం మరిచిపోయి స్నానం చేసేస్తుంటాం. తర్వాత గుర్తొచ్చి అప్పుడు బ్రష్ చేసుకుంటాం. ఇది ఎప్పుడో పొరపాటున ఒకసారి జరిగితే పర్వాలేదు. కానీ, అదే అలవాటుగా మారితే మాత్రం చర్మానికి నష్టమేనని హెచ్చరిస్తున్నారు ఆరోగ్య నిపుణులు. మనం పళ్లు తోముకున్నప్పుడు బ్యాక్టీరియా నోటి నుంచి చర్మం మీదకు చేరే ఆస్కారం ఎక్కువగా ఉంటుంది.

అందువల్ల నోటి చుట్టూ, గడ్డం చుట్టూ ఇరిటేషన్ వచ్చే అవకాశం ఉంటుంది. తర్వాత అది నెమ్మదిగా మొటిమలకు కారణమవుతుంది. బ్రష్ చేసే సమయంలో చర్మం మీదికి బదిలీ అయిన బ్యాక్టీరియా వల్ల చర్మం మీద పగుళ్లు కూడా ఏర్పడవచ్చని వైద్యులు హెచ్చరిస్తున్నారు. అందుకే స్నానానికి ముందే బ్రష్ చేసుకోవడం సురక్షితం. ఒకవేళ స్నానం తర్వాత బ్రష్ చేయాల్సి వస్తే ముఖాన్ని మరోసారి సబ్బుతో లేదా ఫేస్‌వాష్‌తో శుభ్రం చేసుకోవాలని సూచిస్తున్నారు.

Printed,Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Printed at Sri Muktheswara Publications, D.No. 10-1-70/A, Lingojiguda, Opp. H.P Gas Agency, Karmanghat, Saroornagar ,RangaReddy( Dist.), Hyderabad - 500035, Telangana .Published at Plot No.43,Flat No.210,Raja Rjeswari APTS,HUDA Complex,Saroornagar,Ranga Reddy(Dist),Hyderabad.500035, Telangana
Tel: 040-24044446, Fax: 040-24054446, Cell: 9440265569 Email: bharathasakti@gmail.com, RNI No. APTEL/2006/17880, Editor: Kesaram Penta Reddy